ఆంధ్రపత్రిక


సచిత్ర వారపత్రిక



4 అణాలు
10-6-'53

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY

సరుకుల బోటు



ఫోటో—శ్రీ ఎస్. నటరాజన్ (మద్రాసు).

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక


సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 45
సంచిక 41
10.6-53

విజయ నిజ వైశాఖ బహుళ చతుర్దశి; బుధవారం .

కాబోయే ఆంధ్రరాష్ట్ర రాజధానిలో కనిపించే దృశ్యం



కూలిపోయె కోటగోడలు (నవాబుల కోట)

విషయానుక్రమణిక

పంచతంత్రం:

సంధి-విగ్రహం

(బొమ్మల కథ)

ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రికలో 1953 జులై 1 వ తేదీ సంచికతో ప్రారంభించి సీరియల్‌గా పంచతంత్రం బొమ్మలకథను ప్రచురించ బోతున్నామని పాఠకులకు తెలుపుటకు సంతసించుచున్నాము.

—సంపాదకుడు.

కాలక్షేపం

"అప్పిచ్చువాడు వైద్యుడు
ఎప్పుడు నెడతెగక పారు-
నేరును ద్విజుడున్
చొప్పడిన యూర నుండుము
చొప్పడకున్నట్టి యూరు
చొరకుము సుమతీ"

తా॥ మంచిబుద్ధిగలవాడా! అప్పయిచ్చేవాడున్నూ, వైద్యుడున్నూ, ఎల్లప్పుడూ నిరంతరంగా ప్రవహించే ఏరున్నూ, బ్రాహ్మణుడున్నూ లభించే ఊరిలో ఉండు - అటువంటి సౌకర్య సదుపాయములు లేనటువంటి ఊరిలో ప్రవేశించవద్దు.

స్థూలంగా చెప్పబడినటువంటి సుఖమైన జనావాసలక్షణం ఇది. సామాన్యంగా తృణకాష్ఠజల సమృద్ధిగల ఊరిలో నివసించడం యోగ్యంగా ఉంటుంది. పశువులకు తగిన మేత ఉండాలన్నారు. మంచి నీటి సప్లయి సమృద్ధిగా ఉండాలి. కట్టె పుల్లలు (సమిధలు) బాగా లభించే ఊరు శ్రేష్ఠమైనదన్నారు. కాని, ఇదంతా తాతలనాటి పాతకాలపు నీతిపాఠం. నవనాగరిక జీవిత పద్ధతుల ప్రకారంగా యీ కాలంలో విద్యుచ్ఛక్తి సప్లయి ఉండాలి. కుళాయిలు ఉండాలి. ఆ ఊరికి రైలుస్టేషనుగాని, బస్సుసర్వీసుగాని అవసరం - అంతేకాదు. పోస్టాఫీసు, టెలిగ్రాఫ్ ఆఫీసు, తాలూకాఫీసు ఉంటే ఉత్తమం - టెలిఫోన్లు కూడా కావాలి. పిల్లలు చదువుకొనుటకు హైస్కూలుగాని, కనీసం మిడిల్ స్కూలుగాని లేకపోతే యిబ్బందిగా ఉంటుంది. ఒక ఆస్పత్రి ఉండడం అత్యంతావసరం - ఇన్ని సౌకర్యాలు ఉన్నటువంటి ఊరు, మంచి మంచి షాపులు క్షౌరశాలలు, కాఫీహోటళ్ళు, సినిమా మందిరములు కలిగి, వీలైతే అక్కడ సినిమా తారలు కూడా వెలసి, శోభాయమానంగా ఉంటే, ఆ ఊరిలో ఉండేవారి హుషారు జోరు ఇంతా అంతా కాదు. మా ఊరికి యితర ఊళ్ళవాళ్లందరూ జోహారు చెయ్యవలసిందే అంటారు. ఇన్ని విధములైన సౌఖ్యములుగల మహానగరం నగరం తాజామాల్ భోగవిలాసములతో, తాజమహల్ వంటి రమ్య హర్మ్యములతో, అంబరచుంబిత సౌధములతో విరాజిల్లుతూ ఉండాలి. అటువంటి బస్తీలు వృద్ధికావాలని కోరడమే నాగరికత. నగరములు వృద్ధికావాలనేది నాగరికత. అందువల్ల గ్రామాలకు పంగనామాలే అన్నట్లయింది.

అటువంటి మహానగరము ఏదైనా ఏర్పడి వృద్ధిపొందడమే మహద్భాగ్యం అని కలువరించేటటువంటి కాలములో, గ్రామాలలో నివసించే పల్లెటూరి ప్రజాసామాన్యపు జీవిత సౌఖ్యాభివృద్ధికి శ్రద్ధవహించే పెద్దల సంఖ్య క్రమేణా తగ్గుతోంది. ప్రజాసామాన్యం పల్లెగ్రామాలలోనే ఇళ్ళువాకిళ్లు, కొంపలు కుటీరములు ఏర్పరచుకొని, కలియో గంజియో తాగుతూ, వానకు తడిసి ఎండకు ఎండుతోంది. రాయలసీమవంటి ప్రాంతంలోని కొన్ని గ్రామాలలోని ప్రజలు వానలు లేక, పంటలు లేక, త్రాగుటకు నీరులేక అనేక సందర్భములలో స్వగ్రామాలు విడిచి "అన్నమో! రామచంద్రా!" అని అన్య గ్రామాలకు పోతున్నారు. వ్యవసాయపు కూలిపనులకై కరికోతల కాలములో రాయలసీమ జిల్లాలనుండి చాలామంది కూలిజనులు సమీపంలో ఉండే ఉత్తరసర్కారుల జిల్లాలకు వలసవచ్చి, వ్యవసాయపు కూలిపనులు ముగిసినపిమ్మట తిరిగి స్వగ్రామాలకు పోతూ ఉంటారు. కనుక, సరియైన నీటి వసతులున్నూ వర్షాధారమున్నూ లేనటువంటి రాయలసీమ ప్రాంతాలు ఆర్థికంగా హీనస్థితిలో ఉన్నవనే విషయం ఎంతసత్యమో, దాని ఆర్థికస్థితిని బాగుచేయవలెననే విషయంకూడా అంతటి అప్రతిహతమైన సత్యం. ఆ ప్రాంతాన్ని వీరి కిరవుగా

దా. వామనరావు

భాగు చేయడానికే "శ్రీ బాగు" ఒడంబడిక ఉద్దేశింపబడింది.

అంతేకాదు. ఆంధ్రరాష్ట్రం వస్తే ఆంధ్రరాష్ట్రం పాడిపంటలతో సిరిసంపదలతో భాగ్యభోగ్యములతో తులతూగుచున్నప్పుడు ఆపాడిపంటలలో భాగమును రాయలసీమవారికి లభించేటట్లు ఉత్తరసర్కారుల వారు ఉత్తరోత్తర చెయ్యరనే అనుమానమూ అపోహా రాయలసీమవారికి కలిగింది. రాయలసీమలో వర్షాలు కురియకపోవుటకు కూడా ఉత్తర సర్కారులవారేవో ప్రయోగాలు చేస్తున్నారన్నట్లుగా సర్కారులవారిమీద పణుగుతూ వచ్చారు. వారిలో ఈ అనుమానం హెచ్చినకొద్దీ, వారికి ప్రక్కతాళం వేసేటటువంటి అరవసోదరులు అవ్యాజ కరుణాకటాక్షవీక్షణములను వారిపై ప్రసరింపజేస్తున్న పతితోద్ధారకులవలె ప్రత్యక్షమైనారు. అందువల్ల దత్తమండలములు అనబడినప్రాంతాన్ని అరవవారే పెంచుకొనిపోషిస్తామన్నంత వాత్సల్యం ఆ దత్తమండలముల మీద చూపించిరి. ఇదివరకు ఒకసారి దత్తత అయిన దత్తమండలములను తిరిగి తమిళులు దత్తత చేసికొంటారనే భ్రమయీ రాయలసీమవారికి కలిగింది. అందువల్ల "ఆంధ్రరాష్ట్రంలో మేము చేరము. అరవవారే మమ్మలను దత్తత చేసికొంటారు గనుక, అరవరాష్ట్రంలోనే చేరి ఉంటాము" అని రాయలసీమవారు ఒకప్పుడు భీష్మించడం మొదలుపెట్టారు.

వారు ఉత్తర సర్కారులతో చేరకపోతే, సమాధానపడకపోతే, ఆంధ్ర రాష్ట్రం సిద్ధించదనిన్నీ, ఆంధ్రలోక కల్యాణానికి ఆటంకము కలుగుతుందనిన్నీ ఉత్తర సర్కారుల ఆంధ్రులు భయపడ్డారు. అప్పుడు రాయలసీమవారిని లాలించి, కల్యాణానికి ఆటంకం కలుగకుండా వారితో ఒప్పందం చేసికొన్నారు. "కాశీకి వెళ్లిపోతాను" అనే అల్లుణ్ణి మర్యాదచేసి, "కావలసినంత కట్నంపెట్టి పిల్లనిస్తాం - కాశీకి పోవద్దు. కల్యాణం చేసికొనుటకు రావలసినది" అని బ్రతిమాలి, తీసికొనిరాకతప్పదు. ఆంధ్ర రాష్ట్రంవస్తే, ఆంధ్రరాష్ట్రంలో లక్ష్మి తాండవమాడుతూ ఉంటే, రాయలసీమ అనుభవించడానికి ఆంధ్రశ్రీభాగం యిస్తామనే శ్రీభాగ ఒడంబడిక వ్రాసి యివ్వడమైంది.

ఆంధ్రరాష్ట్రం వచ్చింది. రాయలసీమవారు ఆంధ్రరాష్ట్రం దాటి అరవ రాష్ట్రంలో, చేరడానికి వీలులేదన్నారు. అరవరాష్ట్రానికి సరిహద్దులో ఉన్నటువంటి చిత్తూరుజిల్లావారు కూడా ఆంధ్ర రాష్ట్రంలో చేరి కష్టమో నిష్ఠురమో ఆంధ్ర



టెన్సింగ్ నార్కే

ప్రపంచంలోకల్లా ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరాన్ని జయించిన ప్రముఖ భారతీయుడు, టెన్సింగ్ నార్కే. డార్జిలింగ్ వాస్తవ్యుడయిన టెన్సింగ్ మే 29వ తేదీన, న్యూజీలాండ్ ప్రతినిధి హిలరీతో కలిసి మొదటి సారిగా శిఖరాన్ని ఎక్కాడు.

రాష్ట్రంలోనే కాపురం చెయ్యక తప్పదని చక్రవర్తుల రాజగోపాలాచారిగారు రాజావంటి మాట అన్నారు. అరవ ప్రాంతాలలోకి తొంగిచూడడానికి కూడా వీలులేదన్నారు. రాయలసీమ అరవరాష్ట్రంలో కలిసి మెలసి గైర్వాలియా అయిపోతుందేమో అనే కంగారుతో శ్రీబాగులో సంతకాలు చేశారు.

శ్రీభాగఒడంబడిక అమలుజరుపవలసిన సమయం వచ్చింది. రాయలసీమకు ధన ధాన్యములు కావలెనన్నారు. ధాన్యం సంగతికంటె రాజధాని సంగతి ముందుగా చూడవలెనన్నారు. "రాజధాని" అనే శబ్దం పైకి విన్పిస్తోంది. కాని "ప్రధాని" అనే శబ్దం నాయకుల హృదయంలో ప్రతిధ్వనిస్తోంది. మొత్తముమీద "ధాని" అనేది ప్రస్తుతం ప్రధానిలోనే ప్రధానంగా ఉంటుంది.

"రాజధాని ఎక్కడ ఉండాలి?" అనేది శ్రీబాగు ఒడంబడికలో ప్రస్తావింపబడిన విషయం - ప్రధాని యెవరై ఉండాలి అనేది కూడా ఒక శ్రీభాగ ఒడంబడికగా ఉండకతప్పదు.

రాయలసీమలో రాజధాని ఉండాలని ఒకవర్గంవారు తర్కిస్తే ప్రధాని ఎవరై ఉండాలనే ప్రశ్న కూడా అవువెంట దూడలాగున బయలుదేరుతుంది. మంత్రిపదవులు అనేవి మన నాయకులకు ముందుగా లభించే పాడిపశువులు - మొదవు వెంటబడేవి ఆబోతులు-"మొదవు కడనున్న వృషభము" చాలా అపాయకరమైనది. అటువంటి ఆబోతులవద్దకు వెళ్ళడం అంటే జనానికిభయం- "పుంగవములు" అనేది చాలా గౌరవమైన మాట. బహుశః ఆబోతులు (పుంగవములు) గౌరవింపదగినవే మన దేశమర్యాద ప్రకారంగా - ఆంధ్రనాయకపుంగవులంటే గౌరవం ఉంది. కాని, యీ పుంగవములదగ్గరకు పోవుటకు యిప్పుడు జనానికి భయంగా ఉంది. "మొదవుకడనున్న వృషభము" ఎవరినైనా చేరనిస్తుందా?

పదవులను మొదవుల కెదయై ప్రజాహృదయమును విదళించి గడ్డిపోచవలె తృణీకరిస్తూఉన్న నాయక పుంగవుల కీసమయమందు "ప్రధాని ఎవరవుతారు" అనే విషయంలో ఆ పదవీ శ్రీని భాగించుకొనుటలో శ్రీభాగ ఒడంబడిక ఒకటి ముందుగా ఏర్పడాలి. ఈ శ్రీభాగఒడంబడిక సిద్ధమైన పిమ్మట నే శ్రీబాగు ఒడంబడికను అమలుపరచడానికి కావలసిన ఓట్లు సిద్ధమవుతాయి. ఓట్లచీట్లు రహస్యంగా వెయ్యడం ప్రజాస్వాతంత్ర్య ప్రభుత్వ ధర్మం. కాని కాంగ్రెసుపార్టీ సభ్యులందరినీ అత్తగారి అధికారంక్రింది కోడళ్లవలె ఏ చీరె కట్టుకోమంటే ఆ చీరె కట్టుకోవలె నన్నట్లుగా సంజీవిరెడ్డిగారు చక్కని క్రమశిక్షణలో ఉంచుతున్నారు. ఇది ప్రజాస్వాతంత్ర్య మజా తెలియని రాయలసీమ రాచరికపు మర్యాద కావచ్చు. కాని, ప్రజాపార్టీ నాయకుడైన ప్రకాశం గారైనా ప్రజాస్వాతంత్ర్యం అంటే ఏమిటో మరచిపోయి పగావు చిత్తగించారు. రాజధానీనగర నిర్ణయార్థం ఆంధ్ర అసెంబ్లీ సభ్య సమావేశాధ్యక్షుడైన ఆంధ్ర హార్యక్షుడు ప్రకాశంగారి అధ్యక్షాధికారంలో

★ కాలక్షేపం ★

సభ్యులవోట్లు ప్రకాశంగా యివ్వవలెనని శాసించడం ప్రజాస్వాతంత్ర్యాన్ని దూషించడం - ప్రజాస్వాతంత్ర్యం అనే కోడలిని జుట్టుపట్టె యీడ్చిన అత్తగారి అధికారం అది. దుశ్శాసన తత్వం అది. సంజీవరెడ్డిగారిది సైనిక శిక్షణగాని, సభ్య శిక్షణ కాదు.

కర్నూలు నగరం (క్షమించండి కర్నూలు పట్టణం) కాబోయే ఆంధ్ర రాజధానీనగరం అని రెడ్డిగారు వరించారు. రెడ్డిగారి నిజ నివాసాభిమానవాసన కర్నూలువరకు ముక్కుముక్కుగా తగులుచుండుట వారి కింపు కావచ్చు. కాని, వారి కింపు లోకానికి కంపు కానోపు నను నేతలంపు కూడా ఉండాలి. శంకరరెడ్డిగారి కది స్వస్థానం. శంకరరెడ్డిగారు ఆంధ్ర అసెంబ్లీ సభానాయకులు కాగోరిన సందర్భంలో సంజీవరెడ్డిగారు పోటీకి వచ్చారు. శంకరరెడ్డిగారు ఆఖరు క్షణంలో ఆతురసన్యాసం అన్నట్లుగా "పోటీచేయను" అని మీసం క్రిందికి దింపి వేశారు. సంజీవరెడ్డిగారు ఏకగ్రీవంగా ఎన్నుకోబడినారు. రెడ్డీ, రెడ్డీ మధ్య పోటీ. "డీ" అంటే "డీ" అన్నారు. కాని, అది అంతా ఒక గారడీ. రాజధానీ నగరం నిర్ణయించే ముహూర్తం వచ్చింది. రెడ్డీ రెడ్డీ ఎదురెదురైనారా? "కర్నూలు"లో పెట్టండి రాజధాని అని ప్రకాశంగారు అన్నారు. అందుకు "రెడీ! రెడీ!" అన్నారు ఆ రెడ్డీ, యీ రెడ్డీ కూడా.

అక్టోబరు ఆరంభమునకు ఆంధ్రరాష్ట్రం అవతరించేసరికి, (ఆంధ్రశాసనసభ్యవర్గనాయకుడుగా ఎన్నుకోబడిన) సంజీవరెడ్డిగారే చక్కగా భుజకీర్తులు ధరించి ముఖానికి రంగు పూసికొని ముఖ్యమంత్రివేషంలో స్టేజిమీదకు (రాజకీయ రంగస్థలంమీదకు) ప్రవేశించవచ్చు. అటువంటి అదృష్టపు సిరిసుడి (పైకి కన్పించకుండా అంతర్గర్భితంగా ఉన్న ఆశావకాశరేఖ) ఆయనకు స్పష్టంగా కన్పిస్తోంది. కాని, కాంగ్రెసు పార్టీ సభ్యుల సంఖ్యాబలము ఆంధ్రశాసన సభలో సమృద్ధిగా లేదు. అందువల్ల సంజీవరెడ్డిగారి మంత్రివర్గం సమర్థంగా నిలువబడగలదా? ఇతరపార్టీలు ఏకమైతే తోకముడత పెట్టవలెనేమో? అందువల్ల ఒక్క కాంగ్రెసు పార్టీ నాయకుడే యీ మంత్రివర్గసవారీ పోయాలేడు. ఆంధ్ర అసెంబ్లీసభలోని యితరపార్టీల నాయకులు కూడా మరొక బుజము వేసికొని రెండవ కొమ్ము పట్టక పోతే ప్రభుత్వాధికార శకటం అనే ఘటం కడతేరదు. గడచి గట్టెక్కదు. కాంగ్రెసులో చేవ చచ్చిపోవడంవల్ల యింతమంది కలిసిమోయవలసి వస్తోంది. కాని, యితర పార్టీల నాయకులు కాంగ్రెసుపార్టీ నాయకునితో కలిసిమెలసి కేళీవిలాసంగా వ్యవహరించివిహరించాలంటే, యితరపార్టీల నాయకులకు గాని నాయికలకుగాని *Cabinet* లోకి (అమాత్యమందిరంలోకి) రావడానికి కొంగున కొంత సువర్ణం ముడిపెయ్యాలి. ఆంధ్రప్రభుత్వానికి ఒకే నాయకుడు కాడు. చాలా నాయకుళ్ళు తయారవుతారు. ఈ 'నాయకుళ్ళు' అనే బహువచనంలో 'కుళ్లు' అనేది ఉండకమానదు.

కాని, రెడ్లుగాని ఎడ్లుగాని, ఎర్రగుడ్డ చూస్తే బెదరిపోవుననే విషయం యీ కాంగ్రెసు పుంగవుల విషయంలో సమానంగా వర్తించునని కొందరి మతం. ఇది ఒక రెట్ట మతం కావచ్చు. కాని, ఎర్రజెండాలవారైన కమ్యూనిస్టులు ఎన్నిరెళ్లైనా వారి ఎర్రజెండాలతో ఆపగలరు. కనకదుర్గా క్షేత్రములో విజయవాడలో ఆంధ్ర రాజధానిని ఏర్పాటు చేయవలెనని కమ్యూనిస్టులు అందరికంటె ముందుగా తీర్మానించారు. ప్రజాభిప్రాయంకూడా అదే విధంగా ఘోషించింది. కాని, ఎర్రజెండాల కమ్యూనిస్టులు చెప్పినదంతా రెడ్డిసీమకు రుచించదు. "రెడ్" సీమ అంటే ఎర్రసీమ అనే అర్థం కమ్యూనిస్టు భాషలో ఉంది. కర్నూలు "రెడ్" సీమలోనే ఉన్నదన్నారు. విజయవాడ కమ్యూనిస్టులకు నిలువనీడఅయితే దానికోడ కర్నూలులో ఉన్నదన్నారు. కమ్యూనిస్టుల "రెడ్" సీమలోనే రాజధాని ఉండక తప్పదన్నారు. అట్టి సందర్భంలో విజయవాడలోనే రాజధాని ఉంటే వచ్చిన ప్రమాదంగాని, కర్నూలులో ఉంటే తప్పిన ప్రమాదంగాని ఏమీ కన్పించడంలేదు.

ఇంతకూ కర్నూలు అనేది "తాత్కాలిక రాజధాని"గానే వరించుకున్నారు. "తాత్కాలిక" అనేది నాలిక చివరనుంచి వచ్చిన మాటంటారా? నాభివద్దనుంచి వచ్చినమాట అంటారా? నిజంగా విజయవాడ అనేది ఆంధ్రదేశానికి "తాత్కాలిక రాజధాని" అనేమాట నాలుక చివరనుంచి ఎవరైనా అనగలరా? ఆంధ్రదేశానికి అది నడిబొడ్డుగనుక నాభివద్దనుంచి వచ్చినమాట అయి తీరుతుంది.

అట్టి కనకదుర్గాక్షేత్రం, కృష్ణాతీరం ఆంధ్ర మంత్రులకు దుర్గమప్రదేశం అయిందా? కృష్ణాతీరానికి వస్తే వారి తృష్ణ తీరదా? అయినా, "బెజవాడ" అనే పేరును ఉన్నది ఉన్నట్లుగా ఉండనీయక, దానిని "విజయవాడ"గా మార్చడం ఎందుకు? బౌద్ధభిక్షువులు "బిక్కలు" ఉండేటటువంటి 'బిక్కవాడ' 'బెజవాడ' అయింది. అనేక శతాబ్దాలనుంచి ఆపేరు శాశ్వతంగా శిలాశాసనంగా ఉంది. భిక్షుమెత్తెడి బౌద్ధసన్యాసుల వాడగా ప్రసిద్ధి కెక్కింది. కాని, 'సన్యాసి ఊరు' అన్నట్లుగా ఆపేరు ధ్వనిస్తోంది అనే తలవంపు తలంపుతో అది దర్పంగా ధ్వనించడానికి 'విజయవాడ' అని మార్పు చేశారు. కొంతకాలందాకా పుట్టిన పిల్లలు బ్రతుకక పోతే, ఆటుపిమ్మట పుట్టిన పిల్లవానికి 'సన్యాసయ్య' అనే పేరు పెట్టుకున్న తల్లిదండ్రులు చాలామంది ఉన్నారు. అటువంటి పేరుపెట్టుకున్న తర్వాత ఆ బిడ్డ పెరిగి పెద్దవాడై తలిదండ్రులకు పేరుప్రతిష్ఠలు తెచ్చి వంశోదారకుడై లోకోద్ధారకుడై వృద్ధిలోనికి రావడం కలదు - అయినా, విజయుడు (అర్జునుడు) హిమాలయ పర్వతాలు దాటి చాలా ఉత్తరంగా వెళ్ళినాడనిన్నీ అక్కడ ఉన్న యింద్రకీలాద్రి పర్వతంలలో తపస్సు చేశాడని భారతంలో ఉంది. ఆంధ్రభారతంలోకూడా ఉంది. ఆ పర్వతం ఆంధ్ర భారతంలోని ఒక పర్వంలో చెప్పబడి ఉంది. కాని, అది ఆంధ్రపర్వతంగా లేదు. ఏమైనప్పటికీ, కర్నూలు ఆంధ్రరాజధానియైతే, విజయవాడలోని దుర్గ దూరంగా ఉండి ఆంధ్రుల కదే ముక్తిమార్గం అంటుందా? "దుర్గా సర్వలోకేశ్వరీ?" అని ధ్యానించిన వారికి ఆమె సదా మోక్షమార్గం చూపించింది గాని, వ్యర్థమనోరథులను చేయలేదు. ఆ మహాశక్తి యొక్క వాత్సల్యం అటువంటిది.

"ఈ వాత్సల్యము నీకు దక్క
మరియొందే గంటిమే భూస్థలిన్?
"నీవాడన్ నను బ్రోవు"మన్న ను
భవానీ! బ్రోతు వల్లప్పుడున్;
భావాతీతము నీదు రౌద్ర
మని; నెవ్వారైన శాత్రవుల్
లావున్ రూపును బిల్కుమార్చ-
దవు దుర్గా! సర్వలోకేశ్వరీ!"

దుర్గ తల్చుకుంటే ఎవ్వరూ అక్కడ నిల్వలేరు. అనిన్ (యుద్ధములో, పోరాటములో) ఆమెయొక్క రౌద్రం భావాతీతము. ఎదిరిపక్షమువారియొక్క 'లావున్ రూపును' నిర్మూలించి, వారిని తన భక్తులనుగా చేస్తుంది. కాబట్టి ఆ దుర్గాక్షేత్ర ప్రభావము ఎటువంటిదో తెలిసికొని ప్రవర్తించడం చాలా

అవసరం! తస్మాత్ జాగ్రత! జాగ్రత!
రాయలసీమవాసులు ఆంధ్ర తాత్కాలిక రాజధానీ నగరం కర్నూలులోనే ఉండాలని నేడు తీర్మానించవచ్చు. నేడు సంజీవరెడ్డి ప్రభృతులు కర్నూలు కామేష్టి పూర్తిచేయవచ్చు. కాని, హే! రాయలసీమా! ఆ కర్నూలును రాజధానీ నగరం చేయాలంటే చాలా తైలం ఖర్చు అవుతుంది. ఈ 8 కోట్లకుపైగా ఖర్చు చేస్తేనే దాన్ని మస్తాబుచేసి కర్నూలు నవాబులాగున తయారుచేయడ మవుతుంది. చాలా చమురు ఖర్చు కావాలి. మీసాలకు సంపంగినూనె కావాలి. ఆంధ్రరాష్ట్రంలో

(56-వ పేజీ చూడండి)



మంగళ వాయిద్యాలతో సహా ఫెళ్లుమంటూ పెళ్ళయేసరికి భళ్ళున తెల్లారింది. వాయిద్యగాళ్ళు వాద్యాలు మూటకట్టి సద్దుతున్నారు. మెత్తటి నిశ్శబ్దం ఏర్పడింది. తెల్లటి ఉదయాన చల్లటిగాలి వస్తూంటే పెళ్ళి జరిగిన ఆ తోటలో కళ్యాణశోభ వెల్లివిరిసింది. పిల్లలు నిద్రలేచారు. పెళ్ళిమంటపం శుభ్రం చేసి తరవాతి కార్యక్రమానికి సన్నాహాలు సాగిస్తున్నాడు వియ్యన్నగారు.

అందరూ ముఖాలు కడుక్కొని, కొందరు స్నానాలుచేసి మళ్ళా పందిట్లోకి చేరేసరికి, ఫలహారాల ఆకులు పరిచివున్నాయి. పెద్దవాళ్ళు పెద్దరుగుమీద విడిగా కూర్చున్నారు - పెండ్లికొడుకుతో మాట్లాడుతూ, పెళ్ళికొడుకు తమ్ముడు నరసు అక్కడికి చేరాడు కానీ వాళ్ళ మావయ్య గసిరాడు, "పెద్దవాళ్ళ మధ్య నువ్వెందుకురా సత్రకాయ వెధవా" అని.

పందిట్లో కూచున్న చిల్లర సత్రకాయలు ఘకాలున నవ్వారు. నరసుకి ఉక్రోశం వేసుకొచ్చింది. ఒక్కమాటు ఇటూ అటూ చూశాడు. అరునొక్కటి ఆలాపించాడు. కాళ్ళు నేలకేసి బాదుతూ గట్టిగా, అస్పష్టంగా తిట్టుకుంటూ వంటింటికేసి బయలుదేరాడు.

పెద్దరుగు చివరనే కూర్చున్నారు సుబ్రహ్మణ్యంగారు. పక్కనించి పోతున్న నరసు చొక్కా పట్టుకుని దగ్గరికి లాక్కున్నాడు. "లేదు బాబూ, ఏడవకూడదు. మొగాళ్ళు పైకి ఏడవరు. ఇక్కడ కూచో" అంటూ తనపక్క కూర్చోపెట్టాడు.

అరుగుమీద కూచున్న ఆరుగురు పెద్దలూ, పెళ్ళికొడుకూ బ్రహ్మాండం బద్దలయ్యేట్టు నవ్వారు - రిహార్సల్ వేసుకుని నవ్వుకి సిద్ధంగా వున్నట్టు.

నరసు ఏడుపు మాని బిత్తరపోయి చూశాడు. వాడికి సందేహం వచ్చింది - ఇపుడు వాళ్ళు నవ్వింది తననిచూశా, సుబ్రహ్మణ్యంగారు ఏదో అన్నదానికా అని. ఏమైతేనేం, తను పెద్దాళ్ళమధ్యన కూచున్నాడు. గర్వంగా చూశాడు పందిట్లో సత్రకాయలకేసి. కాని వాళ్ళంతా ఇడ్లీలోకి చట్నీ ఎక్కువ వేయించుకోనే గొడవలో పడివున్నారు. మళ్ళీ సుబ్రహ్మణ్యంగారివేపు చూశాడు. ఎందుకో వాడికి ఆయన్ని చూస్తే దేముడు జ్ఞాపకం వచ్చాడు. దేముడు మంచివాడు. దేముడు అందరికీ సాయం చేదుస్తాడు. ఆ మాటకొస్తే అసలు అన్నీ ఇచ్చేది దేముడే. నీరు కావి పంచె

"రవణ"

కట్టుకున్నాడాయన. కోలగా దోసకాయలావున్న పెద్దముఖం వాలి గుబురుగా వున్న మీసాలు. చక్కగావున్న పళ్ళు, కళ్ళుకూడా చాలా నచ్చాయి నరసుకి. సుబ్రహ్మణ్యంగారు ఎప్పుడూ ఏడవరుగా మోసు. ఆయన ఏడిస్తే, కోప్పడితే ఎలా వుంటుందో వాడికి తోచలేదు. ఎప్పుడూ నవ్వుతూ, పలకరిస్తున్నట్టుంటాయి ఆయన కళ్ళు.

అరుగుమీదకూడా ఇడ్డెన్లు వచ్చాయి. మడిగట్టుకున్న వంటబ్రాహ్మడు తెచ్చాడు, వేరే 'స్పెషల్' గిన్నెలో. ఆకులు వేసి మంచి మంచి ఇడ్డెనలు, విరిగిపోనివి పెట్టాడు. పచ్చడికూడా చాలా వేశాడు. వాళ్ళన్నయ్యకి మాత్రం వెండిప్లేటులో పెట్టాడు. నరసు అన్నకేసి చూశాడు. వాడు తనకేసి చూడతే. అబ్బో వాడికింత గొప్ప! ఎలాగయితేనేం వాడొక్కడికే పెళ్ళయినట్టు.

సుబ్రహ్మణ్యంగారు వీపుతట్టారు. "ఊ! కానీ" అంటూ. అందరూ తింటున్నారు. వంటబ్రాహ్మడు మాత్రం వాగుతున్నాడు- "అయ్యా మీకండీ...అయ్యా మీకు... ఒక్కజత...అయ్యా మీకండి సుబ్రహ్మణ్యంగారు...మొహమాటపడకండయ్యా...అహాఁ. మీరు పారేసినా సరే వేసితీరతా - ఎలా పారేస్తారో"

సుబ్రహ్మణ్యంగారు నవ్వారు "ఎందుకయ్యా ఆ బలవంతం. కావాలని ఏడుస్తున్న కుర్రవెధవల కెయ్యరాదూ! నాకు చాలు."

నరసు ఎడంపక్కనుండి నవలబడుతున్న ఇడ్డెనుగల నోరు ఏదో అంది. నరసు చూశాడు, పక్కకి-సినిమా పాటలు రాశానని చెప్పే జునపాలకవి. పూర్వాశ్రమంలో ఈయనది పొరుగూరే. హఠాత్తుగా మాయమైపోయాడు. తరవాత పట్నంలో సినీమా కంపెనీలో అన్నయ్యకు కనపడ్డాడు; పెళ్లికొడుకు ఫ్రెండు. చాలామంది తనవేపు చూడగానే జునపాల కవి ఇడ్డెను మింగేసి అన్నాడు. "ఆ మాట నిజమేనండి"

"ఏమాట?" అన్నారు సుబ్రహ్మణ్యంగారు.

"అదే. అదే. ఇపుడు మీరన్నది"

"నే నేమన్నాను?" సుబ్రహ్మణ్యంగారు చాలా అమాయకంగా అడిగి మంచినీళ్ళు తాగుతున్నారు.

"హిహి...హి......అదేనండి. మొహమాటం సంగతే. మీరన్నది నిజమేనన్నా"

అందరూ సుబ్రహ్మణ్యంగారి వేపు చూశారు. ఏమంటారో నని. నెమ్మదిగా గ్లాసు కిందపెట్టి ఆయన అన్నారు "నేనన్నది నిజమేనని నువ్వంటూనంటావ్"

"ఆ! అంతేనండి" అన్నాడు కవి.

"ఐతే ఇపుడు నేనన్నది నిజం కాదన్నదెవరు?"

అంతా గొల్లున నవ్వారు. నరసుకూడా

నవ్వాడు. కవి సకిలించాడు. పెళ్ళికొడుకు మంచినీళ్ళగ్లాసు అడ్డం పెట్టుకున్నాడు కాబట్టి నవ్వాడో లేదో నరసుకి తెలీలా.

రోజూ పేపరు చదివే పంచాయితీబోర్డు మెంబరు ఆవలిస్తూ అన్నాడు.

"హాఁ! ఏవిడో శంల్టి! హే య్! మనం ఉన్నవాళ్ళం తిన్నంత తిని పారేస్తున్నాం. లేనివాళ్ళు మనం పారేసినంత దొరికితే చాలని ఏడుస్తున్నారు. ఏవిడో! మరీ కరువొచ్చి పడిపోయిల్దీ......నేహ్రూ ఏదో చదువుతాడు ప్రణాళికలు"

ఎవరూ మాట్లాడలే.

జనపాలాయన ఏదో అనబోయాడు. కానీ అందరూ సుబ్రహ్మణ్యంగారివేపు చూస్తున్నారని వూరుకున్నాడో, పోతేలే ఏమీ తట్టక ఊరుకున్నాడో, మొత్తానికి ఊరుకుని, వెళ్ళొద్దుతున్న జనపాలకేసి చూచుకుంటున్నాడు.

సుబ్రహ్మణ్యంగారిలో విజ్ఞత వుందని అందరికీ తెలుసు. ఆ వెలుగు ఆయనకళ్ళల్లో అందరూ యిపుడు చూశారు.

ఈ సంగతి సుబ్రహ్మణ్యంగారు గ్రహించారు. అదే ఆయన గొప్పతనం. అడిగించుకొని మరీ చెబుతాడు.

పంచాయితీ మెంబరు కొంచెం జంకాడు. జనపాలాయనకి జరిగిన సన్మానమే తనకి జరుగుతుందని.

సుబ్రహ్మణ్యంగారన్నారు "ఆఁ! అదేం మాటలెండి. ఉన్నవాళ్ళు వున్నది తిన్నదాకా నమ్మకమేదీ! ఇంగ్లీషువాడు అననే అన్నాడు - చేతిముద్ద నోటి కెక్కడానికెన్ని అవాంతరాలో అని. ప్రాప్తం వుండద్దండీ ప్రాప్తం!"

కొందరు "హుఁ" అన్నారు ముక్కుతో. ఇద్దరు పెదిమలు విరిచారు. ఇద్దరికిలించారు.

షావుకారు శేషయ్య గొంతుక వినపడింది ఏమిటా! అని నరసు కుడివైపు చూచాడు. పెళ్లికూతురు అత్తయ్య గొంతుక అది. ఆవిడ కాఫీ తెస్తూ సుబ్రహ్మణ్యంగారి సూక్తులు విన్నదై, ఓపిక తెచ్చుకున్నదై ఈ విధంగా అన్నదైనది.

'హుఁ! అంతే బాబూ! ప్రాప్తం ఉండద్దూ! ప్రాప్తం!" సన్నితంగా సన్నంగా అనాల్సిన వాక్యం కాస్తా, పెళ్లిగోలలో వెలుగు రాచుకపోయిన గొంతుక కోమటి శేషయ్యాని గుర్తుకు తెచ్చింది. ఏమనుకుందో, ఆవిడ హఠాత్తుగా ఆవాక్యం త్రుంపేసి "కాఫీ పుచ్చుకోండి బాబూ" అంది రహస్యం చెబుతూన్నట్టు.

సుబ్రహ్మణ్యంగారు ధనియాల కాఫీ తీసుకొన్నారు: రెండు గుక్కలు తాగి శూన్యంగా చూశారు. లేకపోతే ఆలోచనలో వున్నారో!

పంచాయితీ మెంబరు నసిగాడు.

సుబ్రహ్మణ్యం గారన్నారు "ప్రాప్తం వుండొద్దూ. జ్ఞాపకం వుందో లేదో మీకు. ఆ మధ్య అన్నిటి మీద కంట్రోళ్ళు-పప్పుల దగ్గరనించీ కరువు. ఆఖరికి ఇడ్లీ కూడా 'బాన్' చేశారు. మొహం వాచాం ఇడ్డెనుకీ, మినపరొట్టికీని. యుద్ధం రోజుల సంగతినే చెప్పేది. అప్పుడు పట్నంలో వున్నా. పదిరోజులు పనిమీదవెళ్ళా. మా మేనత్త తోటి కోడలు మొగుడు అక్కడ పని చేస్తున్నాడు. వాళ్లింట్లో బస" కాఫీ చల్లారిందేమో గడగడ తాగేశారు. పెళ్లికొడుకూ జనపాలాయనా సిగరెట్లు ముట్టించారు. నరుసు హఠాత్తుగా లేచిపోయాడు. తోటలో వాళ్ళబావ బీడీ తాగుతూంటే దగ్గరగా చూడడానికి. బావ మంచివాడు.

"ఆయ" అన్నాడు పంచాయితీ ఆయన పంచబిగించి.

"అతగాడి పేరు రామావతారం. అవతారం అనే వాళ్ళం. ఏదో గుడ్డల కంపెనీలో పనిచేసేవాడు. ఒతి వెర్రిబాగులవాడులెండి. అతగాడి పెళ్ళాం శాంతమ్మవుందే-



గుమ్మంలో కాలెట్టగానే ఆవిడడిగింది. "ఏమండి మినుపులేవీ "మినుపు లేవీ?" బిక్కమొహం పెట్టాడవతారం.



"అరెరె! అందులో ఫిల్ములేదోయ్!"
"లేకపోతే లేకపోయిందిలే! ఇప్పుడు ఫిల్ము లోడ్ చేసేవా శా ఆ పాత్రురాల జంట కదలకుండా అల్లా కూర్చుంటాయా మరి?"

★ ప్రాప్తి ★

మహా యిల్లాలు. చల్లటి వేళ తలుచుకో వాలి..." సుబ్రహ్మణ్యంగారు ఒక పట్టు లాగారు. పంచాయితీ ఆయన మరో పట్టడిగి మంచి చేసుకున్నాడు.

కాఫీ తెచ్చిన పిన్నిగారు చిన్నరుగుమీద కూచుని "హుఁ! అంతేనండి" అని బొంగురు గొంతుకతో ఆఫ్రికా కోకిలలాగ అన్నది. నరుసు వాళ్ళ బావ బీడీ కాల్చడం పూర్తిగా చూసేసి గాలిదుమారంలా వచ్చి సుబ్రహ్మణ్యంగారి దగ్గర కూచున్నాడు. ఆయన వాడ్ని దగ్గరకు తీసుకుని జుట్టు నిమురుతూ అవతారం కథ సాగించారు.

"పాపం ఏం చేసేదో ఎలా తెచ్చేదో అన్నపూర్ణాదేవిలాగ సుష్టుగా అన్నం పెట్టేది. నేనో పదిరోజులున్నా లెండి. కరువాకాటకమా అన్నారు. ప్రతిదానికీ కంట్రోళ్ళు. మాంచి యుద్ధం రోజులు... నిజంగా అబ్బాయ్! చెబుతావినూ. తెల్లవాళ్ళూ తెల్లవాళ్ళూ చేసుకునే యుద్ధం పట్నంలో వున్న బియ్యం, మినప్పప్పూ, కిరసనాయిలుతో కొడుగడా అనిపించేది. కొన్నాళ్ళపాటు హోటళ్ళలో కూడా ఇడ్డెనలు బర్తరఫ్ చేశారు. ఇంటాబయటా కూడా ఇడ్డెన్లు లేక ప్రాణానికి మహా ఇదైపోయేది సుమా... నేను వచ్చేసే ముందర కాబోసు. ఏదో పండుగొచ్చింది. పండుక్కి పొద్దున్న ఇడ్డెనలు మధ్యాన్నం మినపరొట్టే, అవడలూ తిని తీరాలన్నాడు అవతారం. వాడి పెళ్ళాం నవ్వింది. "ఏదో శాస్త్రం చెప్పినట్టుందండీ" అంటూ.

అవతారం ధీమాగా నవ్వాడు.

"హుఁ! నీకేం తెలుసే. సాయంత్రానికి అడ్డెడు మినుములు తేపోతే చూడు. మా ఆఫీసులో అందరికీ చెప్పేను. నాలుగైదు దుకాణాల వాళ్ళకీ, ఇద్దరు హోటలువాళ్లకీ. ఆఁ! ఎల్లుండి పండక్కి నువ్వు మినపరొట్టె చేస్తావు-నేను తేనె ముంచుకుని తింటాను" అన్నాడు గుర్లెగరేస్తూ.

"ఐతే బ్లాకులో తెస్తావుటోయ్?" అన్నా నేను.

"అబ్బెబ్బే. పలుకుబడి లెండి" అన్నాడవతారం మళ్లీ గుర్లెగరేస్తూ.

అవతారం పెళ్ళాం అంది తిప్పుకుంటూ "ఆఁ! పలుకుబడి కేం లెండి, చాలా వుంది గాని, డబ్బు తగలేసి కొనబోకండి. నేను శేరు కొన్నాను నిన్న సాయంత్రం".

అవతారం మూర్ఛబోయినంతపని చెయ్యబోయి ఆఫీసుకి టైమవుతోందని, కోటేసుకుంటూ చేతనైనన్ని వాక్యాల్లో పెళ్లాన్ని ఎడా పెడా వాగిడేసి బయటికిపోయాడు. నేను బజారు కెళ్లాను - ఏదేనా కొందామని. ఆ మూడో నాడే పండగ.

చంకలెగరేసుకుంటూ ఆఫీసుకెళ్ళాడవతారం. సరే ఒంటిగంటకి హోటలు కెళ్ళాడట టిఫిను తిందామని. రెండుగంటలకి ఆఫీసుకొచ్చేసరికి అత గాడిబల్లమీద ఓడాల్డా డబ్బా వుందట. ఆఫసులో తోటి ఉద్యోగులు, అవతారం స్నేహితులు ఆ డబ్బా చుట్టూనుంచుని ఊహూ! మురిసి ఇదైపోతున్నారు. అవతారం రాగానే అందులో ఐదారుగురు బండి తోలేవాడి చప్పుడు చేశారు.

"కొట్టవయ్యాభాన్సు - మినపరొట్టె భాన్సు"

అవతారం తెల్లబోయి చూశాడు. పెద్ద మనిషిలా కనబడే మరో ఆయన అన్నాడు. "ఏమయ్యా ఎవరికో చెప్పావుటగా - మినుములు కావాలని. తెచ్చిపెట్టి పోయాడు. డబ్బుకి తరవాత వస్తాడట. "నాకు సగం యిద్దూ" అని. అవతారం సంతోషాశ్చర్య సంభ్రమావతారాలను వరుసక్రమంలో దాల్చాడు. ఇంట్లో మినుములున్న సంగతి వాళ్లకి చెప్పేసి ఇవి అమ్మేద్దామనుకున్నాడు. కానీ నోరురాలే. చవటనవ్వు నవ్వాడు అవతారం. "ఆ! ఇన్నాళ్లనించి మినపరొట్టెకి వెంగెట్టుకున్నాయన మనకెందుకిస్తాడులే" అన్నాడాయన. అంతా వాళ్ళవాళ్ళపనులకి సర్దుకున్నారు.

సాయంత్రమయింది. డబ్బా చంకనెట్టుకుని బయల్దేరాడింటికి. బస్సుస్టాండుదగ్గర నించున్నాడు. అవతారం పొరుగింటాయన హఠాత్తుగా తటస్థించాడు. ఆయన 'ఏమండోయ్'అంటే ఈయన 'ఏమండీ'అన్నాడు. తరవాతాయన 'ఏమిటి విశేషా' లంటే, ఈయన 'ఆఁ! ఏముంటాయ్ విశేషా' లన్నాడు. ఇద్దరూ 'ఊఁ!' అన్నారు. ఊరుకున్నారు. ఆయన్ని చూస్తే అవతారానికి ప్రేమ ప్రకోపించింది. సినిమాలో ఇరుగు పొరుగులపాట గుర్తుకొచ్చింది. తన కెలాగా యింట్లో మినుములున్నాయికదా! ఇపుడు తనడబ్బాలో రెండుశేర్లుంటాయి. ఇంటి

గగ్గరవి యీయనకిస్తే?.....పిల్లలవాడు, పాపం తింటాడు. అయినా పూరికే గాదుగా.

అవతారం అడిగాడు "ఏమండీ మినుములు కావాలా" అని.

తృప్తిపడ్డాడుఆయన. ఆయనపేరు రామారావు. అవతారంవివరించాడు. 'ఈ డబ్బాలో అడ్డెడున్నాయండి. ఇంటిదగ్గర ఓ శేరున్నాయి. మీక్కావలిస్తే ఆ శేరు తీసుకో వచ్చు' రామారావుగారి కృతజ్ఞత కళ్లంట కారిపోయింది.

బస్సొస్తోంది. ఎవడో ఇంతలో అవతారం కోటట్టుకుని లాగాడు. వెనక్కి తిరిగాడు అవతారం. వాడన్నాడు "మీతో ఒక్కమాట"

అవతారం సందేహించాడు.

"చాలా అర్జంటు"

అవతారం బస్సువేపు చూశాడు. రామారావు బస్సులో వున్నాడు. "మీ రెళ్లండి నేనొస్తా వెనకనించి" అన్నాడవతారం. బస్సు వెళ్లింది.

"ఊఁ! ఏమిటయ్యా?"

"అహ......వేరేంలేదు. మీదగ్గర మినుములు నాకు అమ్మతారా అని."

ఘరుమన్నాడవతారం. నేనెందుకమ్మాలయ్యా? అమ్మడం ఎందుకు. ఎందుకమ్మటం?"అని.

అంతా అననిచ్చి వాడన్నాడు. "రెండు శేర్లకీ అయిదురూపాయిలిస్తా. డబ్బాకి పావలాకూడా"

పాతిక క్షణాల్లో అవతారం ఆలోచించాడు. ఎలాగైనా అయిదురూపాయి లయిదురూపాయిలే! రామారావుగారికి ఎగేసి ఇంట్లో శేరుతోటే తాను మినపరొట్టి తినొచ్చు. ఈ అయిదూ మరోకందుకుంటాయి.

"ఊఁ!" అన్నాడు.

అవతలవాడు అయిదు రూపాయిల కాయితమిచ్చి డబ్బా పుచ్చుకున్నాడు. వెంటనే బస్సెక్కాడు.

అవతారం కాఫీతాగొచ్చిబస్సెక్కాడు.

ఆరుగంటలయింది అవతారం యిల్లు చేరే సరికి. నే నరుగుమీద కూర్చున్నాను. అతడి భార్య గుమ్మంలో నించుంది. అవతారం గబగబా వచ్చేస్తున్నాడు. గుమ్మంలో కాలెట్టగానే ఆవిడడిగింది.

"ఏమండీ మినుపులేవీ?"

"మినుపులేమిటి?" బిక్కమొహం పెట్టాడవతారం.

"అదేనండీ! మీ కాఫీసులో ఎవరో యిచ్చిపోయిన అడ్డెడూనూ"

"నీకెవరు చెప్పారు?"

"పొరుగింటి రామారావుగారు మీకు కనబడ్డార్టగా" బస్సుస్టాండులో! ఇంటిదగ్గర శేరూ యిస్తానన్నారట. పాపం వచ్చి అడిగాడు. 'అమ్మా! ఆయ నెప్పుడొస్తారో ఏమిటో, ఆగింజలిపుడే యిప్పిస్తే బాగుచేయించి నా నేయిస్తాను' అన్నాడు. సరే ఆ శేరూ యిచ్చి పంపేసు........ఊహూ ఇదైపోయాడు వెర్రిబాగులాడు. పాపం. పిల్లలవాడాయె"

అవతారం ఆముదం తాగిన మొహం పెట్టాడు. తక్షణం తాగినకోతిలా తందనాలాడాడు. కోటు చింపేసుకోబోయి ఎందుకులే అని వూర్కుని పర్సు చొక్కా జేబులో పెట్టుకుని కోటు కింద పారేశాడు. "అడిగి తెచ్చేయ్ వాడ్ని మినుపులు" అన్నాడు. "అసలు ఆడాళ్లతో వచ్చి మాట్లాడానికి సిగ్గుండద్దా" అన్నాడు.

అతికష్టంమీద ఆవిడా నేనూ వూరోక్కబెట్టాం. "తప్పయ్యా వాళ్లు వింటే బావుండదు...అసలు యిచ్చింది మళ్లా పుచ్చుకోడం మనవంశంలో నే లేదు" అని.

అవతారం వుపసంహరించుకున్నాడు.

......ఇడ్డెన్లూ, ఆవడలూ, గారెలూ - ముఖ్యంగా మినపరొట్టీ అన్నీ హుళక్కే! పండగ ఎంపెగ్గింది."

సుబ్రహ్మణ్యంగారాగారు అందరికేసీ చూశారు. అవతారంబాధ ఎవరెవ రర్థం చేసుకున్నారోనని. అందరూ అఖండంగా అర్థంచేసుకున్నారు. తలకాయలాడించారు. చ్చొ! చ్చొ! లు కొట్టారు. పంచాయితీ మెంబరుమాత్రం తన సానుభూతిని వాక్యీకరించాడు. "రెంటికీ చెడ్డరేవడు పాపం!" అంటూ.

సుబ్రహ్మణ్యంగారు నవ్వారు. ఆయన నవ్వులో విజ్ఞత, గర్వం పొంగి పొర్లాయి. "మీకిది మహాచిత్రంగా వుండచ్చు. ఇలాటివి నేను చాలా చూశాలెండి" అన్న అనుభవశాలి హోదా వెల్లివిరిసింది.

సుబ్రహ్మణ్యంగారు కథ సాగించారు.

"అక్కడితో అయిందీ! అవతారం పండుగనాడు మతిపోయిన వాడిలా అయిపోయాడు. తెల్లవారుజామున పక్కింట్లో పిండిరుబ్బినచప్పుడు అవతారానికి మేలుకొలుపు. పిల్లలరాగాలు ఉపశ్రుతులు. ఇతగాడు ఊహూ పెరట్లో కెళ్లడం, యింట్లోకి రావడం. పదింటికి గారెలు ముంయ్యిముంయ్యి మన్నాయి పక్కింట్లో.

అవతారం మరోమాటు పెళ్ళాంమీద కంయ్యిమన్నాడు. పన్నెండింటికి మళ్ళా రోలుగొడవ. అవతారం విసుక్కున్నాడు. 'ఏమిటి వెధవగొడవ. ఇల్లుఖాళీచేసి పొమ్మను వాళ్లని' అని.- రెండింటికి మినపరొట్టి సన్నాహాలు ప్రారంభం. అందులోకి ఏది నంచుకోవాలన్న విషయంపై యింటిల్లిపాదీ మధ్యా వాగ్వివాదాలు సాగుతున్నాయి. అవతారం మండిపడ్డాడు. 'ఎలాగయితేనేం చేశారు మినపరొట్టె. దీనికి పెద్దగొడవా!' అన్నాడు. వెధవసొద అన్నాడు. వాళ్ళకి తనమీద కసి అన్నాడు. అసలిదంతా తన భార్యా పక్కింటాయనా పన్నిన కుట్ర అన్నాడు. "అమ్మో నాకు తేనెకావాలి" అంటూ ఓ కుర్రవెధవ పక్కింట్లోంచి గావుకేక పెట్టాడు. దాంతో అవతారం నరసింహావతారం ఎత్తాడు. హఠాత్తుగా ఏదో జ్ఞాపకమొచ్చి సామాను గదిలోకి వెళ్లాడు. బీరువా తలుపుతీసి తనివాళ తినవలసివున్న మినపరొట్టెలోకి నంచుకు నేందుకు తెచ్చుకున్న తేనె సీసా చూశాడు. గొల్లుమన్నాడు. బావురుమన్నాడు. నానాధ్వనులూ చేశాడు. ఎలా అయితేనేం, పెళ్ళాం బలవంతాన నాలుగు చారు మెతుకులు ఎంగిలిపడ్డాడు."

పాపం! అన్నా రయిదుగురు జాలిగా. ఇద్దరు రావలించారు. నరుసుకిమాత్రం భలే కోపం వచ్చింది. 'వాళ్ళు కాస్త పంపకూడదా ఏం' అన్నాడు.

"అదీ అయింది! వాళ్ళు పంపింది సహా మీరా తినన న్నాడవతారం. అతగాడొద్దన్నాడని ఆవిడా, వాళ్లిద్దరూ వద్దన్నారని నేనూ, ఆ కాస్త అలా వుంచేశాం" అన్నారు సుబ్రహ్మణ్యంగారు విషాదస్వరంతో.

* * *

మళ్ళీ కథ సాగించారు.

"సరే మర్నా డవతారం ఆఫీసుకెళ్లాడు. అందరూ అడిగారట మినపరొట్టెలావుందని. ఈ గొడవంతా వాళ్ళకెందుకు చెప్పడం అని అవతారం, తన చిన్నపుడు కవిత్వం యీవత్తూ గుర్తుకు తెచ్చుకుని, మినుపుల్తో

(56-వ పేజీచూడండి)

చిలుకా గోరువంక

యూనివర్సిటి రిజిస్ట్రార్ ఆఫీసు మెట్ల దగ్గరకు వచ్చేవరకు మోహనరావుకి తెలియలేదు, తనా వేళ బస్సుమీద కాకుండా నడచి వచ్చాడని. కాకపోతే యింకా పెళ్లయి సంవత్సరం అయినా కాలేదు అప్పుడే అలక ప్రారంభమా! అలకకి పెద్ద కారణమేమిటి అంటే, సినిమాకి తీసికొని వెళ్లలేదట! పూర్తిగా రమదే తప్పని తనుమాత్రం ఎలా అనుకోగలడు? ఎదుటింటి కంట్రాక్టరు భార్య వచ్చిన సినిమాకల్లా వెళ్తున్నపుడు తనెందుకు వెళ్లకూడదు? ఆ ప్రక్క సందులోనుంచి నలభయ్యి, నలభయ్యయిదేళ్ల వయసున్న డాక్టరు ఆ వయసులో తన భార్యతో సాయంకాలపు షికారుకి వెళ్తున్నప్పుడు యివ్వనంలో వున్న తామెందుకు సాయంకాలం షికారుకి వెళ్ళకూడదు? అంచేతే రమ యీవేళ అలిగింది. ఆడవాళ్ళకి సహజమైన ఆకోరిక మరోకవిధాన నెరవేరదని ఆమెకి తెలుసు. మోహన్ యింతకు ముందు చెప్పాడు కూడా, తనది ఎగ్జామినేషన్ సెక్షనని, అంచేత సాధారణంగా తీరుబడి వుండదని. అంతగా వెళ్ళాలనుకుంటే రెండవ ఆటకు వెళ్దామన్నాడు. కాని రమ అందుకంగీకరించలేదు. ఇద్దరూ సాయం సమయంలో ఒకరి ప్రక్క ఒకరు నడుస్తూ సినిమాకి వెళ్లాలని ఆమె కోరిక. బయటకి చెప్పే కారణం మాత్రం, రెండవ ఆటయితే నిద్రచాలదు.

ఇవన్నీ తెలుసు మోహన్‌కి. కాని ఏం చేయగలడు? 'నా భార్య నేను సినిమాకి వెళ్ళాల'ని చెప్పి వేగం ఆఫీసు విడిచిపెట్టి రాగలడా. ఏ వంక పెట్టుకుని తను వేగం యింటికి వెళ్ళగలడు? - తన ఉద్యోగం యింకా స్థిరం కాలేదాయె. తానెంత స్వేచ్ఛగా బ్రతుకుదామనుకున్నా సంఘ నియమాలకి కట్టుబడి వుండవలసిందే. స్వేచ్ఛగా గాలిలో ఎగిరే చిత్తుకాకితాలకి, ఫైల్సులో కట్టివుండే కాగితాలకున్నంత గౌరవముండదా.

అతని ఆలోచనలికి యూనివర్సిటీకి వెళ్లే మార్గంలోవుండే ప్రశాంత వాతావరణం అంతరాయంకలిగించలేదు. అంచేతే ఆఫీసు మెట్లదగ్గరకు వచ్చేవరకు తానావేళ బస్సుమీద కాకుండా నడచి వచ్చినట్టు గుర్తు రాలేదు. ఆలస్యమయిందేమో అని వేగంగా అడుగులు వేశాడు. తన సీటులో ఎవరో కూర్చొనివున్నారు. కొంపదీసి ఉద్యోగం ఊడబీకెయ్యలేదు కదా. అయినా ముందుగా తెలియజెయ్యకుండా ఎలా తీసేస్తారు? ఆశ్చర్యంతోను, భయంతోను సీటుదగ్గరికి వెళ్ళాడు. సీటులో కూర్చున్న ఆయన రండి రండంటూ ప్రక్క కుర్చీలో కూర్చున్నాడు. ఉద్యోగం తీసేశారని చావుకబురు చల్లగా చెప్పడుకదా! అలా చెప్పలేదు పాపం. ఈ వేసవులలో మోహన్ సీటుదగ్గర పని హెచ్చుగా వుంటుందని ఆయన్ని వేశారట.

మోహన్ సంతోషం పట్టలేకపోయాడు. అయితే సాయంత్రం వేగం యింటికివెళ్ళి రమని సినిమాకి తీసికొని వెళ్ళవచ్చన్న మాట. క్రొత్తగ తన సీటుదగ్గరికి వచ్చిన సత్యనారాయణ సహాయంతో వేగం పనులు

'కీర్తిప్రియ'

పూర్తిచేసుకున్నాడు. ఆవేళ ఒంటిగంటకు కాఫీ త్రాగడం కూడా మానేసి అయిదు గంటలవరకూ పని చూసుకున్నాడు. ఐదు అవగానే ఫైల్సు కట్టేసి లేచి నిలబడ్డాడు. ఈ మధ్య వారం పదిరోజులకి అయిదయ్యేటప్పటికి పని పూర్తవడం యీవేళే. మోహన్ సంతోషిస్తున్నాడు. కిటికీలో నుండి వచ్చేగాలికి ఫైలులో కాగితాలు రెపరెపలాడుతున్నాయి. నిర్బంధంలో కూడ స్వేచ్ఛ వుందేమో.

బస్సు బయలుదేరడానికి యింకొక పావు గంట టయిముంది. మనోవేగంలో పరుగు పెట్టలేని బస్సులో ప్రయాణం చెయ్యడానికి ఆవేళ మోహన్‌కి మనస్కరించలేదు. ఇంటివైపు నడక సాగించాడు. వేగం యింటికి వెళ్లినా యీవేళమాత్రం సినిమాకి వెళ్లకూడదు. సినిమాకి వెళ్తే రమదగ్గర తన పరాజయాన్ని ఒప్పుకున్నట్టుకదూ. ఇక మీదట ఏ కోరిక కోరినా తీర్చకపోతే యిలా చెయ్యాదు. ఉదయం తను అలిగినందుకే నేను యీవేళ వేగం యింటికి వచ్చానసుకుంటుందిగాని, యీవేళ ఆఫీసుపని వేగం అయిపోవడంవల్ల రాగలిగానసుకుంటుందా. పెళ్ళయిన కొత్తలోనే ఆమెకి దాసోహం అంటున్నట్టు కనపడితే, యికముందు చాలా చిక్కులు రావచ్చు. ఏమయినా సరే యీవేళ సినిమాకి మాత్రం వెళ్ళకూడదు - అనుకున్నాడు మోహన్.

సినిమాకి రమతోపాటు వెళ్లకూడదనే గట్టి నిశ్చయంతో, ఉదయం జరిగిన గందరగోళాన్ని మననం చేసుకుంటూ, సాయంత్రానికి జరుగబోయే ప్రమాదాన్ని వూహించుకుంటూ యింట్లో అడుగుపెట్టాడు మోహన్. ఎండలో నడిచివచ్చిన అతని ముఖం వరండాలో కూర్చున్న మామగారిని చూసేసరికి అదోలా మారింది. లేని చిరునవ్వు తెచ్చుకున్నాడు. కొంపదీసి యీవిడగారు నాన్నగారితో యిలా అని చెప్పలేదుకదా. ఈయన ఆ మాటలమీద రమని యింటికిగాని తీసికొని వెళ్తానడుగదా. తీసికొని వెళ్తే వెళ్ళనీ, రోజా గొడవలు పడేబదులు ఏ హోటలు భోజనమో చెయ్యవచ్చు అనుకున్నాడు.

ఈ పెద్దమనిషికి తీరుబడి లేదట. ఇప్పుడెలాగయిందో తీరుబడి. అయిదున్నరయ్యేటప్పటికల్లా వచ్చేరు. నాన్నగారు రాబట్టిగాని లేకపోతే యీవేళ కుండలు డింకీలు కొట్టేవే. కాకపోతే తను ఏం కోరికలు



శ్రీమతి మల్లాది వసుంధరాదేవి

ఆంధ్ర విశ్వవిద్యాలయంవారి చరిత్రాత్మక నవలా రచన పోటీలో ఈమె రచించిన "తంజావూరు పతనము" అను గ్రంథమునకు వెయ్యి రూప్యముల ప్రథమ బహుమతి వచ్చినది. ఈమె వయస్సు 19 సం॥లు.

కోరిందని? కంట్రాక్టరుగారి భార్యలా మామిడి పిందెల నెక్లెస్ కొనమందా? డాక్టరుగారి భార్యలా చేతికి రిస్టువాచి కొనమందా. ఒకనాడు సినిమాకి తీసికొని వెళితే చాలునంది. రెండవ ఆటకు రావాలట. ఆ తొమ్మిది గంటల రాత్రపుడు యీసురోమంటూ వెళ్లి అర్ధరాత్రపుడు తాగినవాళ్లలా తూలుతూవచ్చినట్లె వుంటుందా, సాయంకాలం యిద్దరు ముచ్చట తీరా వెళ్తుంటే. పట్నవాసి తన భర్త కాబోతున్నాడని తెలిసినపుడు తను ఎలాంటి కలలు కన్నదీ! ఆయనకి నిజంగాతీరుబడివుండడం లేదేమో? లేకపోతే ఆకాగితాలు యింటికికూడఎందుకు తెస్తారు. అయినా తీరుబడి చేసుకో దలచుకుంటే ఎందుకు చేసుకోలేరు – అనుకుంది రమ. ఆ పూట వంటమానేద్దామనుకున్నా, తండ్రి రావటంవల్ల వంటచెయ్యడం తప్పనిసరయింది.

అనుభవశాలి ముగ్గురు ఆడపిల్లలు తండ్రి అయిన మధుసూదనం వీళ్ల ప్రవర్తన యిట్టే గ్రహించాడు. ఏదో చిన్న విషయం మీద మూతులు ముడుచుకుంటూరు. ఈ వేళకి ఒక సినీమాకి ప్రయాణం చేయిస్తే వాళ్ళే సర్దుకుపోతారు – అనుకున్నాడు.

“ఇవాళ మొదటిఆటకు అలా ‘పూర్ణా’ వైపు రండోయ్. నేను డాబా తోటలో స్నేహితుడు యింటికి వెళ్ళి టైముకు అక్కడికి వస్తాను. మరి లేవండి. నేను యింక అలా వెళ్ళి వస్తాను. రమా! వేగం తయారు కావమ్మా. ఆడవాళ్ల ప్రయాణం అవడానికి చాలా ఆలస్యమవుతుంది.” అంటూనే వీధిలోకి అడుగుపెట్టాడు మధుసూదనం. మంచీ చెడ్డా మాట్లాడకుండానే వెళ్లిపోతున్న మామగారివైపు అలా చూస్తూ నిల్చుండిపోయాడు మోహన్.

ఇక తప్పని సరి అనుకుంటూనే యిద్దరూ సినిమాకి తొందరగా తయారయ్యారు. ఆరు అయేటప్పటికల్లా వీధిలో అడుగుపెట్టారు.

మామయ్య సినిమాకి ఎందుకు రమ్మన్నాడు? సినిమాకి తీసికొని వెళ్ళలేదని రమ చెప్పిందా? మా యిద్దరి ప్రవర్తన చూసి ఏదో చిలిపి కయ్యం పెట్టుకునుంటారని గాని రమ్మన్నాడా? ఈవేళ సినిమాకి వెళ్లకూడదనుకున్నాడు గాని తప్పనిసరయింది. జవాబయినా చెప్పనీయకుండా వెళ్ళిపోయాడు మామయ్య. రమకు సంతోషమే – తననుకున్నది నెరవేరినందుకు...ఆ సైకిలు రిక్షాలో వచ్చే భార్యాభర్తలెందుకలా చూస్తారు? మా యిద్దరిని చూసి యీర్ష్యా? వాడెందుకు, ఫ్రెండు మాట్లాడుతున్నా మావైపు చూస్తున్నాడు గుడ్లు మిటకరించుకొని? వెధవలు వాళ్ళ మానాన వాళ్ళుండక చీమ చిటుకుమంటే సరి అడ దెవ్వరయినా వెళ్తుందేమోనని బుర్ర తిప్పుతారు.

చివరికి నా పంతమే నెగ్గింది. ఆయన కూడ యీవేళ సినిమాకి బయలుదేరే ఉద్దేశంతోనే వేగం వచ్చారు. కాని ఏంలాభం? ఇద్దరం మాట్లాడుకుంటూ సర్దాగా వెళ్తుంటే ఎంత బాగుండేది! ఆయన మరీను. రోడ్డుమీద అడుగు పెట్టేకయినా మాట్లాడకూడదా? నేనేం తప్పు చేశాను? పెద్ద కోరికలు కోరలేదు కదా, కోపం రావడానికి? సినిమాకి యిద్దరం కలిసి వెళ్దామన్నాను, అంతేగా.

అలా అనుకుంటూనే ఒకరితో ఒకరు మాట్లాడకుండా కొంత ఎడంగా నడుస్తున్నారు రమ మోహన్లు. కొద్దిదూరంలోవున్న యింటి కిటికీగుండా తమవైపుచూస్తున్న నలభయ్యేండ్ల ముత్తయిదువను చూశాడు మోహన్. అలా చూస్తుండగానే ఆమె ప్రక్కకి పద్దెనిమిది యిరవయ్యేండ్ల ప్రాయపు స్త్రీ వచ్చి చేరింది. ఆ యిల్లు దాటుతుండగా “చూశావా! చిలుక గోరువంకల్లా ఎలా వెళ్తున్నారో!” అన్న మాటలు అస్పష్టంగా వినబడ్డాయి ఆ యిద్దరికి. అప్రయత్నంగా చిరునవ్వు వారి ముఖాలమీద ప్రత్యక్షమయింది. ఒకరివైపు ఒకరు చూచుకొని రమా మోహనులు కొంత దగ్గరగా వచ్చి ఆ రోడ్డుమలుపు తిరిగారు. పైపై ప్రవర్తన చూసి భ్రమసిపోయే మానవజాతిని చూసి మందహాసం చేసింది – ఎదుటనున్న ఏరాడ కొండ. ★

ఎదురీత

ఒక చిన్నకథ. ఏ మతంవాడయితే నేం - ఒకానొక మతగురువు - ఆలయంలో ఎలుగెత్తి గంభీరంగా ప్రార్థన చేస్తూ; మధ్యలో అకస్మాత్తుగా ఆగి, గుమికూడివున్న భక్తబృందాన్ని ప్రశ్నించాడట; 'మీలో నరకానికి వెళ్ళడానికి ఇష్టం లేనివాళ్ళంతా చేతులెత్తండి' అని. ఒక్క వెర్రివాడు తప్ప అందరూ చేతులెత్తారు. మతాధికారి మళ్ళీ ఆజ్ఞాపించాడు; 'సరే, మీలో స్వర్గానికి వెళ్ళడానికి కుతూహలంగా ఉన్నవాళ్లంతా చేతులెత్తండి' అని. తిరిగి ఆ వెర్రివాడు తప్ప అందరూ చేతులెత్తారు. మతాధికారికి ఆశ్చర్యంవేసి ఆ వెర్రివాడిని అడిగాడు. 'నాయనా! నువ్వు నరకానికీ వెళ్ళక, స్వర్గానికీ వెళ్ళక - మరి ఏం చేద్దామని?' వెర్రివాడు తొణక్కుండా బెణక్కుండా యిలా సమాధానం చెప్పాడు. 'స్వామీ! ఇప్పట్లో నా కెక్కడికీ వెళ్ళాలని లేదు. ఈ భూమ్మీద చూసుకోవలసిన పనులు చాలా ఉన్నాయి' అని.

ఇంకో చిన్నకథ! విదేశీయు డొకడు చిరకాలం అమెరికాలో ఉండి, తనకి అమెరికా పౌరసత్వపు హక్కు ఇప్పించవలసిందని అధికారులకి అర్జీ పెట్టుకున్నాడు. సకాలంలో అధికారు లతన్ని పిలిపించి, అతని కోరిక మంజూరు చేశారు. అమెరికా పౌరుడిగా అతని చేత ప్రమాణ స్వీకారం చేయించేముందు, అమెరికా రాజ్యాంగంలో ప్రతి పౌరుడికీఉన్న అవకాశాల గురించి అతనికి బోధపరచాలని, అవీ యివీ అన్నీ చెప్పి, 'నీకు అమెరికా ప్రెసిడెంటు అవాలని ఉందా?' అని ప్రశ్నించారు. ఆ వెర్రివాడు వెంటనే 'క్షమించండి సార్! అటువంటి పనులకి వేటికీ నాకు తీరుబాటు లేదు. పీకుల్లన్నీ తిరిగి అయిస్‌క్రీం అమ్ముకుందికి నాకు ఉన్నటయిమ్ చాలడంలేదు' అని ప్రాధేయపడ్డాడట, కొంపతీసి ఆ ప్రెసిడెంటు గిరీ తనకి అంటగడతారేమోనని భయపడుతూ.

ఈ వెర్రివాళ్ళిద్దరూ మనలో అధిక జనాభాకి ప్రతినిధులు. నేనూ ఆ కోవకి చెందినవాణ్ణే; అకస్మాత్తుగా ఎవరైనా మనల్ని నిలవేసి - నరకానికి వెళ్ళడం, ఆనేది తప్పించుకుంటావా? స్వర్గానికి వెళ్లాలని ఉందా? పోనీ, అమెరికా ప్రెసిడెంటు అవుదామనేనా లేదా? అసలు నీ ఆదర్శ మేమిటి? రాజకీయవేత్తవై రాజ్యాలేలాలని ఉందా? పోనీ - మహాకవి, గాయకుడు, శిల్పి, విజ్ఞానవేత్త—ఏదయినా అయి యీ పతిత ప్రపంచాన్ని ఉద్ధరించకూడదూ? - ఇలాంటి ప్రశ్నలు వెయ్యడం లంకించుకుంటే మనం గుడ్లు తేలేస్తాం. గుండె బేజారెత్తుతుంది. అలా అడిగినవాళ్ళకి ఓ నమస్కారబాణం పారేసి, 'బాబూ, ఏదో యిలా మమ్మల్ని బతకనివ్వండి. ఏదో నాలుగు రాళ్ళు సంపాదించుకుని, గుట్టుగా కాలక్షేపం చెయ్యనివ్వండి. ఆదర్శాలమాట దేవుడెరుగు',

గోరా శాస్త్రి

అంటాం. అసలు అటువంటి ఆదర్శాల గొడవ చెవిలేసే మన శరీరానికి పడదు. ఏదో ఆకలేస్తే అన్నం తిని, నానొస్తే గోడుగేసుకుని, చలివేస్తే గొంగళీ కప్పుకుని, ఎవడైనా జబ్బపుష్టి కలవాడు డబాయిస్తే నోరు మూసుకుని, బక్కవాడు కనిపిస్తే నెత్తెక్కి స్వారీచేసి, పీకలమీదికొస్తే అబద్ధం ఆడేసి, ఉపకరిస్తే స్నేహం చేసి, లాభిస్తే ద్రోహంచేసి—మొత్తంమీద జీవయాత్ర నెట్టుకొస్తూ ఉంటాం. పచ్చగా ఉన్నచోట అరగించి, వెచ్చగా ఉన్న చోట నిద్రపోవడమే మన ఆదర్శం. పోతే యింకోరకం మనుషులు మనకి తారసిల్లుతూ ఉంటారు. పైకి చూడడానికి మామూలుగా అందరిలాగే కనిపిస్తారు గాని, కొస్త కదిపేసరికి వీరి మనస్సులూ, హృదయాలూ, యింద్రధనుస్సు రంగుల్ని ప్రతిఫలిస్తాయి.

మనకి ఏమాత్రమూ పట్టింపులేని విషయాల గురించి వీళ్ళు తెగ ఆలోచించి, ప్రతివిషయానికీ ఏవో కొన్ని చిత్రమైన నిబంధనల మధ్యే నలిగిపోతారు గాని బయటికి ఒక్క అడుగు వెయ్యరు. వీళ్ళని వేగడం మహాకష్టం. వీళ్ళలో ప్రతి ఒక్కడికి దూరాన మిణుకు మిణుకు మని ఒక చుక్క కనబడుతుంది. ఆ చుక్కని అందుకోవాలని నిరంతరం ప్రయత్నం చేస్తారు. ఎంత ప్రయాసపడినా, ఎంత దూరం నడిచినా, ఆ చుక్క యింకా దూరం అవుతుంది గాని వీళ్ళకి అందదు. ఏ నూటికో కోటికో ఆ చుక్క చేతికి దొరికి, తీరా చేసి అది కాస్తా గాజుముక్క అయిపోయిన విషాదఘట్టాలు కూడా ఉంటాయనుకోండి.

ముఖ్యం ఏమిటంటే - ఆ అన్వేషణ. ఇటువంటి విచిత్ర వ్యక్తులు జీవిత పటానికి నిలువుగా అడ్డంగా గీతలు గీసి ఆ గీతల్లో ఏవో స్వప్నాలు కట్టి అవి సాధించడానికి తాపత్రయ పడుతూంటారు. అంతవరకూ బాగానే ఉంది - మన జోలికి రానంత వరకూ. కాని దురదృష్టవశాత్తూ వీళ్ళతో గనక మనజీవితం పెనవేసుకుపోయిందంటే, మనల్ని ముప్పతిప్పలూ పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించేస్తారు. వాళ్ళు సుఖపడరు; ఇంకొకర్ని సుఖపడనివ్వరు. వీళ్ళనే లోకం ఆదర్శవాదు లంటుంది.

ఈ భూమ్మీద మానవుడు పుట్టినప్పటి నుండీ, యీ ఆదర్శవాదులనే వాళ్లు ఉన్నట్టే కనబడుతుంది. పురాణాలూ, ఇతిహాసాలూ, కావ్యాలూ - వీటినిండానే కాక చరిత్రలో కూడా వీళ్ళు సమృద్ధిగా గోచరిస్తారు. వీళ్ల మొదటి లక్షణం ఏమిటంటే, అసంతృప్తి. ఉన్న ప్రపంచాన్ని యథాతథంగా స్వీకరించరు. దాన్నీ అందులోని మనుషుల్నీ, మార్చాలని ప్రయత్నిస్తారు. పచ్చి మాంసం తినడంతో సంతృప్తిపడక నిప్పుచేయడం కనిపెట్టిన చాదస్తుడు, కాలినడకతో తనివి తీరక చక్రం కనిపెట్టి, దానికోసం బండి కనిపెట్టి, కాలినడక తప్పించుకోవడానికి ప్రయత్నించిన బద్ధకస్తుడు, ఉత్త వదనంతో సంతృప్తిపడక లయబద్ధంగా మాటలు పేర్చిన గడుసువాడు - వీళ్ళంతా అలనాటి ఆదర్శవాదులు. నాటినుండి నేటివరకూ ఏదో రూపాన వీళ్ళు పుట్టుకొస్తూనే ఉన్నారు. సమకాలికులికి చిరాకు కలిగి



సంధ్యా సమయంలో అంధభిక్షుకుని ఆర్తనాదం

—చిత్రకారుడు: శ్రీ ఎ. వి. ఎస్. జోస్యులు (గుంటూరు)

స్తూనే ఉన్నారు. ఒకొక్కప్పుడు సమకాలికులకి మరీ తిక్క రేగేటంత మొండితనంతో ప్రవర్తించి పరిస్థితి మరీ దుర్భరం అయే సరికి సమకాలికులు యిక లాభంలేదని వాళ్లని హతమార్చేశారు. ఈ రకం మొండి వాళ్లలో గ్రీకు వేదాంతి సోక్రటీసు ఒకడు. అతడు చెప్పే చాదస్తపు కబుర్లూ, చేసే చిత్రమైన బోధనలూ, - సత్యాన్ని ఆరాధించండి - సత్యాన్ని తెలుసుకోండి - వగైరాలు విని సమకాలికులకి ఒళ్ళు మండి అతనికి ఓ గ్లాసునిండా మంచి చిక్కని విషం యిచ్చి 'బాబూ, నీ తలతిక్క వాగుడుతో మమ్మల్ని చంపక యీ విషం కాస్తా తాగేసి మమ్మల్ని ఉద్ధరించు;' అనేసరికి ఆ మొండివాడు గ్లాసుడు విషం కాస్తా తాగేశాడు గాని, తన ధోరణి మార్చుకుందికి ఒప్పుకోలే. ఈ కోవకి చెందినవాడే జీసస్ క్రీస్తు. ఇతని రంధి భరించలేక ప్రజలు చివరకి తీసికెళ్లి ఓ శిలవకి తాపడం చేసి మేకులు బిగించేశారు—అక్కడికైనా ఆ కంఠం విశ్రాంతి తీసుకుంటుందని. కాని ప్రతిసారీ, ఏం జరుగుతుందంటే వీళ్ళు బతికి సాధించిన దానికంటె, చచ్చిపోయి మరింత సాధిస్తారు. అదే వీళ్లతో వచ్చిన చిక్కంతా.

ఇటువంటి ఆదర్శవాదులు యీనాటి జీవితంలో ఎక్కడ ఉన్నారులే, - ఏదో పురాణాల్లోనూ, చరిత్రలోనూ తారసిల్లతారని గాని. - అనుకుని సంతృప్తిపడడానికి వీలులేదు. కొంతలో కొంత యీ శతాబ్దంలో పుట్టినవాళ్ళం - అందులో శతాబ్దపు ఉత్తరార్థంలో బతుకుతున్నవాళ్ళం - అదృష్టవంతులం. ఎంచేతంటే, వీపుమీద చెయ్యివేసి అనుక్షణం జీవితం మనల్ని నెట్టుకువెళుతూ ఉంటే, అదెక్కడికి తీసికెళితే అక్కడికి పోతున్నాం - ఆలోచించుకుందికైనా తీరికలేదు. ఇంక ఆదర్శాల గురించి ఎక్కడ తర్జన భర్జన చెయ్యగలం? బతకడం; అదీ మనకి ముఖ్యం. అందుకు ఏం కావాలి? ధనం; సరే దానిని వేటాడుదాం; దొరికితే ఆరాధిద్దాం. అంతరాత్మలనేవి అప్పుడప్పుడు బాధపెడితే యిగనక వాటికి జోలపాడి నిద్రపుచ్చేస్తాం. ఈ రకమైన జీవితానికి అలవాటు పడిపోయాం గనక, ఆదర్శాలనేవి అట్టే మనల్ని బాధపెట్టవు; ఆదర్శవాదులకి దూరంగా ఉంటాం గనక, వాళ్ళ వెర్రివాగుడు మనకి వినిపించదు.

ఆదర్శవాదం అనే రుగ్మతి మొట్టమొదట తారుణ్యంలో అంకురిస్తుంది. అనేకులు పుట్టుకతోనే ముసలివాళ్ళనుకోండి. వాళ్ల సంగతి వదిలేద్దాం. తారుణ్యంలో అడుగు పెట్టి పెట్టగానే - యీ జగత్తంతా తన కోసమే సృష్టించబడినట్టు ముందు అనిపిస్తుంది. వెంటనే ఒక్కసారి అంతా కలయచూసి లోపాలన్నీ కనిపెట్టేస్తాడు. 'ఆకాశంలో యీ నక్షత్రాలన్నీ ఏమిటి యిలా కలగాపులగంగా వదజల్లేసి ఉన్నాయి; వాటిని ఒక క్రమంలో అందంగా పేరిస్తే ఎంత బాగుంటును;' అనుకుంటాడు. అలాగ ఆకాశంలో నక్షత్రాలనుండి, భూమిమీది మనుష్యులదాకా అన్నీ మారిపోవాలని తహతహలాడతాడు. ఇసుక ఎడారుల్లో బంగారు పంటలు పండించాలి. బిచ్చగాళ్లు ఐశ్వర్యవంతులవాలి. రోగార్తులు ఆరోగ్యవంతులై దుఃఖార్తులు ఆనందంలో కలకలానవ్వాలి - యిలా జరగవలసిన పనులన్నీ జాబితా వేసుకుంటాడు. ఈ జాబితాలో అమాంబాపతు అన్నీ వచ్చేస్తాయి. బాల్య వివాహాలు కూడదు. వితంతువులకి పునర్వివాహం చేసుకునే అవకాశం ఉండాలి. పెళ్లిళ్ళలో కట్నాలు నిషేధించాలి. ప్రేమించి పెళ్లి చేసుకోవాలి. రైల్వేస్టేషను లోనూ, పోస్టాఫీసులోనూ - వగైరా చోట్ల ఉద్యోగులు ప్రజలతో మర్యాదగా

ఎదురీత

వ్యవహరించాలి. ఉద్యోగులు లంచాలు తీసుకో కూడదు. - ఇలా యీ జాబితా అనంతం.

ఇటువంటి జాబితా తీసుకుని, చేతిలో చిన్న పొడసుత్తి పుచ్చుకుని, లోకాన్ని మరమ్మత్తు చేద్దామని బయలుదేరతాడు. అక్కడనుండి రభస ప్రారంభం. అడుగు వేసేసరికి ద్వారబంధాలు తగిలి కణత పగులుతుంది. క్రమంగా మైకం వదిలి యీ జగత్తు నిజస్వరూపం గోచరించేసరికి చెయ్యెత్తి నమస్కరించేసి, పొడసుత్తి అవతల పారేసి, వచ్చి మనలో చేరిపోతాడు. అది బుద్ధిమంతుడి లక్షణం. అక్కడనుండి జీవితం సజావుగానే సాగిపోతుంది. నాన్న చేసుకో మన్న పిల్లనే పెళ్ళిచేసుకుని, అత్తవారిచ్చిన కట్నం తృణమో పణమో పుచ్చేసుకుంటాడు. గీస్తున్న బొమ్మలూ, రాస్తున్న పద్యాలూ, అన్నీ అవతల పారేసి ఏం పని చేస్తే నాలుగు రాళ్లు వస్తాయో చూసుకుని, ఆ పనిలో నిమగ్నుడై సంతృప్తిగా బతికేస్తాడు. ఇంక అర్థరాత్రివేళ ఏ అర్థం లేని కలా రాదు, రోడ్డుపక్క బిచ్చగాడిని చూసి అంతరాత్మ బాధ పెట్టదు. జీవితంలో ఏ ఘట్టంలో ఎలా ప్రవర్తించాలి, అనే సమస్య రాదు. నీళ్లు ఏపాత్రలో పోస్తే ఆ పాత్ర రూపాన్నే పుణికి పుచ్చుకున్నట్టు, పరిస్థితి తననుండి ఏ భంగిమ కోరితే ఆ భంగిమలోనే తయారవుతాడు.

ఈరకంగా వస్త్రకాళం పట్టేయ్యగా అందరూ జారిపోయినా, నూటికీ కోటికీ ఏ ఒకడో అరో మనిషి మిగిలిపోతాడు వాడు సనేమిరా వస్త్రకాళం అయిపోవడానికి ఒప్పుకోడు. ఏమయినా సరే నిటారుగా నుంచుంటాడు; లొంగడు. కణతకి ఎన్ని బొప్పెలు కట్టినాసరే, వాడు నిర్ణయించుకున్న దారిలోనే నడుస్తాడు గాని, ఇంక దేనికీ ఒప్పుకోడు. అటువంటివాణ్ణి ఒప్పించడం బ్రహ్మతరం గాదు.

ఇందాకనే అనుకున్నట్టు యిటువంటి మొండివాళ్లు మనకి పురాణాల్లో కొల్లలుగా కనిపిస్తారు. ఇంచుమించు ప్రతి పురాణ పురుషుడూ యిటువంటివాడే; ప్రతిపురాణ నారీమణీ యిటువంటిదే. వాళ్ళ మొండితనం చూస్తే నాబోటి భవదీయుడికి భయం వేస్తుంది. పోనీ కొత్త ప్రబంధాలలోనైనా మనకి హాయైన మనుషులు కనిపిస్తారా అంటే - వాటిలోనూ తలతిక్కరాయళ్లే ఎక్కువ. వరూధినిలాంటి వరారోహ ప్రవరుడికి కొత్త సౌఖ్యం నేర్పి 'ఆనందో బ్రహ్మ యటన్న ప్రౌఢ జదువునంతర్బుద్ధి నూహింపుమా' అని నచ్చచెప్పడానికి ప్రయత్నించినా, లాభం లేకపోయింది. ప్రవరుడి ఆదర్శవాదానికి తిరుగులేకపోయింది.

పోనీ వీళ్ళంతా పుస్తకాల్లో మనుషులు- మనల్ని అట్టే బాధించరు, అనుకుని తృప్తి పడడానికి వీలులేకండా నేడుకూడా వీళ్లు నిత్య జీవితంలో తారసిల్లుతూండడం యీతి బాధల్లో ఒకటి కాక మరేమిటి? ఈ ఆదర్శవాదుల్లో మళ్లీ రకాలున్నాయి. ప్రపంచ రాజకీయ స్వరూపం మార్చడానికి ప్రయత్నించే వారినుండి, అపక్వాహారాన్ని అందరిచేతా తినిపించాలని తాపత్రయ పడే వారిదాకా రకరకాల ఆదర్శాల అంతస్థులున్నాయి. వీళ్లలో కొందరి కొందరి ఆదర్శాలు మరీ చిత్రంగా ఉంటాయి. కాలేజీ రోజుల్లో నాకో స్నేహితుడుండేవాడు. అతగాడు వీరేశలింగంగారి పుస్తకాలు తెగ చదివి, ఆఖరికి—జీవితాదర్శాలలో పరమార్థం ఏమిటంటే, వితంతువుని పెళ్లిచేసుకోవడం అనే నిశ్చయానికి వచ్చాడు. అంతే; ఒక సుప్రభాతాన తన భీష్మప్రతిజ్ఞ తల్లికి తెలియజేశాడు. ఆమె తోక తొక్కిన పాములాగ లేచి, 'నువ్వు కనక వితంతువివాహం చేసుకుంటే నేను బావిలో పడి చస్తాను' అని ఆమె యింకో భీష్మప్రతిజ్ఞచేసింది. ఇద్దరూ ఆదర్శవాదులే. తల్లి ఆదర్శం బాల్యవివాహం ... కొడుకు ఆదర్శం వితంతువివాహం. ఇంక ఏదీ దారి? ఇద్దరూ మాటాడుకుంటూంటే, విస్ఫులింగాలు లేచేవి. ఒకనాడు యిలాంటి ఘట్టాన్నే నేను కళ్లారా చూసి భరించలేక స్నేహితుణ్ణి చాటుగా పిలిచి అడిగాను; భాయీ; నీ ఆదర్శం దొడ్డదే, నేను కాదనను, కాని, నువ్వు పెళ్లాడ దలచుకున్న ఆ వితంతు రత్నం ఎవరో చెప్పు;' అన్నాను. స్నేహితుడు చిరునవ్వు నవ్వి 'అట్టే ప్రత్యేకించి ఫలానా వితంతువు అంటూ ఎవరూ లేరు. నేను పెళ్లాడ దలచుకున్న యువతి వితంతువై ఉండాలి. ఇంతే' అన్నాడు. 'అయితే అదికి ముందు యీ రగడ దేనికి? ఆసమయం వచ్చినప్పుడు చూసుకుందాంగా,' అన్నాను. అతగాడు లొంగలేదు. తన ఆదర్శాన్ని కాదనడానికి తల్లికి హక్కు లేదంటాడు. ఒకరోజున యీ ఆదర్శాల చర్చ మరీ ఎక్కువై, తల్లి అన్నంతపనీ చేసింది; అమాంతం బావిలో దూకి చచ్చిపోయింది. మావాడు కించిత్తయినా బాధపడలేదు...అందం ఎక్కడున్నదంటే, నేటికీ మా స్నేహితుడికి పెళ్లికాలేదు. అతడికి నచ్చిన వితంతువు దొరక్క. నాకు నేటికీ బోధపడనిదేమిటంటే ఏ ఆదర్శం కోసం ఆ తల్లి బలియైపోయినట్టు?

నాణేనికి బొమ్మా బొరుసూ ఉన్నట్టే, యీ ఆదర్శాలకికూడా బొమ్మా బొరుసూ ఉన్నట్టు నాకు తోస్తుంది. మూర్తికి ఛాయవలె, ప్రతి ఆదర్శానికీ వెన్నంటి కొన్ని అమానుషమైన క్రూరత్వాలు ఉండక తప్పదు. అయితే ఆదర్శంవల్ల సాధించబడేది ఉదాత్తమైనది అయినపుడు, వాటి యిబ్బందుల్ని తప్పనిసరిగా భరించవచ్చు. కాని నాణేలలో పూటాసరుకువలె, ఏవి నిజంగా ఆదర్శాలు? ఏది చెరుకు చివర వెన్నువంటిది? ఈ ధర్మ సూక్ష్మాన్ని బోధపరుచుకోవడం నాబోటి వీధిమానిసికి తలకి

జంతు శాస్త్రం బోధించే ప్రొఫెసర్ క్లాసులోకి వచ్చి, కాలేజి విద్యార్థుల నుద్దేశించి యిలా ప్రసంగించాడు.

"ఈరోజు మీకు కప్ప శరీరంలో వుండే భాగాల్ని గూర్చి చెప్పబోతున్నాను. ఆభాగాలన్నీ కోసి ప్రత్యక్షంగా మీకు చూపెట్టటం కోసం, ఒక కప్పను కూడా తీసుకొచ్చాను" అంటూ తనకోటు జేబులోకి చేతిని పోనిచ్చి, కాగితం పొట్లం ఒకటి బయటికి తీశాడు. పొట్లం అంతా విప్పి చూస్తే, అందులో బిస్కట్ ముక్కలు వున్నాయి! ప్రొఫెసర్ కంగారు పడిపోయి, మిగిలిన జేబులన్నీ వెదికాడు. కప్ప కనిపించలేదు. ప్రొఫెసర్ కాస్సేపు తల గోక్కొని "ఐతే నేను యిందాక తిన్నది బిస్కట్లు కావు కాబోలు!" అని డోక్కోవటం మొదలు పెట్టాడు.


మించిన పని. జీవితం సరిగాబోధపడని ఎవరైనా ఒక అమాయిక కళాశిలి తన జీవితం అంతా చిత్రకారుడిగా గడపాలని నిశ్చయించుకుంటాడనుకోండి. అందులోనూ తనకితోచిన ఆదర్శ చిత్రకళనే ఆరాధిస్తాడుగాని, వ్యాపార చిత్రకళజోలికి పోడు. ఇంకో వృత్తిచూసుకోడు. తను మాడిపోవడమే కాక, భార్యా బిడ్డల్ని సైతం మాడుస్తాడు. ఇటువంటివాడు మన జీవితంలో తారసిల్లితే ఏంచెయ్యడం ? చిత్రకారుడి ఆదర్శం అక్కడితో ఆగితే కొంతనయం. కొన్ని సాధారణంగా అలా ఆగడం అంటూ ఉండదు. అతడికి చిత్రకళే గాక, ఆయుర్వేద వైద్యంకూడా ఒక ఆదర్శం అనుకోండి. భార్యకి జబ్బుచేసి చావుబతుకుల్లో ఉన్నా రోగిని కాపాడేది యింకోరకం వైద్యం అని తెలిసినా, ససేమిరా లాభంలేదు. భార్య మరణిస్తే వచ్చే బాధకన్న తన ఆదర్శాన్ని వదిలేస్తే వచ్చే బాధ ఎక్కువది కనక, భార్యని వదలుకుని ఆదర్శాన్ని అంటిపెట్టుకుంటాడు. తను నమ్మిన ఆదర్శం తనను ఏవిధంగానూ దరి చేర్చదు. అయితేనేం—దాన్ని ఆచరించడంలోనే, ఏదో పరితృప్తి ఉంది.

ఈ రకం మనుషుల్ని మార్చి పరిస్థితులకి అనుగుణంగా నడుచుకొనేటట్లు చేయడం మనకి తలకిమించినపని. వీళ్లు అనుసరించే ఆదర్శాలలో కొన్ని సూక్ష్మంగా పరిశీలిస్తే—అవి ఆదర్శాలు కావు, స్వభావాలు. 'నా ఆదర్శం అందరిచేతా మంచి అనిపించుకోవడం' అంటాడొకడు. దాన్ని ఆదర్శం అనేకంటే, గడుసుతనంగా, గాయాలు తినకండా సుఖమయంగా జీవితం వెళ్లబుచ్చుకునే స్వభావం అనడంనయం. ఆదర్శాలు లేకపోవడం అనేది ఆదర్శం అనడం మాట చమత్కారం అవుతుంది ; ఆదర్శానికి గీటురాయి ఏదో ఒక అవధి చేరుకుందికి ప్రయత్నించడం; తను నమ్మిన దాన్ని అక్షరాలా ఆచరించడం; 'బాబూ;ఎందుకు లేనిపోని రగడ; నువ్వు కోరిన పిల్లను పెళ్ళి చేసుకుంటే మా నాన్న ఆస్తిలో నీకు దమ్మిడీ యివ్వడు' అంటే యువకుడు వినడు. 'వెర్రివాడా; నీ దేశభక్తి చివరికి నిన్ను ఉరికంబం ఎక్కిస్తుంది;' అంటే దేశభక్తుడు వినడు. 'నాయనా, బొమ్మలు గియ్యడం, కవిత్వం అల్లడం మానేసి సబ్బులూ, పకోడీలూ అమ్ముకో; సుఖంగా బతుకుతావు' అంటే కళావేత్త వినడు, 'స్వామీ, ఈ సంఘంలో కుళ్లుని కదపకండి, అలాగే ఉంచి మీ పని మీరు చూసుకోండి;' అంటే సంఘ సంస్కర్త వినడు. 'ఏమయ్యోయ్ ; తిని కూర్చోక ఎవరెస్టు శిఖరం ఎక్కుతానంటావేమిటి ? గడ్డకట్టిపోతావు, ఇంతా చేస్తే అక్కడేముంటుంది. ముందు తప్పు ;' అంటే సాహసికుడు వినడు...

కాని, ఇటువంటి అత్యవంతులే లోకాన్ని ముందుకి నడిపిస్తారు.

(ఆలిండియా రేడియోవారి అనుమతితో)

★



కాలిన గోడలు : మాడిన మోళ్లు

అగ్ని ప్రమాదానంతరం తేలప్రోలులో కన్పించే దృశ్యం.

సీరియల్ నవల

దత్తత

20

రాము రెండురోజులవరకూ మళ్లీ ధర్మయ్యగారింటికి వెళ్ళలేదు. వెళదామని మనస్సు ఆరాటపడుతున్నా తను లక్ష్మి రెండుసార్లు ప్రవర్తించిన విధానం చాలా లజ్జాకరంగానూ, అవమానపూరితంగానూ ఉండి బాధపడసాగేడు.

తనకు తెలీకుండా ఈ రెండురోజుల్లో ఈ ఊహా అహోరాత్రాలు మానసికంగా సంచారంచేసి, లక్ష్మిపట్ల ఒక గౌరవ భావాన్నీ ఒక అపురూప సవ్యశోభను రాముహృదయంలో ప్రతిష్ఠింపచేశాయి. ఆమెను చూడాలనే కుతూహలాన్ని అణచిపెట్టే అధికారం రాములో ఉండేశక్తులన్నీ కేంద్రీకరించినా ఫలితం లేకపోయింది.

కాలేజీనుంచి వచ్చిన తర్వాత సుమారు అరగంటలకు బట్టలు మార్చుకొని, వీధిలోకి వెళ్లడానికి మెట్లుదిగుతున్న రాముని జమీందారు చూశాడు. హాలులోనుంచి బిగ్గరగా దగ్గుతూ వెలుపలకు వచ్చాడు.

రాము వెనక్కి తిరిగి చూడకపోయినా, తండ్రిదగ్గు విని గమనాన్ని మందగింపచేశాడు.

"ప్రొద్దుగ్రుంకబోయేముందు ఎక్కడికీ ప్రయాణం?" అని అడిగాడు గంగాధరం.

రాము ఆగిపోయి "ఏమీ తోచక..." అని తలవంచి మెల్లగా అన్నాడు.

"చీకటి పడిందంటే గోతులూ గొప్పులూ కనిపించవు...ఎక్కువగా తిరగడం అంత మంచిదికాదు" అని చెప్పి లోపలకు వెళ్లిపోయాడు.

రాము కాస్సేపు అలాగే నిలబడిపోయాడు. జమీందారు అభిమతాన్ననుసరించి ఆగిపోదామనే బుద్ధి రాముకి పుట్టలేదు. తిన్నగా గేటు తీసుకొని వెలుపలకు వెళ్లిపోయాడు.

గంగాధరం హాలులో నిలబడే వెళ్లేరాముకేసి చూస్తూ వుండిపోయాడు. ఈ తిరస్కారభావం జమీందారుమనస్సును వ్యథపెట్టింది.

శుక్రవారం లక్ష్మీపూజచేసి పళ్లెంతో ఫలహారాన్ని తీసుకొని భర్తకోసం అన్వేషిస్తూ పార్వతమ్మ అక్కడికే వచ్చింది.

"ఏమిటలా చూస్తున్నారు?" అని మెల్లగా అడిగింది.

పరధ్యాన్నంగా ఉన్న గంగాధరం చలించి భార్యకేసి తిరిగి చేతులు నమ్రతగా ఎదుటకు చాచి, ఫలహారాన్ని అందుకొని కళ్లకద్దుకొని నోట్లో వేసుకున్నాడు. వెళ్లి సోఫాలో కూర్చున్నాడు.

భర్తనుండి సమాధానం రాకపోవడంవల్ల తిరిగి ఆమె వెళ్లిపోయింది.

గంగాధరంలో తీవ్రతను ఆలోచన ద్వారా ఏర్పడ్డ ఆ తాత్కాలికదీక్షలో బహుశా పార్వతి మాటకూడా విస్పష్టంగా వినిపించలేదేమో; రాముగురించి వారం

శ్రీ పినిశెట్టి
శ్రీరామమూర్తి

రోజులముందువరకూ ఒకేవిధమైన ఆలోచన అతన్ని బాధించింది. ఆ ఆలోచన ద్వారానే, ధర్మయ్యతిరస్కృతివల్ల ఏర్పడ్డ తీవ్రభావం ధర్మయ్యకు శక్తినిచ్చింది.

శాంతమ్మ రాముకు తల్లిగా తెలీకూడదనే పట్టుదలతోనే ఇంతకాలం బాధపడ్డాడు. కాని దానికన్నా మించిన ఒక విపత్తు జమీందారుకుటుంబంలో ఏర్పడే దుస్థితి వస్తుందని, గంగాధరం కలలోకూడా ఊహించలేదు. పేదబాలిక రాము పొరపాటుద్వారా కోడలయ్యే యోగాన్ని జమీందారు ఏ విధంగానూ క్షమించదలుచుకోలేదు. సోఫాలోనించి లేచాడు.

"మల్లయ్యా."

"బాబూ."

"అలా బైటకు వెళదాం పద."

"డ్రైవర్ని పిలవనా?"

"అక్కర్లేదు నడిచే వెళదాం."

మల్లయ్య చాలా ఆశ్చర్యపడ్డాడు. అధికారి ఆజ్ఞ కాదనే అధికారం తనకు లేదని తెలుసు. మెల్లగా జమీందారు వెనకాల బయలుదేరాడు.

రాము ధర్మయ్యగుమ్మం ఎక్కేసరికి శాంతమ్మ చావిట్లో ఒంటిగా కూర్చొని ఉంది. రాముని చూసి శాంతమ్మ లేచింది.

"కూర్చో బాబూ" అంది.

రాము బల్లమీద కూర్చున్నాడు. అతని కళ్లు లక్ష్మిగురించి వెతుకుతున్నాయి.

"ఎక్కడా రావడల్లేదేం బాబూ."

"పరీక్షలు దగ్గరకొస్తున్నాయి కదూ?" అంటూ ధర్మయ్య ఉండేగదివేపు చూసి "మాష్టారెక్కడ?" అని అడిగాడు.

"ఊరెళ్లారు."

రాము ఆశ్చర్యపడ్డాడు. ధర్మయ్య పొరుగూరు పోవడమనేది ఎప్పుడూ రాము వినలేదు. "ఏవూరు" అని ఆత్రంగా అడిగాడు.

శాంతమ్మ సమాధానం చెప్పలేదు.

వంటచేస్తూ రాము రాక ఆఘ్రాణించిన లక్ష్మి ఈ మాటలన్నీ మ్లానవదనాన్ని ప్రక్కగాపెట్టి శ్రద్ధగా వింటూంది.

"లక్ష్మి కనిపించదే!" ఈ ప్రశ్నకూడా ఆత్రంగానే ధ్వనించింది.

"వంటచేస్తోంది" అని శాంతమ్మ సమాధానం చెప్పినమీదట రాము లేచాడు. "అలా పోతానమ్మా" అన్నాడు.

లక్ష్మి వంటగదిలోనించి వచ్చింది. రాముని చూసింది. పలకరించాలనే కుతూహలం ఆమెలో లేదు.

మందహాసహీనమైన ఆమె ముఖవదనాన్ని ఆ కనుచీకట్లో రాము సరిగా పరికించలేదు.

రాము మనస్సు మాత్రం ఒంటరిగా - తాను యిక్కడ పరాయివానిగా నిలబడ్డాననే భావాన్ని పదేపదే స్ఫురింపచేస్తోంది. శాంతమ్మకూడా కూర్చోమనలేకపోయింది.

రాము గుమ్మంవరకూ వెళ్లి "ఆ-మరచా-మాష్టారు ఎక్కడికి వెళ్లారూ?" అని మళ్లీ అడిగాడు.

శాంతమ్మకూడా లేచింది: "ఒక్క

ఊరని ఏముంది ? ఎక్కడ మంచిసంబంధం ఉందని తెలిస్తే అక్కడకల్లా వెళ్లిచూస్తూ వుంటాడు" అని సమాధానం మిచ్చింది.

"సంబంధం?" రాము ఆశ్చర్యంగా అలాగే నిలబడి ప్రశ్నించాడు. లక్ష్మి అక్కడ ఉందేమోనని చూశాడు. లక్ష్మి లేదు.

"అః మన లక్ష్మికి సంబంధంకోసం వెళ్లాడు" అని శాంతమ్మ చెప్పింది.

ఈ మాట పిడుగుపాటులా రాముకి స్ఫురింపచేసింది. కాలు కదపలేదు. మళ్లీ ఏమీ ప్రశ్నించలేదు. అలాగే నిలబడిపోయాడు.

"వెళ్లడం నీకు తెలీదా బాబూ" అని కొంత ఆశ్చర్యంగానే అడిగింది శాంతమ్మ.

లక్ష్మి వంటగదిలోకూడా లేదు. రాముకి కనిపించకుండా గోడకు జారగిలపడి నిలబడి ఉంది. ఆమె మొగంలో, విరక్తి వైరాగ్యభావాలు నిస్పత్తువగా దీపిస్తున్నాయి.

రాము ఒకక్షణంపాటు నిలబడి, ఊర్ధ్వశ్వాసను విడచి శాంతమ్మ మొగంలోకి చూశాడు. ఆమె అతని వైఖరిని మసకవెలుగుల్లో గమనించలేకపోయింది.

"బాబూ! నువ్వుచేసే ఈ ఉపకారాన్ని మీ మాస్టారు జన్మలో మర్చిపోలేరు" అంటూ అతని సమాధానంకోసం చూసింది. రాము అలాగే గుడ్లు వప్పజెప్పి చూస్తున్నాడు.

మళ్లీ శాంతమ్మ ఈలా అంది "మీ నాన్నగారితో చెప్పి లక్ష్మి పెళ్లికి సాయం చేయడం అన్నయ్యకు ఎంతో ఆనందం గలిగించింది."

"ఔను" అని హీనంగా, బాధగా తల వంకిస్తూ అన్నాడు.

పొయ్యిమీద కాగేపసరు పొంగి, మండే పొయ్యిని ఆర్పిన ధ్వని శాంతమ్మకు వినిపించింది.

"ఎక్కడున్నావే లక్ష్మీ" అంటూ ఖంగారుగా వంటగదిలోకి శాంతమ్మ వెళ్లింది.

అయాచితంగా-చేయని కృషికీ-ధర్మానికీ వచ్చే అభినందనలను తట్టుకుంటూ "ఔను" అని అనలేకుండా ఉండలేకపోయాడు రాము.

ఆ ధ్వని నూతినుండి వినిపించినంత హీనంగా ఉన్నా - తదేకదీక్షతో చాటునుండి సమాధానంకోసం చూస్తున్న లక్ష్మి చెవినుండి కాని దేదీప్యంగా మెరుస్తూ కరిగినసీసంలా సాగిపోయి ఆమె హృదయాన్ని తూట్లుపరిచింది. అందుకే పొయిమీద పొంగి అగ్నిలో కృంగినజలంయొక్క కృంగభంగ కోలాహలపుధ్వని కూడా ఆమె చెవులకు సోకలేదు.

"లక్ష్మీ" చేతులతో ద్వారబంధాన్ని పట్టుకొని లోపలకు వంగి, చైతన్యవిహీనంగాఉన్న లక్ష్మిని చూస్తూ రాము పలకరించాడు.

కళ్లు తెరచి చూసింది.

"ఏమిటిది."

"ఏముంది."

"నువ్వు చెప్పక్కర్లేదా ?"

"నేను మగవాణ్ణి కాదే" అంటూ గోడ

★ దత్తత ★

దగ్గర్నుంచి కదిలి రాము ఎదురుగా వచ్చి "నా నేరం ఏమిటి? నా కెందుకీ శిక్ష? నాకు తెలీకుండా అన్ని ఏర్పాట్లూ చేసి తెలీనట్లుగా పలకరించడానికివచ్చావా?... నాతో మాట్లాడకు వెళ్లిపో!" హృదయాంతరంలోంచి వచ్చే ఈ మాటలని ఉబికివచ్చే దుఃఖాన్ని అదుముకొనేశక్తి లేక కాకే కళ్లనీళ్లను రెండుచేతులతో కప్పుకొని ప్రక్కకు తిరిగింది.

శాంతమ్మ వంటగదిలోనుంచి వచ్చి ఈ దృశ్యం చూసింది. ఏదో చెప్పాలని గుమ్మంలో కాలుపెట్టిన రాము శాంతమ్మను చూసి, నిర్విణ్ణుడైపోయాడు.

"నేను తోట్లోకి వెళుతున్నా" అని ఖంగారుగా స్పష్టంగా అని రాము గిర్రున తిరిగి వెళ్లిపోయాడు.

శాంతమ్మ ఆశ్చర్యానికి అంతులేదు. మెల్లగా లక్ష్మిదగ్గరకు వచ్చి "లక్ష్మీ" అని పిలిచింది.

లక్ష్మి కళ్లుతుడుచుకొని, శాంతమ్మను తప్పుకొని లోపలకు వెళ్ళడానికి రెండడుగులు వేసింది.

"ఏమిటి లక్ష్మీ!" అని శాంతమ్మ వెనకనించి అనడంలో లక్ష్మి కొయ్యలా నిలబడిపోయింది.

"నేను నీకు పరాయిద్దాన్ని కాదుగా... అదేమిటో వినకూడదూ?"

లక్ష్మి ఉద్ధృతంగా వెనక్కి తిరిగింది. శాంతమ్మ హృదయంలో శిరస్సు ఉంచి "అత్తా" అని బావురుమంది.

శాంతమ్మ కళ్లల్లో నీళ్లు తిరిగాయి. బలహీనమైన నవ్వు కళ్లనీళ్లతోనే నవ్వింది. లక్ష్మి శిరస్సు స్పృశిస్తూ "తప్పమ్మా! అందనిపండుకి ఆశపడకూడదు" అని మృదువుగా అంది.

"అందనిపండు" అంటూ అగమ్యంగా కళ్లనీళ్లతో అలుక్కుపోయి కనిపించే శాంతమ్మ మొగాన్ని చూసింది లక్ష్మి.

"అలాంటి అదృష్టాన్ని నేను కూడా చూడాలనుకున్నాను...కాని..." గద్గదికంగా అంటూ శాంతమ్మ కళ్లనీళ్లు తుడుచుకొంది. శాంతమ్మలో దాగిన అనురాగపూరితమైన ఈ ఆశయానికి అర్థమేమిటో లక్ష్మి తెలుసుకోగల స్థితిలో లేదు. తాను పొందిన హఠాత్ ఉద్ధృతానుభూతికి తిరిగి శాంతమ్మకు మొగం చూపలేక తిన్నగా తండ్రీ గదిలోకి వెళ్లి మంచంమీద వాలిపోయింది లక్ష్మి.

"తోటలోకి వెళుతున్నా"అని ఆత్రంగా అస్పష్టంగా రాము అన్నమాటల్లో అర్థం లేకుండా పోలేదని లక్ష్మికి తెలుసు. అనేక మార్లు తాను తోటలో కనిపించాలని కాంక్షించే రామునకు ఈ సంజ్ఞాపూర్వక వాచకం అలవాటైపోయింది. అందుకే రాము మెల్లగా వెళ్ళి తన స్థానంలో కూర్చున్నాడు.

తనకు తెలీకుండా యింత గ్రంథం జరగడంలో ఉండే కారణాన్ని పర్యవలోకనం చేయ ప్రారంభించాడు.

గంభీరమైన తండ్రివిగ్రహంముందు, భావస్ఫూరితమైన ఆయన మాటలముందూ రాము ఎప్పుడూ తలెత్తి ఎరగడు. మాట్లాడే సంకల్పంకూడా ఎప్పుడూ కలగలేదు. కాని గౌరవంగా భావించే తండ్రి తలపెట్టిన ఈ దుశ్చర్యకు రాము మనస్సులో ఒక క్రోధం ఆవహించింది.

పెద్దలయందు చూపే వినయానికి కూడా ఒక హద్దంటూ లేకపోతే; భావిని కాంక్షించే ప్రతిజీవి తప్పక భగ్నపడే దుస్థితికిరావడంలో ఆశ్చర్యంలేదని గ్రహించాడు.

మల్లయ్య రాకలో వుండిన మహత్తర సత్యాన్ని తెలుసుకొని అరికాలును బాధగా ఒక్కసారి రాసుకున్నాడు.

అనురాగపూరితమైన తన హృదయంలో అధిష్ఠించిన పవిత్రమైన లక్ష్మివిగ్రహాన్ని తొలగించుకునే దుస్థితి పరిస్థితులే కల్పిస్తే, ప్రాణంపోవడమే అంతకన్నా సుఖమైన గమ్యమని ఊహించసాగాడు.

ఎండుటాకుల గలగలధ్వనులవల్ల రాము ఆలోచన్నుండి తేరుకున్నాడు. ప్రక్కను చూశాడు.

చెట్లగుబురునుండి చీల్చుకువచ్చే చంద్రకాంతిలో ఎవరో తనవేపే వస్తున్నట్లు గుర్తించాడు. లేచాడు.

వెంటనే ఆకులధ్వని ఆగిపోయింది. వచ్చే వ్యక్తి నిలబడిపోయాడు. మొదట్లో లక్ష్మిగా భ్రమించిన రాము నిస్పృహగా నిట్టూర్చాడు. మల్లయ్య వెంటనే గ్రహించాడు.

మామూలు స్థానంలో కూర్చొన్నాడు. క్రిందభాగాన్ని చూశాడు కొబ్బరికమ్మ కాళ్ళదగ్గరగానే వుంది.

మళ్ళీ ఆకులు కదలాయి. రామునూడ్చా నికి ఏమీ ప్రయత్నించలేదు.

కొన్నేపటికల్లా మల్లయ్యనీడ తన ఎదురుగా నిలబడింది. రాము కళ్ళలో క్రోధం మెరసింది. కాళ్ళదగ్గరవున్న కమ్మ తీసుకొని, లేచి బలంగా మల్లయ్యపై విసరాడు.

"బాబోయ్" అని మల్లయ్య అరచాడు.

మరోదెబ్బకొట్టి, కమ్మప్రక్కగా విసరి, మల్లయ్యచేయిపట్టుకొని "గట్టిగా అరవకు" అని తనే బిగ్గరగా అరచాడు రాము.

మల్లయ్య వొణుకుతూ నిలబడిపోయాడు.

"ఎందుకొచ్చావ్"

మల్లయ్య సమాధాన మివ్వలేదు. ఒణుకుతూ అర్థంగాకుండా ఏదో చెప్పబోతున్నాడు.

నాడి దుస్థితిచూసిన రాము మనస్సులో క్రోధమంతా అదృశ్యమైపోయి ఆస్థానంలో జాలి, కరుణ వెంటనే చేరుకున్నాయి. తాను చేసినపని ఎంత నీచమైందో వెంటనే గ్రహించగలిగాడు. వేదనగా మల్లయ్యకేసి చూశాడు.

మల్లయ్య ఇంకొవణుకుతూనేవున్నాడు. తలతో ఓప్రక్కకు చూపించడానికి ప్రయత్నిస్తున్నాడు. రాము ఆ సంజ్ఞను అర్థం చేసుకోలేదు. జేబులో చేయిపెట్టి వెతగ్గా అయిదురూపాయలనోటు దొరికింది.

"తీసుకో —— నాన్నగారితో చెప్పకు" అని చెమ్మగిల్లినకళ్ళతో చేతిలో పెట్టాడు రాము.

కొద్దిదూరంలో నూతిప్రక్కనుంచి జమిందారు యివన్నీ గమనించాడు. కాని రాము ఎదురుగా రాలేదు. ఈ మాటలన్నీ విన్న జమిందారురాముఎదురుగావస్తే; తనవిలువను వెలకు పెట్టినట్లుగా వుంటుందని తెలుసుకుని ప్రక్కనున్న నాగయ్యచెవిలో ఏదోచెప్పి, ఆ వెన్నెలవెలుగులో జమిందారు నడిచి వెళ్ళిపోయాడు.

మల్లయ్య డబ్బుతీసుకొని తగిలిన దెబ్బలు చేతితో తడుముకుంటూ అక్కణ్ణుంచి కదిలాడు.

మల్లయ్యవెళ్ళినతర్వాత రాము తన ఆవేశానికి తనే చాలా పశ్చాత్తాప పడ్డాడు. రాము జీవితంలో మరోజీవిని బాధపెట్టడం ఇదే ప్రారంభమనుకున్నాడు. కాని కనిపించనిగాయాన్ని మరోజీవి హృదయంలో కలిగించాననీ ఆ జీవి రెండురోజులనించి నిద్రాహారాలుమాని క్షోభిస్తోందని రాముకేం తెలుసు ?

గడియారం చూచుకున్నాడు. తొమ్మిది గంటలయింది. లక్ష్మి వస్తుందనే ఆశ రాములో అంతరించింది. లేచి స్తబ్ధంగా డుగా నిలబడి కొన్నేపు బావికేసి తీక్షణంగా చూశాడు. మెల్లగా కదలి గేటు దగ్గరకు వెళ్ళాడు.

"బాబుగారూ" అంటూ వెనుకనించి నాగన్న పిలచాడు. రాము ఆగి చూస్తున్నాడు. నాగన్న దగ్గరగా వచ్చాడు.

"రేపటినించి తమరు రావడానికి వీలుండదు" భయపడుతూ, ఇంతకుముందే మల్లయ్యకు జరిగిన సన్మానాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ మెల్లగా అన్నాడు.

"ఎందువల్ల"

"రేప్పొద్దున్నే - దొరగారు గేటుమూసేస్తున్నారు"

"అదే - ఎందుకని?" మరీ బిగ్గరగా అడిగాడు.

"నాకేం తెలుసుబాబూ! రేప్పొద్దున్నుంచి నన్నుకూడా ఇంటిదగ్గర పనిలోనే వుండమన్నారు...అసలు ఈ తోట్లోకి ఎవరూ రాడానికి వీల్లేదని చెప్పారు"

"ఎప్పుడు"

"ఇంతకుముందే"

తీరా చెప్పినతర్వాత నాగన్న పొరపాటైందని నాలుక కరుచుకొని భయపడ్డాడు. ఇంతకుముందే అనడంలో రాము భయాశ్చర్యాలతో నిలబడిపోయాడు. నాగన్నకు మాత్రం ఈఆజ్ఞ జమిందారుద్వారా ఎప్పుడు లభ్యపడిందో ఇతరులకు చెప్పేవిధానం మాత్రం గంగాధరం చెప్పలేదు. "సరే" అని గట్టిగా గాలి విడుస్తూ గేటు దాటి చురుగ్గా నడుస్తూ యింటివేపునకు వెళ్ళిపోయాడు.

21

వెళ్ళిన పదిరోజులకు ఒక మంచి సంబంధాన్ని స్థిరపర్చుకొని తిరిగివచ్చాడు ధర్మయ్య——.

పదిమైళ్ళదూరంలో ఉన్న ప్రక్కగ్రామంలో కులీనమైన చౌదరీ కుటుంబంతో ఇంత పేదస్థితిలో వియ్యమందడం ధర్మయ్యకు కష్టమైనా - జమీందారిచ్చిన భరోసాతో అయిదువందల రూపాయలు కట్నమివ్వడానికికూడా వెనుతీయలేదు.

ఒక శుభముహూర్తాన పెళ్ళికొడుకు కోరికమీద లక్ష్మిని చూపడానికి ధర్మయ్య ఆమోదించే వచ్చాడు.

రవి యీ విషయం విని ఎంతో ఆనందపడ్డాడు. అయితే డబ్బువిషయం గురించి అతని మనస్సులో ఆందోళన లేకుండా పోలేదు.

లక్ష్మితో క్రితం ఉన్నంత చనువుగా ఉండలేక పోతున్నాడు. "లక్ష్మి" అని అధికార పూర్వకంగా పిలచే ఆ పిలుపులో ఒక సౌమ్యత ఏర్పడింది.

లక్ష్మిలోకూడా విచిత్రమైన మార్పు రవి గమనించాడు. ఆమె ప్రతి విషయంలో ఉదాసీనంగా ఉంటూ, పనులు చేయడంలో అంతగా శ్రద్ధలేక, అస్థిరమైన ఈ యింట్లో నాదనే వస్తువలేదనే భావంతో ఉన్నట్లుగా రవికి కనిపించింది. బహుశా భవిష్యత్తుల్లో కన్నయిల్లు విడుస్తామనే కన్యల మనఃపరిస్థితి ఈలా మారుతుందికాబోలని తనకున్న పరిజ్ఞానంతో స్థిరపర్చుకున్నాడు. భోజనందగ్గర కూర్చున్న రవి, వంట గదివైపు చూస్తూ——"చారు" అని పిలిచాడు.

వంటగదిలో నుంచి కళ్ళు తుడుచుకుంటూ వచ్చిన లక్ష్మి, మజ్జిగపాత్ర తీసుకవచ్చి రవిదగ్గర పెట్టింది.

దూరంగా పాతచీర కుట్టుకుంటున్న

(53-వ పేజీ చూడండి)

శ్రవ్య నాటిక:



డా॥ గాలి బాలసుందర్రావు

(కారు ఆగిన చప్పుడు, పదధ్వనులు)

ప్రసూన: ప్రసాద్...ఎంత బాగా కృత్యం చేస్తావు నువ్వు.

ప్రసాద్: యూరప్‌లో వేరే పనేముంది?

ప్రసూ: నాతోలాగే ఎంతమందితో డ్యాన్సు చేశావో.

ప్రసా: నీవంటి సుందరాంగి నన్ను ప్రేమిస్తుందని తెలియనప్పుడు ఎంతమందితోనో చేశాను.

ప్రసూ: ఇకమీదట?

ప్రసా: మైసూర్ పాక్ రుచిచూసిం తరవాత, మరమరాలు రుచిస్తాయా...

ప్రసూ: ఎక్కడికక్కడే మైసూరు పాకూ, జిలేబీ.

ప్రసా: కాదు ప్రసూనా! చాలా ప్రొద్దుపోయింది. మీవాళ్లేమయినా అంటారు! యింత లేటుగావస్తే.

ప్రసూ: మేమేం, ఇక్ష్వాకులనాటివాళ్లమనుకున్నావేమిటి? మా నాన్నగారు నాలుగుమార్లు యూరప్ వెళ్లేరు.

ప్రసా: నువ్వింకా వెళ్ళలేదుగా, నిజంగా యూరప్‌లో జీవితం యెంతబాగుంటుంది. మనవాళ్ళకు బ్రతికడమంటే యేమిటో తెలియదు. మళ్ళీ ఒక యుద్ధం వస్తే బాగుండును.

ప్రసూ: యుద్ధంవస్తే నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోతావు బాబోయ్.

ప్రసా: నిన్ను విడిచి వెళ్తానా? యూరప్‌లో అందగత్తెలమని కొవ్వెక్కి కొట్టుకుంటేవాళ్ళందరికీ యీ సౌందర్యరాసిని చూపించి వాళ్లు బేజారెత్తి పారిపోయేటట్లు చేస్తాను.

ప్రసూ: అబ్బబ్బ! యీ మిలిటరీవాళ్ళకీ వాగ్ధోరణి యెవరు నేర్పారో!

ప్రసా: బ్రహ్మచర్యం.

ప్రసూ: అబ్బో...ఋషిపుంగవులు...రా లోపలికి...మా అమ్మ ఏమీ అనదులే.

ప్రసా: మీ నాన్నగారు?

ప్రసూ: ఆయన బావగారుపోతే అప్పగార్ని చూడడానికి వెళ్లేరు.

*   *   *

లక్ష్మయ్య: బాబూ! బండి సిద్ధంగా వుంది.

నరశింగరావు: అప్పా! పోయిన బావ కోసం దుఃఖపడకు, ఉన్న విద్యాసాగర్ని చూచుకుని మనస్సు తృప్తిబరచుకో...

మహాల: ఎంత ఆపుకున్నా దుఃఖం ఆగుతుందా నాయనా... వలభైఅయిదేళ్ళు కాపురం చేస్తిని. నీ భార్యకు ఝుడిసినువ్వూ, ఆయనకు ఝుడిసు నేనూ ఒకల్లనొకళ్ళం గానూ కోకుండా పోయినాము. ఇన్నాళ్ళు కాపరం చేసినా, ఏదోజీవితం వెళ్ళబుచ్చడానికి సరిపోయిందేగాని వెనకాల ఏమీ లేదు. ఇహానీ మేనల్లుడంటావ్వూ, ఓవర్ సీయర్స్ పరీక్షయినా ఉన్నమాటేగాని, ఉద్యోగం మాట తలపెట్టడు. ఎప్పుడో ఏవో యంత్రాలూ అవీ తయారుచేస్తానని, ఏవేవో బొమ్మలు వేసుకుకూర్చుంటాడు. ఈ దేశం దరిద్రంతీరుస్తే యింజనీర్లే తీర్చాలంటాడు.

నర: ఆమాట నిజమే; అటువంటివాళ్లకు తగిన అర్థబలమే వుంటే ఏకార్యమయినా సాధిస్తారు.

మ: నువ్వూ అట్లా అంటే యెట్లా నరశింగరావు?

నర: అక్కయ్యా నీకు బావకున్నంత పూర్వాచారంవుందా.

మ: ఇంకా యేం పూర్వాచారం నాయనా, కొడుకెప్పుడూ గూడేల్లోనే నాయె...నాకంత పట్టింపు లెప్పుడూ లేవు, నాకందరూ సమానంగానే కనపడతారు. అయినా యిప్పుడా సంగతియెందుకు?

నర: నేనూ పెద్దవాణ్ణయినాను, నెత్తురుపోటు యేర్పడింది. ఏవేవో సంస్థలన్నీ పెట్టేను. నాకూ మిల్లులూ అవీ వున్నవి. ప్రసూన పెద్దదయింది. దానికి తల్లి పోలిక వచ్చింది. దాని తర్ఫీదులో అది కేవలం మొగరాయుడుగా తిరుగుతోంది.

మ: ఏదో పదిలక్షల ఆసామీకి ముద్దులకూతురు. అయినా ఆగరదా లన్నీ నాగరీకులకు ఉన్నవేగా, ఈ కాలంలో తిరగని ఆడపిల్లుందా యేమిటి? పురుషుడికెంత స్వేచ్ఛవుందో స్త్రీకి అంతస్వేచ్ఛ వుండాలంటాడు నీ మేనల్లుడు కూడాను.

నర: ఆ వయస్సులో నేనూ అట్లాగే అన్నాను. ఈనాటికి నాకూతురు మాఆవిడలాగా తయారౌతోందేమోనని భయంగా వుంది.

మ: మీ ఆవిడకేం కోరి చేసుకొన్నదేగా నాయినా?

నర: చేసుకున్నప్పుడు, ప్రేమ వివాహం బాగానే వుంది. పదేళ్లదాకా భార్యావిధేయుడుగా జీవించడం సరదాగానే వుంది. అదంటే గడగడలాడటం ఆనందకరంగానే వుండేది. కాని వయస్సు మళ్లిన కొద్దీ ఆ విషయాలే బాధకలిగిస్తున్నవి.

మ: నీభార్య నిన్ను చేసుకున్నట్లే నీకూతురు ఎవర్నో ప్రేమవివాహం చేసుకుంటుందనేనా నీభయం?

నర: ప్రేమ వివాహం చేసుకుంటే ఇబ్బందిలేదు కాని డబ్బున్నవాడికూతురంటే ఎన్ని విధాల వంచించాలో అన్ని విధాల వంచించడానికి యీకాలపు కుర్రకుంకలు కాచుకునివుంటారు. ఎవరయినా గుణశీలు లున్నవాణ్ణి చూసుకుంటే బాగానే వుంటుంది.

మ: నాయనా...ఎవరి కర్మ ఎల్లావుందో అల్లా జరుగుతుంది. నీ తల్లి దండ్రులు పోవడం, మేము నిన్ను పెంచడం నువ్వు మీ బావగారి ఒద్దికలు పడలేక పట్టణం పోవడం, అక్కడ లక్షాధికారి కూతురు నిన్ను గాంధర్వవివాహం చేసుకోడం నువ్వింతవాడివి కావడం, ఇప్పుడు కూతురేం చేస్తుందోనని తహతహలాడడం ఇవన్నీ - ఆ పరాత్పరుడి సృష్టివిచిత్రాలే నాయినా. అయినా నా ఆచారంసంగతి దేనికొచ్చిందో చెప్పలేదే?

నర: అది ఒక సంకల్పంతో అడిగాను. సమయం వచ్చినప్పుడు చెప్తాను. నేను వచ్చే వేళకు వస్తాన్నాడు విద్యాసాగర్. యింకా రాలేదే.

మహ: వస్తాడు. తొమ్మిదయిందా?

నర: ఒక నిముషం తక్కువ. అదుగో దొర్ల పంక్చువాలిటీతో వచ్చాడు.

విద్యా :- ధూర్తతో తిరిగేవాడివి. గతంలో దొరలకు తప్ప యితర్లకు పంక్చ్యువాలిటీ వుండ దనుకుంటావు మామయ్యా.

మహా : మామయ్య వెళ్తున్నాడు విద్యా సాగరం, నాలుగురోజులుంటా డనుకుంటే,

నర : ఇంకెన్నాళ్ళుండమంటా వక్కయ్యా... నెల్లాళ్ళయింది నేను వచ్చి. ఇంకా ఎన్నాళ్ళుండను? అయితే విద్యాసాగర్ నీ చదువు పూర్తి అయిందిగా మల్ళా మరి ముందు ఏం జేస్తావు?

విద్యా : నా జీవితం గ్రామోద్ధరణకూ, నిర్మాణ కార్యక్రమానికీ ధారపోయడానికి నిశ్చయించుకున్నాను.

నర : మంచిదే. ఈనాటి విద్యావంతులు చేయవలసిన పనే అది.

విద్యా : మామయ్యేనా మాట్లాడేది?

నర : ఏం ధనికుణ్ణయినంత మాత్రాన కాలగతిని గుర్తించలే ననుకున్నావా విద్యాసాగర్.

మహా : ఇన్నాళ్లు ఆయన వున్నారు గనక యిల్లు గడిచింది. ఇహనయినా ఏదో జీవనోపాధి కల్పించుకోకపోతే ఎల్లా నాయనా.

నర : నేనుండగా ఉద్యోగం ఎందుకక్కయ్యా.

మహా : మేము నీవాళ్ళమయితే మట్టుకు మీ ఆవిడవాళ్ళం గావద్దు నాయనా.

నర : అదీ నిజమే...(నిట్టూర్పు) కాని విద్యాసాగర్‌కు యిష్టమయితే మంచి ఉద్యోగం యిప్పిస్తాను. కాని చాలా బాధ్యతగల ఉద్యోగం చాలా కష్టపడిచేయవలసిన పని.

విద్యా : నా ఆశయం చెప్పేగా మామయ్యా...

నర : నీ ఆశయ్యానికి అనుగుణమయిన పనే అది. ధనం లేకపోతే యే ఆశయమూ సిద్ధించదు. మొదలు పని చెయ్యాలంటే ఆర్థిక సమస్యలు లేకుండా వుండాలి.

విద్యా : డబ్బు వున్న బంధువులదగ్గిర వుద్యోగం ఆత్మగౌరవాన్ని నాశనం చెయ్యవచ్చును.

నర : యజమానులందరూ ఆత్మగౌరవానికి భంగం కలిగించరు నాయనా...

మహా : ఇల్లా ఎదిరించి మాట్లాడేవాడికి ఎవరు వుద్యోగమిస్తాడు ?

నర : నే నిచ్చే వుద్యోగానికి అల్లా నిర్భయంగా మాట్లాడేవాడే కావాలి. విద్యాసాగర్ నీ ఆత్మగౌరవానికీ ఆశయాలకు విరుద్ధం కాని ఉద్యోగం యిస్తాను పట్టణం వస్తావా ?

విద్యా : నువ్వింత మంచి యజమానివని నాకు తెలీదు మామయ్యా.



రెండు వేరువేరు ఇన్‌స్యూరెన్సు కంపెనీల ఏజెంట్లు ఒక క్లబ్బులో సమావేశమైనారు. ఇద్దరూ వారి వారి కంపెనీల గొప్పతనాన్ని గురించి చెప్పుకోవటం మొదలు పెట్టారు.

"మా కంపెనీలో యిన్‌స్యూర్ చేసిన ఒక పెద్దమనిషి, పోయిన శుక్రవారం నాడు చనిపోయాడు. శనివారం వుదయాని కల్లా, ఆయన వారసులకి మాకంపెనీ వాళ్లు చెక్కు పంపించేశారు" అన్నాడు ఒక కంపెనీ ఏజెంట్,

"ఓస్; ఇంతేనా! బొంబాయిలో మా కంపెనీ హెడ్ ఆఫీసు ఇరవై అంతస్థుల పెద్ద భవనంలో పదమూడో అంతస్థులో వుంది. ఇరవయ్యో అంతస్థులో పనిచేసే ఒక పెద్దమనిషి మాకంపెనీలో ఇన్‌స్యూర్ చేశాడు. ఆయన గత గురువారంనాడు ఆ ఇరవయ్యో అంతస్థు కిటికీలోంచి కిందికిదూకేస్తూ మా ఆఫీసు కిటికీ దగ్గరకు వచ్చే సరికి మా కంపెనీవాళ్లు ఆయన చెక్కు ఆయన చేతికి అందించేశారు." అన్నాడు రెండో కంపెనీ ఏజెంటు.

లక్ష్మి : బండివచ్చి గంట అయింది బాబూ...

నర : వస్తున్నా లక్ష్మయ్యా... అక్కయ్యా వెళ్లివస్తాను. ఉద్యోగానికి ఏర్పాట్లు చేసి కబురంపిస్తాను. కాని చాలా బాధ్యతగల వుద్యోగం చాలా కష్టసాధ్యమయినపని.

మహా : క్షేమంగా చేరినట్లు వుత్తరం రాయి తమ్ముడూ.

(కారు స్టార్టుఅయిన ధ్వని హారన్ చప్పుడు)

* * *

(నరసింగరావు డ్రాయింగురూము.

ప్రసూన, ప్రసాద్ :- రేడియోలో వెల్లువకడలిలో మునిగినవారికి
తరతమభావము కలిగెడుగా,
ప్రణయకౌముదీ ప్రసరణభావము
పర్వతావళిని భయపడు నా
పూర్ణకౌముదీ పులకితవార్నిధి
మలయపవనుగని నిలచెడుగా
ఎద లోపలగల ఎదకదలించెడు
మనోరభావమే నీలాంబరమై
ఎలకలిగెనో యించుక తెలియని
పులకాంకురములు పుల్లపించగా

ఆడవాళ్ల పెట్టెలో అందమైన ఒక అమ్మాయి కూర్చొని వున్నది. కిటికీకి అవతల ప్లాట్‌ఫారం మీద నల్లటి మొద్దుమనిషి ఒకడు నిలబడి వున్నాడు. బండిలో ఆ అమ్మాయికి ఎదురుగుండా ఒక ముసలమ్మగారు కూర్చొని వున్నది. బండి కదిలేటంత వరకు ఆ అమ్మాయి కానీ, అవతలవున్న మనిషి కానీ, ఒక్కమాటైనా మాట్లాడుకో లేదు. కానీ, తీరా బండి బయలుదేరే సమయానికి ఆ అమ్మాయి వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది. తనకెందుకు లెమ్మని వూరుకోలేక ఆ అవ్వగారు ఆ అమ్మాయిని బుజ్జగించబోయి "ఆయన నీ పెనిమిటా అమ్మా? పాపం... విడిచిపెట్టి పోతున్నందుకే కాబోలు, అంతగా విచారపడుతున్నట్లున్నావు?" అన్నది.

"లేదండి అవ్వగారూ, మళ్లీ మూడు రోజుల్లోనే యీయన దగ్గరికి వచ్చి వుండాలి కదా అని దిగులు వేస్తున్నదండీ!" అన్నది ఆ అమ్మాయి, వెక్కి వెక్కి ఏడుస్తూనే.

ఆజ్ఞ

నా హృదయమొక్క నాట్యమయూరము
ఊరుములు మెరుపులు వెరువనిదై.

ప్రసూ: అబ్బ ఎంత అందమయినపాట.

ప్రసా: ఎవడో కవి మనలాంటివాళ్లను చూచి వ్రాసివుంటాడు.

ప్రసూ: ఏం మనకేం?

ప్రసా: ప్రేమపిచ్చి పట్టకపోతే నీలాంటి ధనికుడి కూతురు నాలాంటి పేదవాణ్ని ప్రేమిస్తుందా.

ప్రసూ: (రేడియోలోని పాటలను అనుకరిస్తూ).

వలపుకడలిలో మునిగినవారలు
తరతమభావము వలచేదేదో

(కారు ఆగినచప్పుడు)

ప్రసూ: ఎవరది? నాన్నగారు వచ్చినట్లుంది.

ప్రసా: అయితే నే వెళ్తాను.

ప్రసూ: ఎందుకు ఉండు నిన్ను నాన్నగారికి పరిచయంచేస్తాను.

(పదధ్వనులు)

ప్రసూ: నాన్న గారూ...ఇప్పుడేనా రావడం.

నర: ఇప్పుడేనమ్మా...యీాయ నెవరు?

ప్రసూ: నా స్నేహితుడు కెప్టెన్ ప్రసాద్ అని...

ప్రసా: నమస్తే.

నర: (నమస్తే) ఏం చేస్తున్నావు, నాయనా నీవు?

ప్రసా: ఇప్పుడే ఆర్మీనుంచి డీమాబ్ అయినాను. గవర్నమెంటు సర్వీసుకు ప్రయత్నం చేద్దామనుకుంటున్నాను.

నర: ఊహు...ఏవూరు మీది?

ప్రసా: మా దీవూరని చెప్పడానికి లేదండి, మా అమ్మ నాన్న చిన్నప్పుడే పోయినారు.

నర: కనబడుతూనే వుంది.

ప్రసూ: ఈయన్ను నేను మిలిటరీ టాటూలో కలుసుకున్నాను నాన్నా.

నర: ఎక్కడ కలుసుకున్నావని నేనడగలేదే?

ప్రసూ: మీ ధోరణిచూస్తే ఆసంగతి అడుగుతారని తోచి ముందే చెప్పేను. ఇతన్ని నేను గాఢంగా ప్రేమిస్తున్నాను. నాన్నగారూ. అలిసి వచ్చారు గాముల్ను విశ్రాంతితీసుకోండి, రా ప్రసాద్.

ప్రసా: ఆ నమస్కారం. సార్. శలవు...

నర: (నిట్టూర్పు) అట్లా తర్ఫీదు చేసింది దాన్ని.

దుర్గాంబ: ఏమండీ, అల్లా వున్నారు? పాపం విద్యాసాగర్ తండ్రి లేనివాడయి నాడు గాముల్ను...

నర: తండ్రివుండీ ప్రసూన లేనట్లే వుందిగా? అమ్మాయి వెంట వేసుకుతిరిగే ఆమిలిటరీవాడెవడు.?

దుర్గాం: అతనిప్పుడు మిలిటరీలో లేడు.

నర: దేంట్లోనూ లేడులే...

దుర్గాం: ఎందుకంత తృణీకారం, అతనంటే?

నర: ఇంటికొహ్వానించి నువ్వు మర్యాద చేస్తుంటే నేను తృణీకరించినమాత్రాన ఏం ప్రయోజనం?

దుర్గాం: ప్రసూన అతన్ని గాఢంగా ప్రేమిస్తోంది.

నర: గాఢంగా ప్రేమిస్తే బాగుంటేది. ప్రేమించిందిట! ఎవణ్డిగి ప్రేమించింది? (కోపం)

దుర్గాం: నేను మిమ్మల్నెవర్నడిగి ప్రేమించాను?

నర: పెద్దవాళ్ళు నడక్కుండా యీడొచ్చిన పిల్లతో ఎవడన్నా అట్లా ప్రవర్తిస్తాడా?

దుర్గాం: ఎల్లా ప్రవర్తించాడు?

నర: సోఫాలో అనుక్కూచున్నాడు.

దుర్గాం: వాళ్లింటో సోఫాలో అనుకుకూచున్నారు. మీరు నన్ను పార్కుల్లోనే అనుక్కూచునేవారే? ఈడొచ్చి ప్రేమించుకున్నవాళ్ళు పెద్దవాళ్ళనడిగి ప్రేమిస్తారేమిటి?

నర: మరి ఎవర్నడిగి ప్రేమిస్తారేమిటి?

దుర్గాం: తమ హృదయాలను. మీరు మా నాన్ననూ మీ నాన్ననూ అడిగాకే ప్రేమించారా నన్ను?

నర: నా సంగతి వేరు. వాడికీ నాకూ పోలి కేమిటి?

దుర్గాం: అవును ఏ పోలికా లేదు.

నర: వాడెవడో తెలియదు ఎవడికొడుకో తెలియదు ఏ వూరో తెలియదు. ఆఖరుకి గాడిదెకి ఒక సబ్‌యినస్పెక్టరు ఉద్యోగమయినా వస్తుందో రాదో తెలియదు.

దుర్గాం: అతనికి రావడానికి అవకాశమన్నా వుంది. నేను మిమ్మల్ని ప్రేమించేనాటికి మీకదీ లేదే?

నర: వాడి మొఖం చూస్తేనా ఆస్తి మాసి దానివెంబడిబడ్డవాడులా వుంది గాని ప్రేమించి నిర్వాకం చేసేవాడిలాగా లేదు.

దుర్గాం: డబ్బున్న తండ్రు లందరూ ఒకటేనల్లేవుంది.

నర: ఏం?

దుర్గా : సరిగ్గా మా నాన్న మిమ్మల్ని చూసి యిల్లాగే అన్నాడు.

నర : మరి నన్నెందుకు ప్రేమించావు నువ్వు?

దుర్గా : నేను స్వతంత్రమంటే, ప్రాణాలు విడిచేదాన్ని. మా నాన్నగారు మిమ్మల్ని పెళ్ళిచేసుకుంటానికి సుతరామూ వీలులేదన్నాడు. నేను సుతలామూ చేసుకోకతప్పదని చేసుకున్నాను.

నర : సరే! అదీ ఆ తల్లికూతు రనిపించుకుంటోంది...

దుర్గాం : ఆ తల్లిని చేసుకోబట్టే మన మీ మాత్రంగా వున్నాము. ఊరికే నోరు జారవిడవకండి.

నర : ఇదుగో దుర్గా...జీవిత మంతా నీ మాట చెల్లించాను. ఇష్టమయినా కష్టమయినా చెల్లించాను. ఈ ఒక్క విషయంలో నా యిష్టం చెల్లించు. ప్రసూన విషయంలో నాకితర ఆలోచనలున్నాయి.

దుర్గాం : ప్రసూన ఎవర్ని ప్రేమిస్తే వాణ్ణి చేసుకుంటుంది. దానికి మీ ఆలోచనలేమీ అక్కర్లేదు.

నర : అల్లా కాదు. దానికి యోగ్యుడయిన వరుణ్ణి చూసి పెళ్లిచేసేభారం నాది. నా యిష్టం లేకుండా ఏపనీ యికమీదట జరగడానికి వీలులేదు. ఇది నా ఆజ్ఞ.

దుర్గాం : మీఆజ్ఞలు లక్ష్మయ్య కియ్యండి. నాకూ దానికీగాదు. ప్రసూన ప్రేమించిన వాణ్ణి వివాహం చేసుకునేటట్లు చూసేభారం నాది. నా కిష్టంలేకుండా మీ రేపనీ చెయ్యలేరు. ఇది నా ఆజ్ఞ.

నర : సరే చూస్తాను.

దుర్గాం : సరే నేనూ చూస్తాను. (గబగబా నడిచిపోతుంది.)

నర : ఏం నడక ? ఈ నడకక్కు భ్రమపేయా స్థితికి వచ్చాను. లక్ష్మయ్యా...

లక్ష్మ : ఏం బాబూ...

నర : లక్ష్మయ్యా ... నువ్వు నా కెన్ని విషయాల్లోనో ఆలోచనలు చెప్పేవు !

లక్ష్మ : నౌకరీ ముండావాణ్ణి - నాఆలోచన లెందుకుబాబూ...

నర : లక్ష్మయ్యా...నువ్వు విద్యాసాగర్ను చూశావుకదూ...

లక్ష్మ : చూడకేం బాబూ..మీతో నేనూ వస్తినిగా.

నర : అమ్మాయిని, వెంబడేసుకుని తిరిగే వాణ్ణి చూశావుగా...

లక్ష్మ : ఇప్పుడే కారు దిగివచ్చాడు బాబూ, చూశాను.

నర : ఈ యిద్దరిలో ఎవరు ప్రసూనకు తగిన వరుడో చెప్పు.

లక్ష్మ : మనం తగినవాడనుకుంటే ఏం ప్రయోజనం బాబూ ... అమ్మాయిగారికి యిష్టం వుండవద్దూ ?

నర : దానికేం దెలుసును. ఆ ప్రసాద్ మొఖంచూస్తే నీకేమనితోస్తోంది లక్ష్మయ్యా.

లక్ష్మ : ఉట్టి సోదాపిల్లకాయలాగా వున్నాడు బాబూ...

నర : సరీగ్గా కనిపెట్టేవు. నా ప్రాణంపోయినా ప్రసూన వాణ్ణి చేసుకుంటానికి వీలులేదు.

లక్ష్మ : కేవలం మొగంమాసి అల్లా అనుకోగూడదు బాబూ అమ్మాయికూడా యీ తానులో ముక్కేగా. మీరు పంతం పడితే ఆమే పంతంబడుతుంది. పిలిచి నచ్చచెప్పండి.

నర : చెబితే అది వినదు, లక్ష్మయ్యా. విన్నా ఆ తల్లి విననీదు.

లక్ష్మ : అదీ నిజమే.

నర : లక్ష్మయ్యా...

లక్ష్మ : బాబూ...

నర : నేను పెద్దవాణ్ణయినాను.

లక్ష్మ : నాకన్నా నా బాబూ...

★ ఆజ్ఞ ★

నర : నీకు నాకున్న బాధ్యతలు బాధలుగా లేవు. అనేక మనోవ్యధలతో నా ఆరోగ్యం భగ్నమైపోయింది.

లక్ష్మ : మీ బాధలు నా బాధలే బాబూ కాకపోతే నేను బ్రహ్మచారిముండావాణ్ణి;

నర : కనకనే నీకు భార్యా బాధలేదు. అది సగం ఆరోగ్యానికీ ఆయుర్దాయానికీ కారణం.

లక్ష్మ : నిజమే బాబూ;

నర : లక్ష్మయ్యా, నేను బ్రతికివున్నా లేకపోయినా విద్యాసాగర్ని కనిపెట్టి వుండు. వాడే నా ఆస్తికీ నా కుమార్తెకూ కూడా కర్త, అది నా సంకల్పం.

లక్ష్మ : నీ మాట ఎప్పుడయినా జవదాటినా బాబూ; అమ్మాయిగారితో మాట్లాడకుండా ఏపనీ చెయ్యవద్దు. అదుగో అమ్మాయిగారు కూడా వస్తున్నట్లుంది. నచ్చచెప్పి చూడండి. నే నెళ్తాను.

నర : ప్రసూనా.

ప్రసూన : ఏం.

నర : ఇట్లా కూర్చో.

ప్రసూన : నేను పోవాలి నాన్నగారూ టైం అయింది.

నర : వాడితో నేనా ?

ప్రసూన : ఆయన...

నర : ప్రసూనా ; నేను నీకు తండ్రిని, నీకు తగిన వరుణ్ణి కుదిర్చే బాధ్యత నాది, నీకు అన్నివిధాలా విద్యాసాగర్ తగినవాడు. అతని......

ప్రసూన : ఓహో, ఇదా సంగతి, నాన్నగారూ ; నా ప్రాణం పోయినా ఆ పల్లెటూరి బడుద్ధాయిని నేను పెళ్ళి చేసుకోను.

నర : వాడు పల్లెటూరిబడుద్ధాయి కాదు. ఏనాడయినా ఒక జాతీయనాయకుడు కాగల సమర్థుడు.

ప్రసూన : కావాలంటే ఒక మంత్రేనా కానీండి, నా కిష్టంలేదు.

నర : నీయిష్టం ఏమిటి ? ఇది నా ఆజ్ఞ.

ప్రసూన : నీ ఆజ్ఞల్ని పాలించేది యీ విషయంలో కాదు. ఈ విషయంలో మా అమ్మ అంగీకారాన్ని పొందేను.

నర : మీ అమ్మ అంగీకారం పొందితే నా అంగీకారం అవసరం లేదనుకున్నావా? మీ యిద్దరు నా ఆజ్ఞ పాలించే విధం నాకు తెలుసును. పో, ఎల్లా నాఆజ్ఞ ధిక్కరిస్తావో చూస్తాను. అబ్బ; అబ్బ ? గుండెల్లోపోటు.

ప్రసూన : చిన్నవాళ్ళ వ్యవహారాల్లో అనవసరంగా జోక్యం కలిగించుకుంటే పోటు రాక యేం చేస్తుంది ?

నర : ప్రసూనా, ప్రసూనా; ఆగు, నేను చచ్చిపోతున్నాను, వెళ్ళిపోయింది. లక్ష్మయ్యా!

లక్ష్మ : ఏమయింది బాబూ!

నర : లక్ష్మయ్యా నాకు నెత్తురు పోటు వచ్చింది. అదుగో ఆ బీర్వాలో నా విల్లుంది. అది మన నకలు. క్రిష్ణస్వామి నాయుడుగారి దగ్గిర యిచ్చిరా. వెంటనే విద్యాసాగర్‌కు టెలిగ్రాం యివ్వు. డాక్టర్ని పిలిపించు. త్వరపడాలి.

లక్ష్మ : సరే బాబూ!

* * *

ప్రసూన : ప్రసాద్, అప్పుడే నిద్రా?

ప్రసాద్ : నువ్వొస్తావేమో సినీమా కెళ్ళాలని చూశాను. రాకపోతే పడుకున్నాను.

ప్రసూ : మా నాన్న వైఖరి బాగాలేదు. ఆయనకు కోపం వస్తే నాకు కానీ లేకుండా చేయ్యగలడు.

ప్రసా : చేస్తే ఏం చేస్తావు.

ప్రసూ : నాకు ఆస్తి ఎందుకు? పెద్ద ఆస్తి! నాకు నువ్వే పెద్ద ఆస్తి.

ప్రసా : నీ ప్రేమ చాలా గొప్పది. కాని ప్రసూనా నేను నిన్ను చాలా దారుణంగా ప్రేమిస్తున్నాను. నా ప్రేమలో స్వార్థమేమీ లేదు. కాని నీవు చాలా వైభవంలో పెరిగేవు. ధనం లేనిదే నీ జీవితం గడవదు. నిన్ను ఆర్థికంగా నేను నాశనం చెయ్యలేను. నువ్వు నాకోసం నాశనం కావద్దు. నా మాట విను.

ప్రసూ : ఆహా, ఏం స్వార్థ త్యాగం, డబ్బు లేకపోతే నువ్వు నా కక్కరలేదన్న రాదూ.

ప్రసా : అట్లా అపార్థం చేసుకొంటే నే నేం చెయ్యను'

ప్రసూ : అట్లా అయితే వివాహం చేసుకో. ఇద్దరం ఏ గుడిసెలోనయినా కాపరం చేద్దాం.

ప్రసా : పోనీ నాకు ఉద్యోగం వచ్చేదాకా నయినా ఆగు. -

ప్రసూ : నువ్వు జీవితాన్ని ఎదుర్కోలేని పిరికిపందవి ప్రసాద్. పోతున్నాను.

* * *

లక్ష్మయ్య : బాబూ! మీ అప్పగారూ, మీ అల్లుడుగారూ వచ్చారు.

మహా: హయ్యో ఏం తమ్ముడూ ఇల్లా అయిపోయినావేం - తమ్ముడూ!

నర: ఏడవకు అక్కయ్యా, నెత్తురు పోటుతో పక్షవాతం వచ్చింది. నాయనా, విద్యాసాగర్ యిట్లా కూర్చో. నీకు నేను ఉద్యోగమివ్వడానికి పిలిపించాను. ఎంత కష్టమయినా నష్టం అయినా నా ఆజ్ఞ చెల్లిస్తానని వాగ్దానం చెయ్యి.

విద్యా: అట్లాగే చేస్తా మామయ్యా.

నర: నీకు యికనీుదట అంగరక్షకుడు లక్ష్మయ్యా. ఏ కఠినపరిస్థితుల్లో నయినా అతన్ని సంప్రతించు. అక్కయ్యా, నువ్వు విద్యాసాగర్ వాగ్దానానికి సాక్షి.

మహా: వాడు ప్రాణం పోయినా మాట తప్పడు తమ్ముడూ.

నర: లక్ష్మయ్యా, బంధువులకు సత్కారాలు ఏర్పాటు చెయ్యి.

లక్ష్మ: రండి బాబూ.

దుర్గాం: ఏమిటండీ విద్యాసాగర్‌కు మీరిచ్చే వుద్యోగం?

నర: నా సర్వస్వానికీ హక్కుదారయ్యే వుద్యోగం. నా ఆస్తిని మూడుభాగాలుగా చేశాను. ఒకటి నీకు సర్వహక్కులతో. రెండవభాగం ప్రసూనకు......

దుర్గాం: మాతోటి ఆ త్యాగానికి, జానా?

నర: అయినా, అందరికీ. యీ ఆస్తి ప్రసూన విద్యాసాగర్ని పెళ్లి చేసుకుంటే నే. ఇందులో ఏ వొకరు అభ్యంతరం పెట్టినా, నా ఆస్తి అంతా యూనివర్సిటీకి రాసేశాను.

దుర్గాం: ఇది నా తండ్రియిచ్చిన ఆస్తి. మీ యబ్బసొమ్మని మీ మేనల్లుడికి రాస్తారా. మార్చండి ఆ విల్లు మార్చండి...

నర: మార్చను నేను చస్తే ఆ విల్లు మార్చను. నేను చచ్చికూడా నా ఆజ్ఞ నెరవేర్చేటట్లు చేస్తాను. ఇది నా ఆజ్ఞ, ఇది నా ఆజ్ఞ.

దుర్గాం: ఈ ఆస్థిఅంతా పోయినా నేను నా కూతుర్ని విద్యాసాగర్‌కు యివ్వను.

నర: మీ ప్రాణాలు ఇందుకు వొప్పుకోకపోతే విద్యాసాగరేవొప్పుకోడు. అందుకనే వాడిచేత ముందే వాగ్దానం తీసుకొన్నాను. అబ్బ! అబ్బ! అయ్యో.

దుర్గాం: అయ్యో, అయ్యో, పోయినా

(55-వ పేజీ చూడండి)



విజ్ఞానవీధులు

"డాక్టర్"



123. సాపేక్ష సిద్ధాంతమన నేమి?

అని ఖరుగొండనించి ఆరణి దశరథరామ రెడ్డిగారు అడిగేరు.

అసలే సాపేక్ష సిద్ధాంతము క్లిష్టము. పారిభాషిక పదావళీ, వాటికి మంచి ప్రచారమూ లేని తెలుగుభాషలో సాపేక్ష సిద్ధాంతాన్ని వివరించడము మొదలుపెడితే అది మరింత క్లిష్టము కావచ్చును. అయినా యత్నిస్తాను. పాఠకులు కొంచెము గమనికతో చదవండి.

గంట స్తంభపు గడియారములో సరిగ్గా పన్నెండుగంటలైన దనుకోండి. గంట స్తంభానికి కుడివైపునించి ఒకరూ ఎడమ వైపునించి ఒకరూ, సరిగ్గా ఎదరనించి ఒకరూ టైము ఎంతయిందో ఒకే క్షణము చూశారనుకోండి. చిన్న ముల్లుకీ పెద్ద ముల్లుకీ వున్న లావువల్ల, ఎడమ వైపోయనకు 12 దాటినట్లూ, కుడివైపోయనకు 12 ఇంకా కాలేనట్లూ, సరిగ్గా ముందున్నాయనకు 12 అయినట్లూ కనబడుతుంది. అంటే ఒకే క్షణము, ముగ్గురి గుర్తింపుకీ మూడు విధాలుగా కనబడిందన్నమాట. చిన్న ముల్లుకీ పెద్దముల్లుకీ గల లావువల్ల ఇలాగ కనబడిందని మనము సర్ది చెప్పుకుంటాము. అది న్యాయమే. అయితే ఇక్కడ ముగ్గురూ నిశ్చలంగావుండి ఒకే గడియారాన్ని చూశారు. వారు ముగ్గురూ తమ చేతి వాచీలను చూచివుండినట్లయితే వారి ముగ్గురి టైమూ ఒక్కటే కావాలి కదా? (వాచీలన్నీ నిర్దుష్టాలయితే) అవుతుంది కూడాను.

అయిన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంత మేమంటుందంటే, ఈ ముగ్గురూ ఒకరు ఏరోప్లేను లోనూ, ఇంకొకరు రైలులోనూ, మరి యొకరు నేలమీద బీచిఒడ్డునా ఉన్నారనుకుంటే, వారు ఒకే క్షణము తమ (కచ్చితమైన) వాచీలను చూస్తే, వారి ముగ్గురి టైములూ నేలమీదివాడి టైముతో సరిపోవనీ! బీచిమీద జరిగిన రెండు ఘటనలకున్న అంతరమును బీచిమీద కూర్చున్నవాడు 'గంట'అని గుర్తిస్తే, ఏరోప్లేను లోనివాడు ఆఘటనం అంతరాన్నే 'గంటకంటె జాస్తి' అని గుర్తిస్తాడు. ఏరోప్లేను వేగము ఎక్కువైనకొద్దీ ఈతని గుర్తింపు పొడుగౌతుంది. ఇది అతని వాచీ తప్పుకాదు. గమనమువల్ల కొలతలకు సంక్రమించే గుణము. ఈమాటల్నే శాస్త్రపరిభాషలో చెప్పాలంటే, "పలువురు ద్రష్టలు కొలిచిన (ఒకేచోట జరిగే) రెండు ఘటనల అంతరపు పరిమాణము సాపేక్షమే (అంటే వారి వారి స్థితి గతులను ఆపేక్షించివాటినిబట్టీ వుంటుంది) గాని నిరపేక్షము (వారి స్థితిగతులను అపేక్షించినదీ, అందరికీ ఒక్కటేనూ) కాదు" అనాలి.

అంతరము అంటే కాలపరిమాణము. పొడవు కొలతకి కూడా గమనమువల్ల మార్పు వస్తుంది. నేలమీద వాడి స్కేలుబద్దతో పోల్చితే ఏరోప్లేను లోవాడి స్కేలు కుంచించుకున్నట్టు గోచరిస్తుంది నేలమీద వాడికి. ఏరోప్లేను వేగము ఎక్కువైనకొద్దీ ఆస్కేలు కుంచించుకుని, ఏరోప్లేను వెల్తురుతో సమానమైన వేగముతో దాటితే ఆ స్కేలుకి పొడవే ఉండదు. ఈ విషయాన్ని "పలువురు ద్రష్టలపొడవు కొల్తలు సాపేక్షములే(గాని నిరపేక్షములు కావు.)" అంటారు శాస్త్రపరిభాషలో.

ఈరెండువిషయాల్నీ కలిపి "పొడవూ కాలముల కొలతలు సాపేక్షములే" అందాము. దీనికి ఇంకొకటి కలుపుతుంది సాపేక్షసిద్ధాంతము. అదిది: "ఏక సమకాలత కూడా సాపేక్షమే" అని. అంటే, ఒకనికి ఏకకాలములో జరిగినట్లు కనబడ్డ రెండుఘటనలు (వానితో గతిభేదమున్న) ఇంకొకరికి ఏకకాలములో జరిగినట్టు కనబడవు. అంటే "పొడవూ(*Space*) కాలము (*Time*) ఏకసమకాలత (*Simultaneity*) సాపేక్షములే" అనవలసివస్తుంది. సాపేక్ష సిద్ధాంతపు ఉద్ఘాటన యిదే.

అయితే అయిన్‌స్టీన్ సూత్రీకరించినది సరిగ్గా యిదికాదు. "గతిభేదమున్న రెండు మండలాలకు వర్తించే భౌతిక సూత్రములన్నీ ఒక్కటే" అని ఆయన సూత్రము. అయితే ఈ సూత్రము నాధారించుకుని సాగించిన గణితము వల్ల పైన చెప్పిన "అవకాశమూ, కాలమూ ఏక సమకాలతా సాపేక్షకములే" అన్న విచిత్ర ఫలితమే కాక, "ఏస్థితి గతులతో నున్న మండలము నుంచి కొలిచినా వెల్తురు వేగము సెకనుకు 18600 మైళ్ళు" అనీ, "గమనమువల్ల వస్తువుల ద్రవ్యరాశి హెచ్చున"నీ "ద్రవ్యమూ, శక్తీ ఒకే తత్వము యొక్క రెండు అవతా

రాల"నీ, "వెల్తురు యొక్క వేగాన్ని మించి ఏ వస్తువూ ప్రయాణించలేద"నీ తేలినది.

—మూర్తి.

124. స్టైన్ లెస్ స్టీల్ ఉక్కేనా?

స్టెయిన్ లెస్ స్టీల్ మామూలు ఉక్కు కాదు కాని ఎక్కువపాలు ఉక్కుగల ఇనుప మిశ్రలోహం (*Alloy*) దీనిలో నూటికి 74 పాళ్ళు ఉక్కు, 18 పాళ్ళు క్రోమియం, 8 పాళ్లు నికెల్ సాధారణంగా ఉంటాయి. ఈ లోహాలను విద్యుత్ కొలిమిలో (*Electric furnace*) కరిగించి స్టెయిన్ లెస్ స్టీల్‌ను తయారు చేస్తారు. 18-8 స్టీల్ అని కూడా దీనిని వ్యవహరించడం కలదు.

స్టెయిన్ లెస్ స్టీల్ యొక్క ముఖ్య లక్షణం మచ్చపడకపోవడం. వెండి గిన్నెలలోనూ, కంచాలలోను పులని వస్తువులను కొన్ని గంటలు నిలవుంచితే అవి కూడా కగ్గడం కలదు గాని స్టెయిన్ లెస్ స్టీల్ పాత్రలయితే మాత్రం ఆ విధంగా మచ్చపడవు. జర్మనీసిల్వర్ వస్తువులలాగ ఉప్పుకీ పులుపుకీ స్టెయిన్ లెస్ స్టీల్ పాత్రలు చిల్లులు పడవు, నిప్పులమీద పెట్టి వీటితో వేటినైనా కాచినా సరే, అవి పాడైపోవు. అందుచేత జాగ్రత్తగా వాడుకుంటే అవి చాలాకాలం మన్నుతా యనడానికి సందేహంలేదు. వాటి తలం చాలానున్నగా ఉంటుంది కాబట్టి జిడ్డు అంటుకోకుండా ఎక్కువ శుభ్రంగాకూడా అవి ఉంటాయి.

అయితే ఇనుముకు, మామూలు ఉక్కుకు లేని యీ విశిష్ట లక్షణాలు స్టెయిన్ లెస్ స్టీల్‌కు ఏవిధంగా వచ్చేయి?

ప్రతి లోహానికీ (*Metal*) కొన్ని లక్షణాలు సహజంగా ఉంటాయి. బంగారము, వెండి, ప్లాటినమ్ వంటి కొన్ని ఉత్తమ లోహాలు తప్ప సామాన్యంగా మిగిలిన లోహాలన్నీ గాలికి కగ్గిపోవడం, పులుపు తగిలితే కిల మెక్కడం......జరుగుతూంటుంది. ఈవిధంగా జరగడానికి కారణం ఆ లోహాలు గాలితోనో, పులుపు వస్తువులతోనో సంసర్గం పొందినపుడు ఆ వస్తువులతో అవి రసాయన చర్యకు లోనుగావడమే. అయితే ఈ చర్య ఫలితంగా ఏర్పడిన ద్రవ్యం - కొద్ది మొత్తంలోనైనా వాంఛనీయం కాకపోవచ్చు. మాటవరుసకు రాగిపాత్రలో పులుసును కలిపినపుడు ఏర్పడే కిలము డోకును పుట్టించే స్వభావం గలది. తెల్లగా తోమిన ఇనుప వస్తువులకు గాలి తగిలిన వెంటనే యేర్పడే నల్లని పదార్థము - అది ఒక యినుప ఆక్సైడ్ - అనారోగ్యకరమైంది కాకపోయినా, భోజన పదార్థాలకు నల్లగా అంటుకొని అసహ్యంగా ఉంటుంది. అందుచేత మంచినీటిని కాఫీవంటి పానీయాలను త్రాగడాని కుపయోగించే పాత్రలు, ఆహార పదార్థాలను తినడాని కుపయోగించే పళ్ళాలు, ఆహారాన్ని వండడానికి వాడే గిన్నెలు వాటిలో పోసిన, పెట్టిన పదార్థాలతో సంసర్గం పొందినపుడు హితవు కాని పదార్థాలు పుట్ట కూడదని మనం అభిలషిస్తాం. ఇటువంటి లక్షణాలుగల ద్రవ్యాలు శుద్ధమైన లోహాల వల్ల కాకుండా ఒక శుద్ధమైన లోహానికి ఒకటి రెండు ఇతర లోహాలను కొద్ది మొత్తాలలో కలుపగా వచ్చిన మిశ్రలోహాలవల్ల ఏర్పడతాయి. అట్టి మిశ్రలోహాలలో ఒకటి స్టెయిన్ లెస్ స్టీల్. స్టెయిన్ లెస్ స్టీల్ కనుగొనబడి చాలా కాలమేయైనా ఇటీవలనే అది యెక్కువ వాడుకలోనికి వచ్చింది.

—అనంత్.





సర్ప నృత్యం

చిత్రకారుడు: శీలం యతిరాజుగారు (గుంటూరు)

బొమ్మరిల్లు

పేచీ కోర్లు

రచన: భాస్కరం, ప్రభాకరం.

పిల్లిమీదా నల్లిమీదా
ఎలకమీదా చిలకమీదా
కుక్కమీదా నక్కమీదా
కుక్కుటంమీదా·
పెట్టుకొంటూ వొకరి నొకరు
తిట్టుకుంటూ తిమ్ముకుంటూ
దెప్పుకుంటూ ఎప్పుడూ సా
ధించుకుంటారు.
కళ్లతోటి నోరు తెరిచీ
కటిక చీకటి పడేవరకూ
ఏకటాకీ నోరుపెట్టుకు
కేకలేస్తారు.
మామిడమ్మా సోమిదమ్మా
మగుడ బిడ్డల మధ్యగాని
పచ్చగడ్డిని వేసియుంటే
భగ్గుమంటుంది.
మామిడమ్మా సోమిదమ్మా
మగళ్లిద్దరికీ 'మొగుళ్లు'!
మామిడయ్యా, సోమయాజులు
మందకొడి గాళ్లు.
"చెప్పు లోపలి రాయి లాగే
చెవులలో జోరీగలాగే
కంటి లోపలి నలుసులాగే
ఇంటిలో పోరు
ఇల్లు మారాలండి" అంటూ
వాళ్లు వెతుకుతు తిరిగి తిరిగి
మంచియింటిని వెతుక్కొచ్చాను
మామిడయ్యిపుడు!
'ఇల్లు కాస్తా మారిపోతే
గిల్లి కజ్జా పెట్టుకుందుకు
వల్ల కాదెల్లాగ' అంటూ
తల్లడిల్లిండి.
కట్టకడపటిసారి తనుగా
కదిపికయ్యం పెట్టుకుందుకు
సోమిదమ్మను పిలిచి అన్నది
మామిడమ్మదిన
"ఇలారా, సోమిద మొద్దిసా
ఇల్లు ఖాళీ చేసి పోతాం
మంచి పొరుగును పొందుతున్నా
మారిపోతున్నాం!"
తాడితన్నే మామిడమ్మను
తన్నగలిగిన సోమిదమ్మ
అక్కడే ఆ పేగులన్నీ
లెక్కపెట్టింది.
"అలాగా, మామిడ మొద్దిసా,
అవునుగానీ, మరో సంగతి,
పొరుగు మంచిది మాకుకూడా
దొరుకుతుందమ్మోవ్!"
ఖంగుమను ఈమాట విని ఖం
గారు పడ్డది మామిడమ్మ—
"మాకు లాగే మీరుకూడా
మారి పోతారా?"
"మేము మాత్రం ఇక్కడే వుం
టాము లే మామిడ మొద్దిసా
మీరు మాత్రం తప్పకుండా
మారిపోతారా?"

బొమ్మరిల్లు సీరియల్

అద్దె బోటులో-

ముచ్చటగా ముగ్గురు

(కుక్క సంగతి సరే సరి!)

3

మరునాటి సాయంకాలమే మేము ముగ్గురమూ మళ్లీ సమావేశమై, మా ప్రయాణాన్ని గూర్చిన చర్చలు ప్రారంభించాం.

"ఇప్పుడు మనతో కూడా ఏఏ సామాను పట్టుకు పోవాలి, ఎంతసామాను పట్టుకెళ్లాలీ అనేది ముందుగా తేల్చుకోవటం చాలా అవసరం" అన్నాడు హారిస్సు. "ఒరేయ్! జెరోమ్; నువ్వుపోయి ఒక కాగితమూ పెన్సలూ పట్టుకురారా. అరేయ్; జార్జి! నువ్వు ఆ కొట్టువాళ్లు పంచిపెట్టే కేటలాగు యిల్లా పట్టుకురా! మనకి ఏవేవి కావలసివస్తాయో అవన్నీ జాబితా తయారుచేసేస్తాను." అన్నాడు హారిస్సు, చొక్కా చేతులు పైకి మడుచుకొంటూ.

మా హారిస్సు అంటే ఏమిటి అనుకొన్నారు? వాడు ఎప్పుడూ యింతే. ప్రతివిషయంలోనూ కార్యభారాన్నంతటినీ అందరికంటే ముందు తన మీద వేసుకొన్నట్లే వేసుకొని, మళ్లీ అంతలో దాన్ని యితరుల నెత్తిమీదకి నెట్టేస్తాడు. వీణ్ణి చూసి నప్పుడల్లా నాకు మా 'పోడ్జర్' మామయ్య జ్ఞాపకం వస్తుంటాడు. ఆయనకూడా యింతే. మా మామయ్య పని అంటూ ఏదైనా ఒకటి తలబెట్టినప్పుడు, ఆ యింట్లో చెలరేగేటంత కోలాహలం, యీజన్మలో మీరు పృథ్విపై ఎక్కడా చూడబోరు. మాట వరసికి, వాళ్ళయింట్లో క్రొత్తగా ఫ్రేముకట్టించిన పటం ఒకటి యింకా గోడకి తగిలించకుండా నట్టింట్లో పడివున్నదనుకోండి. మా అత్తయ్యవచ్చి "యీ పటం ఏం చెయ్యమంటారు?"ని మామయ్యని అడుగుతుంది.

"ఆవిషయం నాకు ఒదిలెయ్! అంతా నేను చూసుకొంటాను. మీ కెవళ్ళకీ యీగొడవ అక్కర్లేదు." అంటాడు మామయ్య.

వెంటనే కూర్చున్న కుర్చీలోంచీ లేచిపోయి, గబగబా కోటు విప్పేసి, పని ప్రారంభం చేస్తాడు. కొట్టుమీదికిపోయి ఒక పావలా మేకులు పట్టుకురమ్మని చిన్నకూతురుని పంపిస్తాడు. ఏసైజుమేకులు కావాలో చెప్పటం మరచిపోయి, ఆవిషయం చెప్పటానికి దాని వెనకాలే యింకో కుర్రాణ్ణి తరుముతాడు.

ఇంకొక కుర్రాణ్ణిపిలిచి సుత్తి పట్టుకురమ్మంటాడు. మరొకాణ్ణి పిలిచి గజంబద్ద తెచ్చిపెట్టమంటాడు. మళ్ళీ వాణ్ణే వెనక్కిపిలిచి, ఒక నిచ్చెన, ఒక కుర్చీ, ఒకబల్లకూడా తీసుకొచ్చి అక్కడ పెట్టిపొమ్మని పురమాయిస్తాడు. ఇంతలో యింకేదో జ్ఞాపకంవచ్చి, పెద్దకొడుకుని పిలిచి, "ఒరేయ్! మన ప్రక్కింటి ఆసామీ దగ్గరకెళ్లి, ఆయన వొంట్లో ఎల్లావుందో నేను అడిగిరమ్మనానని చెప్పి, ఆయనదగ్గర 'లెవెల్స్'

మూలం :
జెరోమ్ కె. జెరోమ్

★

అనువాదం :
విశ్వాత్ముల నరసింహమూర్తి


★ ముచ్చటగా ముగ్గురు ★

సరిచూసే 'స్పిరిట్-రూల్' వుంటుందీ; దాన్ని తీసుకురా!" అంటాడు.

పెళ్లాన్ని చేరబిలిచి తాను యీవేళ గోడకి పటం తగిలించబోతున్నాడు కాబట్టి, ఆసమయంలో, ఎవరో ఒకరు లాంతరు ఎత్తిపట్టుకోవటం అవసరమౌతుందనీ, అంచేత ఆవిడ అవతలకీ యివతలకీ, ఎక్కడికీ పోకుండా అక్కడే ఆయనకి ఎదురుగా నేవుండవలసి వుంటుందని ఒక హెచ్చరిక పారేస్తాడు. ఈలోగా మేకులకోసం బజారుకెళ్లిన పిల్ల తిరిగివస్తుంది. ఈయనగారికి అప్పుడు జ్ఞాపకం వస్తుంది—పటానికి కట్టేతాడుకూడా అంగడినుంచీ తెమ్మని యిందాకనే చెప్పితే బాగుండేదని! ఆ పనికోసం దాన్ని మళ్లీ బజారుకి పంపించి, యింతసేపూ తన కళ్ల బడకుండా తప్పించుకు తిరుగుతున్న రెండోకొడుకుని కేకవేసి, తను కుర్చీమీదికి ఎక్కాక, ఆపటాన్ని తనచేతికి అందించమని వాడికి చెప్తాడు.

ఇంతమందికీ యిన్నిపనులూ చెప్పి, తాను నట్టింట్లో పడివున్న పటాన్ని పైకి ఎత్తబోయి, కిందపడేస్తాడు. చట్టానికి చట్రం విడిగానూ, బొమ్మకి బొమ్మ విడిగానూ వూడి వచ్చేస్తాయి. అద్దమైనా బద్దలైపోకుండా పట్టుకోబోయి, దాన్ని కాలిమీద పడేసుకొంటాడు. కాలి వేళ్లు కత్తిరించుకుపోయి, చిమ్మనగుట్టంలో నుంచి చిమ్మినట్లు, రక్తం ఆయన కాలివేళ్ళలోనుంచి చిమ్మి, గదిఅంతా నెత్తురువరదలైపోతుంది. తెగిన వేళ్ళకి కట్టు కట్టటందుకు జేబుగుడ్డకోసం వెదకటం ప్రారంభిస్తాడు అది కనిపించదు. ఎలా కనిపిస్తుందీ? తానిందాక విప్పిన కోటులో వుంది అది. ఆకోటువిప్పి ఎక్కడపెట్టాడో యిప్పుడు మరచిపోయాడు. అంతటితో ఆయిల్లు అనే అడవిలో యింటిల్లిపాదీ పడి, కోటుకోసం వేట మొదలుపెట్టుతారు. ఈయన మాత్రం తెగినకాలిని చేత్తోగట్టిగా పట్టుకొని యిల్లంతా నటరాజనృత్యం చేస్తూ, దెబ్బతిన్న బెబ్బులివలె గోండ్రిస్తూ వుంటాడు.

"కొంపలో యింతమంది జనాభా వున్నారు.



ఏం ప్రయోజనం?...ఛీ...ఛీ...యిలాంటి తిండిదండుగరాయుళ్లని ఎక్కడా చూడలేదు!...ఉండటానికి ఆరుగురు వున్నారు! ఒక్కరుకాదు; యిద్దరుకాదు; ఆరుగురు!—ఐదు నిమిషాలక్రితం నేనా కోటువిప్పి ఎక్కడపెట్టానో ఒక్కళ్లకీ జ్ఞాపకం వుండదు. ఒక్కడికంటికీ అది కనిపించదు. ఛా...ఛా!" అంటూ కేకలేస్తూనే కూర్చున్న కుర్చీలోంచి అదిరిపడి లేస్తాడు.

తీరాచూస్తే, ఆకోటు తను కూర్చున్న కుర్చీలోనే వుంటుంది. దానిమీదనే తాను యింతసేపూ కూర్చొని, యింటిల్లపాదికీ పేరుపేరునా శ్రాద్ధాలు పెట్టాడు.

"ఒరేయ్ చవటల్లారా! ఇంక మానెయ్యండి, మీదేవుళ్లాట. ఆకోటు నాకే కనిపించి ఏడిసిందితే. ఎబ్బెబ్బే! ఏమీ లాభంలేదు, మీతో. ఏపని అయినా మీకు చెప్పటం అంత బుద్ధితక్కువలేదు. అంతకంటే వీధిలోపోయే కుక్కని పిలిచి బ్రతిమిలా

డితేనైనా త్వరగా పనులు అవుతాయి!" అంటూ వాళ్ళమీదే విసుక్కుంటాడు.

అడ్డువస్తే ఎక్కడప్రాణాలు తీసేస్తాడోనని ఆయన పెళ్ళామూ పిల్లలూ నోరెత్తకుండా అన్ని చివాట్లూ పడతారు. అరగంటసేపు నానా అవస్థ పడి, ఆయనకాలికి కట్టు కట్టుతారు. ఒకడుపోయి కొత్త అద్దం కొనుక్కువచ్చి చట్రంలో బిగిస్తాడు. ఇంకొకడు నిచ్చెన, బల్ల, కుర్చీ లాంతరూ అన్నీ పట్టుకొస్తాడు. ఏనిమిషాన యీయనకి ఎవరితో అవసరం వస్తుందోనని ఆ ఇంట్లోవుండే పసిపిల్ల మొదలుకొని పనిమనిషిదాకా అందరూ అక్కడే యీయన చుట్టూ అర్ధవలయాకారంలో నిలబడి వుంటారు. ఈయనగారు అప్పుడు కూర్చున్నచోటినుంచీ, 'యిస్సో' 'అస్సో' అంటూ లేచి నిలబడతాడు. కుర్చీ కదలకుండా యిద్దరు పట్టుకోవాలి. మరొక యిద్దరు కలిసి యీయన్ని దానిమీదికి ఎక్కించాలి. మరొకడు యీయన చేతికి మేకు అందించాలి; ఇంకొకడు సుత్తి అందించాలి. అప్పుడు ఆయనగారు మేకుని అతి ప్రయాసతో అందుకొన్నట్లే అందుకొని, అంతలో క్రిందికి జారవిడిచేస్తాడు.

"ఐయింది. అనుకొన్నంతా అయింది. మాయదారిమేకు మటుమాయమైపోయింది." అంటూ ఆయన కుర్చీమీదనుంచి దిగకుండానే లబోదిబో మంటాడు.

మిగిలినవాళ్ళందరూ వెంటనే మోచేతుల మీదా, మోకాళ్ళమీదా తమవైపుకి పాకిపోయి, గదిలో అన్నిమూలలూ వెతుకుతూవుంటారు. ఆ ముదనష్టపు మేకు ఎంతకీ కనిపించదు. ఈలోగా ఆయనగారు "నన్ను యీకుర్చీమీద ఎంతసేపు నిలబడి చావమంటారురా!" అంటూ గడియకొకసారి పెద్దగా కేకలువేస్తుంటాడు.

ఎట్టకేలకు ఆమేకు ఎవరికంటనో పడుతుంది.

★ ముచ్చటగా ముగ్గురు ★



ఏదో ఆఫీసులో వుద్యోగం చేస్తున్న వనిత ఒకామె జనం కిక్కిరిసిన బస్సులోకి ఎక్కింది. ఎదురుగుండా సీటులో కూర్చొనివున్న గడ్డపాయన మూడుమాట్లు లేవబోతే, మూడుమాట్లూ ఆవిడ "అహాహా! అహాహా...మీరు లేవకండి. మేమేమీ అబలలం కాము. మేము కూడా మీ అందరు మొగాళ్లలాగే బస్సులో నిలబడి ప్రయాణం చెయ్యగలం" అంటూ ఆయన్ని లేవనీయకుండా అడ్డువచ్చింది.

బస్సు చురికొంత దూరం పోయాక, "అమ్మా! ఈ స్టాపింగ్‌లో నైనా నన్ను దిగనియ్యండి. ఇప్పటికప్పుడే నేను దిగాల్సిన స్టాపింగ్ దాటి, మూడు స్టాపింగ్‌లు వచ్చేశాను." అన్నాడు ఆ వ్యక్తి బ్రతిమాలుకుంటూ.

అందరి ప్రాణాలూ కొంచెం తెరిపిన పడతాయి. దాన్ని తీసి ఆయన చేతికి అందిస్తారు. కానీ ఆయనగారు యీ లోగా సుత్తి ఎక్కడ పెట్టాడో, అది కనిపించకుండా పోతుంది.

"ఏదిరా, సుత్తి ఏదీ? ఎక్కడ పెట్టానురా, ఆ దిక్కుమాలిన సుత్తి? కొంపలో పడి మేసేవాళ్లే కాని సుత్తి ఎక్కడ పెట్టానో ఒక్కడూ చెప్పిఏడవడు! ఎట్లా చచ్చేదిరా మీతో?" అంటూ మామయ్య గోల మళ్లీ మొదలు.

మిగిలిన వాళ్లంతా మళ్లీ నడుములు పడిపోయేటట్టు దానిమూల దీనిమూలా వెతికి చివరికెప్పటికో ఆ సుత్తిని పట్టుకొని పైకితీసి ఆయన చేతికి అందిస్తారు. తీరా మేకూ, సుత్తీ రెండూ చేతులోకి వచ్చాక, మా మామయ్య, యిందాక గోడమీద పెన్సిల్‌తో ఎక్కడ గుర్తుపెట్టాడో మరచిపోతాడు. ఆ పెన్సిల్ గుర్తు వెతకటంకోసం మిగిలిన ఆరుగురూ కూడా కుర్చీ మీదికే ఎగబాకుతారు. ఆ చుక్కకోసం అందరూ అన్నివైపులా వెతుకుతారు. తలకొకచోట ఒక చుక్క కనిపిస్తుంది. అందరూ ఒక్కసారే అరిచేస్తారు—"ఇదిగో చుక్క. ఇక్కడుంది!" అని. మా మామయ్యకు మరీ వొళ్లు మండుకుపోతుంది. అందరినీ కలిపి వుమ్మడిగా తిట్టి పోగులుపెట్టి, అందరినీ కుర్చీమీదనుంచి దిగి అవతల తగలబడమంటాడు. చేతిలోవున్న సుత్తీ, మేకూ దూరంగా గిరాటువేసి, స్కేలు తీసుకొని గోడమీద సరికొత్తగా కొలతలు మొదలుపెట్టుతాడు. ఆ లెక్కలేమిటో, ఆ గొడవ ఏమిటో కానీ—ఆయనికి $31\frac{3}{8}$ అంగుళాలలో సగం ఎంతో కావలసివస్తుంది. ఆ భాగహారం నోటిలెక్కగా చెయ్యబోయి, తికమక పడతాడు. ఎంతసేపటికీ ఆయనకు సరైన సమాధానం రాదు. మిగిలిన వాళ్ళందరినీ భాగహారం చేసి, సరిగ్గా ఎంతవస్తుందో చెప్పమంటాడు. నోటిలెక్కగా కొందరు, గాలిలో అంకెలు వేసి కొందరు ఆ లెక్క చేస్తారు. తలకొకరకమైన సమాధానం వస్తుంది. ఎవరికొచ్చిన ఆన్సరు వారే రైటనుకొని, రెండోవాడిని ఎద్దేవా చెయ్యబోతారు. ఈ గందరగోళం చూసి మామయ్యగారి వొళ్లు మళ్లీ భగభగా మండిపోతుంది. ఇంకోసారి ఛెడామడా తిట్టేస్తాడు. ఈ తిట్ల దుమారం తగ్గాక, తానే ఆ భాగహారం మళ్లీ చెయ్యబోతాడు కానీ, అసలు భాగించ

(40-వ పేజీ చూడండి)

ప్రోగ్రెస్ కార్డు

శ్రీ చిలుకూరి వీరరాఘవ శర్మ

(రంగము 1)

[ఇంట్లో చదువుకొనే గది. కుర్చీ, టేబిలు. పుస్తకాలు షెల్ఫు వగైరా; సత్యం పుస్తకాలు సర్దుతూ వుంటాడు)

సత్యం:- అమ్మయ్య! ఇవాళ ఒక్కరోజూ బళ్ళోకి వెళ్ళివస్తే, హాయిగా 15 రోజులు సెలవులు. ఈ క్రిస్‌మస్ ఎక్కడ గడిపేటట్లు?

(లోపలనుంచి కేక) అబ్బాయీ!

వస్తున్నానమ్మా! పుస్తకాలు తీసుకుంటున్నా!

(తల్లి ప్రవేశిస్తుంది) సత్యం ఏమమ్మా! నేనే వస్తుంటినిగా!

త:- ఏమీ లేదు. ఈరోజు సెలవులు చెప్తారన్నావు యింటికొచ్చాక భోజనం చేస్తూ. అందుకని...

స:- (సంతోషంగా) ఔనమ్మా! రేపటినుంచి మాకు 15 రోజులు సెలవులు. ఎన్నో చోట్లకు వెళ్ళాలని ఆలోచిస్తున్నా!

త:- సరేగానీ...............

స:- ఏమమ్మా! త్వరగా చెప్పు టైం కావస్తోంది.

త:- ఏమీ లేదు. స్కూలు నుంచి వచ్చేటప్పుడు అల్లా ఆఫీసుకి వెళ్ళి నాన్నగారిని కలిసి, మరీ రా, నాయనా! ఆమాట గుర్తుచేద్దామని.

స:- సరే! (స్ఫురణకు వచ్చినట్లు) ఓహో! అందుకా (విచారము)

త:- అవును. బాబూ! ఇల్లాంటి విషయాలలో వారికి పట్టుదలజాస్తి! ప్రతీ మామూలు సంగతికి కూడా చాలా జాగ్రత్తగా ఉండాలని వారి ఉద్దేశం. ఏమాత్రం పొరబాటూ క్షమించరు. నీకూ తెలుసుగా!

స:- (గంభీరంగా) తెలుసు, నాకూ తెలుస్తోంది, సరే నమ్మా, వస్తా. తలుపు వేసుకో.

త:- మరచిపోకు తప్పక నాన్నగారిని చూడు.

స:- (రోడ్డుమీదకు వస్తాడు) టరము, టరముకూ నాకీ బాధ తప్పదు. ఇదో చిత్రవధ. ఏ సబ్జక్టులో ఎన్ని మార్కులొచ్చేరో చూడటం. ఒక వుపన్యాసం. వారి కాలంలో ఎలా చదివేవారో వర్ణించడం, ఈ కాలంలో సరిగా చదవరనడం, మందలించడం, భరించలేకుండా వున్నాను. ఐనా తప్పదు. (వెళ్తాడు)

(రంగము 2)

(స్కూలుబైట, సత్యం కంగారుగా ప్రవేశం)

స:- నా పెన్ను ఎక్కడ పెట్టాను? ఎంత వెదకినా కనపడదే (లాగూ తడువుకొని) అరే! ఏదో సామెత చెప్పినట్లు...

రామారావు:- (ప్రవేశిస్తూ) ఏమోయ్ ఏమిటి సామెత అంటు న్నావు?

స:- ఏమీ లేదు. పెన్ను జేబులో వుంచుకొని, పోయిందని క్లాసంతా వెదికాను.

రా:- అల్లా వున్నావేం? కమ్మగా 15 రోజులు సెలవులువస్తే?

స:- సరేగాని నీకెన్నో ప్లేస్ వచ్చిందిరా?

రా:- ఆ అదెవడికి? ముప్పయి ఆరో ప్లేస్ వచ్చింది. ఏమయితేం? నా కంటె తొమ్మండుగురు దిగువ లేరూ! అదో తృప్తి.

స:- అందుకు కాదు. మీ నాన్న..

రా:- మా నాన్న కివేం పట్టవు. అస్తమానమూ వ్యాపారం. ఇక్కడ సంతకం పెట్టాలండీ అంటాను, పెట్టేస్తారు.

స:- నిజం! ఎంత అదృష్టంరా!

రా:- ఇదేమిటోయ్! ఇదో గొప్ప సంగతా. ఎవ్వరికో మీ నాన్నబోటి వాళ్ళకు తప్ప మిగ[illegible] వాళ్ల తల్లిదండ్రులకు ఈఅజే లే[illegible] వస్తా. ఈబండికి బెంగుళూరు ప్రయాణం. (గబ గబా వెళ్తాడు).

(రంగము 3)

(సత్యం నెమ్మదిగా వస్తాడు. చేతిలో ప్రోగ్రెస్ కార్డు)



ఏమిటో తిరగేద్దాం.....తమాషాగావుందే! నాన్నగారినికూడా...

★ ప్రోగ్రెస్ కార్డు ★

స:- ఏమిటి చెయ్యడం? క్రిందటి సారి పన్నెండో ప్లేస్ వస్తేనే కేకలు వేశారే ఇప్పుడు 25 ప్లేస్‌వచ్చింది. నాగతేం కావాలి! 36 ప్లేస్ వచ్చిన శ్యామం ఎంతో హుషారుగా తిరుగుతున్నాడు! (ఆఫీసు దగ్గరకు వచ్చాడు) అప్పల స్వామీ! నాన్నగారు పనిమీద ఉన్నారా? ఖాళీగా ఉన్నారా?

అప్ప : రండి చినబాబూగారూ! ఎవరూ లేరు అయ్యగారు పేపరు చూస్తున్నారల్లే ఉంది.

స:- (బిగ్గరగా) సరే (లోపల) కానీ, ఏం జరుగుతుందో! (లోపలికి వెళ్తాడు)

(రంగము 4) [ఆఫీసు గది.]

సత్యం (లోనికిపోయి తలెత్తి) ఎవరూ లేరే? నాన్నగారు పక్కగదిలోకి వెళ్ళినట్లున్నారు. వచ్చేదాక ఏం జెయ్యాలి? ఈఫైల్ ఏమిటో తిరగేద్దాం. ఏమిటో లెటరు (చదువుతూ) అరే! సర్ అని కూడ మొదలు పెట్టదేం! (చివర చదువుతూ) "ఇదేం కుదరదు. పని చురుకుగా జరగాలి. ఎప్పటికప్పుడు తెముల్చుకోవాలి-డైరెక్టరు" తమాషాగావుందే! నాన్నగారిని కూడా...

(శ్రీనివాసరావు, తువ్వాలుతో ముఖం తుడుచుకుంటూ) సత్యం! ఇప్పుడే వస్తాను (వెళ్తాడు)

స:- అరే! ఫైల్స్ తీశాను కేకలు వేస్తారేమో!

(శ్రీనివాసరావు వస్తారు గాలికి కాగితాలు ఎగిరివస్తే సర్దుతాడు)...

శ్రీ:- పరవాలేదు లే అల్లా ఉండనీయ్. ఎక్కడఉంటే ఏం వెధవ కాగితాలు! వీటన్నింటినీ లెక్కజేస్తూ కూర్చుంటే, చచ్చేపోతాము. సరేబయటకు పోదాము.

స:- (బయలుదేరుతూ) మాకు రేపటినుంచి సెలవులిచ్చారునాన్న.

శ్రీ:- అల్లాగా!

స:- నా ప్రోగ్రెస్‌కార్డు......

శ్రీ:- చూద్దాములే, ఉండనీయ్. ఆరిపోర్టులు అలానే ఉంటయ్, మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా.

స:- (ఆశ్చర్యపడ్తాడు)

శ్రీ:- ఈటరము అంతా శ్రమచేసిన నీవూ, రోజుఅంతా కష్టపడి పనిచేసిన నేనూ కొంచం విశ్రాంతి తీసుకోడం అవసరం. మినర్వాలో మంచి సినిమా ఉందిట. అల్లా వెళ్ళి వద్దాం ఇంటికి ఫోన్ చేస్తాను, కొంచెం ఆలస్యంగా వస్తామని. (వెళ్తాడు)

స:- నిజమా? కలా! (సంతోషంతో నిష్క్రమణ) ★

నేనెవర్ని?

పెద్ద కూతకూసి బండి బెజవాడ స్టేషన్‌లో ఆగింది. బండి ఆగకుండానే "కూలీ, కూలీ" అంటూ లైసెన్సు కూలీలు బండి వెంబడే పరుగెత్తుతున్నారు. స్టేషన్‌లో దిగేవారందరూ కంగారుగా మూటముల్లె సద్దుకుని ఒకళ్ళకన్నా ఒకళ్ళు ముందు దిగాలనే ఆదుర్దాలో అంతా గుమ్మం దగ్గరకి తోసుకొని వస్తున్నారు.

"అమ్మాయ్, చంటాణ్ణి ఎత్తుకున్నావా? ఇదిగో ఈ మరచెంబు కూడ తీసుకో" అంటూ ఓ ముసలావిడ తనకూతురికి మరచెంబు ఇస్తోంది. నేదిగవలసిన స్టేషన్ కూడ అదే. అందుకని బలవంతాన్ని, అయిష్టంగా నిద్ర లేవ్వాలసొచ్చింది. అసలు నాకు నిద్రపోతుంటే లేవాలని ఉండదు. కానీ ఏం చెయ్యను? ఆ ప్రయాణీకుల హడావుడి చూస్తుంటే నాకు నవ్వొచ్చింది. అది బెజవాడ స్టేషన్, అందుకని బండి అక్కడ చాలసేపు ఆగుతుంది. ఎందుకీ తొందర? దిగేవాళ్ళని దిగనియ్యకుండ కొంత మంది ఎక్కేస్తున్నారు. అదంతా చూస్తూ కాస్సేపు కూచున్నా. నిద్ర బద్ధకంగా ఉంది. కొంతసేపటికి చాల మంది దిగటం మూలాన్ని కొంత ఖాళీ అయింది. సరే ఇక దిగక పోతే బాగుండదని ఓకూలివాణ్ణి పిలిచి; పెట్టి, బెడ్డు, వాడికప్ప చెప్పి, ఓసారి గట్టిగా ఆవలించి, వళ్ళు విరుచుకొని బండిదిగి వాడి వెంట బయలుదేరా. వాడు నన్ను బ్రిడ్జిదాటించి రిక్షాలో నాపెట్టే, బెడ పెట్టి వాడిడబ్బులు తీసికొని తనదారిని తాను పోయాడు. రిక్షాలో కెక్కుతూ "సత్యనారాయణపురం పోనీయ్" అన్నా. వాడు

'బాల'

రంయ్‌ని సైకిలు త్రొక్కటం మొదలెట్టాడు.

నామనసులో ఏవో ఊహాలు దొర్లుతున్నాయి. "దొడ్డ వాళ్ళకి ఉత్తరమన్నా వ్రాయకుండ వెడుతున్నా. వాళ్ళు నన్ను చూచి ఆశ్చర్యపోతారు. అప్పుడే వాళ్ళని చూసి రెండేండ్లయింది. దొడ్డ చూడగానే ఆనవాలు పడుతుందో పట్టదో. ఊపిరి సలపకుండా ప్రశ్నల వర్షం కురిపిస్తుంది వాళ్ళ చెల్లెల్ని గురించి. వాటన్నిటికి సరిగా, జాగ్రత్తగా సమాధానం చెప్పాలి. బలేపని చేశాలే. ఉత్తరం వ్రాయకుండా యిలాగే వెళ్ళాలి. వ్రాస్తే ఏం గొప్ప. వస్తానని తెల్సి "వస్తాడు, వస్తాడు" అనుకుంటుంటారు. ఇలా హఠాత్తుగా వెడితే ఆశ్చర్యపోయి గుడ్లప్ప చెప్పి చూస్తారు. మొట్టమొదటి ప్రశ్న "ఉత్తరమన్నా వ్రాయకుండా వచ్చావేంరా?" అంటుంది" అని ఇంకా ఏమో అనుకుంటున్న నాకు "బాబూ ఏసందు" అన్న రిక్షా వాడి ప్రశ్నతో మెలుకువ వచ్చింది. ఏసందో గుర్తులేదు. ఎంత ఆలోచించినా జ్ఞాపకం రాలేదు. సరే "ఆసందులోంచి పోనీయ్" అని ఎదురుగానున్న సందు చూపించా. పాపం వాడు చాల మంచివాడు. నన్నా సందులోకి తీసి కెళ్ళాడు. ఆసందు కాదని ఇది, ఇది కాదని అది మొత్తం సత్యనారాయణపురం అంతా త్రిప్పించా. ఆఖరికి, ఓలావాటి తెల్లటి, పొడుగైన మనిషి కనిపిస్తే ఆయనకి మా అన్నయ్యా పేరుచెప్పి యిల్లు అడగి తెల్సుకుని ఓగంట ఆలస్యంగా యిల్లుచేరా.

అనుకున్నట్లుగా అంతా ఆశ్చర్య పడ్డారు. దొడ్డ ఆశ్చర్యంతో చూస్తూ కాస్సేపు నిలబడిపోయింది. ఆఖరికి తేరుకుని "ఎక్కడనుంచిరా రాకటం" అడిగింది. నే నవ్వుతూ "రాజ

గోపీ ఎవరు?

మండ్రీ నుంచే" అన్నా. అన్నయ్య అనేక ప్రశ్నలడిగాడు. అన్నింటికి జవాబులిచ్చా. తరవాత దొడ్డ కాస్సేపటికి కాఫీయిచ్చి "స్నానం చెయ్యరా" అంది. 'సరే'నని స్నానం చేసి అన్నయ్యతో ఆకబురూ, ఈకబురూ చెప్తూ కూర్చున్నా. ఇంతలో అన్నయ్యకి ఆఫీసుకి టైం అయింది. వాడాఫీసుకు వెళ్ళిపోయాడు. నేను దొడ్డా కాస్సేపు మాట్లాడుకున్నాం. "రా బాబూ అన్నానికి" అని దొడ్డ అన్న వడ్డించింది. వెళ్ళి కంచం ముందు కూర్చున్నా, దొడ్డ ఏవో ప్రశ్నలడుగుతోంది. అన్నింటికి అతి జాగ్రత్తగా సమాధానం యిస్తున్నా.

ఇంతలో "గోపీ గోపీ," అని పిలుపు మేడ మీంచి వినిపించింది. అది స్త్రీ కంఠస్వరం. నా చెవులు అటువేపు పరుగెత్తాయి. ఎవరా గోపీ? అనుకొని నాల్గు ప్రక్కలా ఓసారి కలయచూచా. ఊహు ఎవరూ కనబడలేదు. దొడ్డ నడుగుదామనుకుని, ఏమనుకుంటుందో అని ఊరుకున్నా. "ఓరే మా చెల్లాయి ఎప్పుడన్నా నన్ను తల్చుకుంటుందా?" అని అడుగుతుంటే "ఆఁ" అని ముఖావంగా సమాధానం చెప్పి భోజనం ముగించా. హాయిగా మంచంపై మేనువాల్చా. దొడ్డ కూడ పని ముగించుకొని చాపవేసుకొని పడుకొంది. నేనూ కన్ను మూసా. రాత్రంతా ప్రయాణం చేసిన మూలాన్ని సుఖంగా నిద్ర పట్టింది.

నిద్ర లేచేసరికి నాల్గయింది. కాఫీ త్రాగుతుండగా మళ్ళీ "గోపీ, గోపీ" అన్న కేక వినబడింది. కిటికీలోంచి చూశా. మేడమీంచి ఓ ఇరవై ఏళ్ళ అమ్మాయి పిలుస్తోంది. "గోపీ అంటే ఆవిడ తమ్ముడేమో" అనుకున్నా, ఆ గోపీ



మళ్ళీ "గోపీ గోపీ" అన్న కేక వినబడింది... మేడమీంచి ఓ ఇరవై ఏళ్ళ అమ్మాయి పిలుస్తోంది.

ఓమాటు కనుపిస్తే బాగుండు ననుకున్నా. కానీ గోపీ కన్పించలేదు. ఓసారి ఊర్లో కెళ్ళి ఓగంట తిరిగి యింటి కొచ్చేసరికి అన్నయ్య వచ్చాడు. సరే, ఇంకేం అన్నయ్య నేనూ కలిసి మళ్ళీ ఊరంతా తిరిగి, రెండుఆట సినిమా చూచుకొని మెల్లగా యింటికి చేరాం. దొడ్డ మమ్మల్ని చూచి "ఇదేమిట్రా యిల్లు మర్చిపోయారా" అంటూ ఆశ్చర్యం వెలి బుచ్చింది. "లేదు దొడ్డా, సినీమాకి వెళ్ళాం" అని చెప్పి, అన్నం తినమంటే, ఆకలి లేదని మంచంపై పడుకొని నిద్రపోయాం.

తెల్లవారింది. మంచంపై కళ్ళు తెరచి పడుకునే ఉన్నా-ఇంతలో "అరే, గోపీ, ఇక్కడున్నావా?" అన్న మాటలు. వినిపించాయి. మళ్ళీ అదేగొంతు. 'తెల్లారి లేచింది మొదలు ఈవిడకి గోపీ నామస్మరణతోనే గడిచే లాగుంది. ఈవిడకి తమ్ముడంటే ఎంత ప్రేమ' అనుకుంటూ దంతధావన కార్యక్రమం సక్రమంగా కావించా. ఆవేళ మధ్యాహ్నం దొడ్డ మాటల సందర్భంలో అంది "ఈ ఇంటాయనకి ఒక్కర్తే కూతుర"ని. ఇంకా వివరా లడుగుదాం అనుకుంటుండగానే దొడ్డ సంభాషణ మారిపోయింది. ఇక నా మెదడుకి పని తగిలింది. "ఇంటాయనకి ఒక్కర్తే కూతురయితే ఆమెకి తమ్ముళ్ళెక్కణ్ణుంచి వస్తారు? గోపీ ఒకవేళ ఈమె కొడుకేమో? అవును. అది సమంజసంగానే ఉంటుంది." అని యింకా ఏవేవో ఆలోచించుకొని, ఆఖరికి గోపీ ఈమె కొడుకనే నిర్ధారణ చేసేసుకున్నా. ఆ గోపీ కనిపిస్తే చూడాలని ఉంది.

అవేళ ఇంకేమాటలు వినిపించలేదు. మర్నాడు ఆ అమ్మాయి "గోపీకి కొంచం పచ్చగడ్డి తేరా, నాగాయ్" అని నాగాయ్ తో చెప్పున్న మాటలు వినేసరికి నాగుండె ఆగినంత పనయింది. గోపీ మనిషి కదా గడ్డెందుకు? గోపీ నిజంగా ఆవిడ కొడుకయితే గడ్డెందుకు? తమ్ముడేమొ? తమ్ముడయితే మాత్రం గడ్డి తింటాడా? అదికాదు, ఆతమ్ముడు ఓ పెంకి ఘటం అవొచ్చు, వాడ్ని చదువుకోమంటే, చదువుకొని ఉండడు. అందుకని వాడిని ఏడిపించటానికి తమాషా కంటున్నదేమో. కాని దొడ్డ "ఈ ఇంటాయనకి ఒక్కర్తే కూతురు" అందిగా. అటువంటప్పుడు తమ్ము డెక్కడ్నుంచి వస్తాడు? కొడుకేమో. వాడొకవేళ అల్లరిచేస్తున్నాడేమొ. వాణ్ణి భయపెట్టటానికి "గడ్డి తినిపిస్తానుందు వెధవా?"అని అలాపిలుస్తోందేమో. దొడ్డ ఒక్కర్తే కూతురంది గాని, ఇంతమంది కొడుకులని చెప్పలేదుగా. అయితే తమ్ముడేమో. ఇంతకీ "గోపీ," అన్నది ఆడపిల్ల కాదుగదా. అబ్బే, పేరు మగవాళ్ళ పేరులాగుంది. అయినా ఇప్పటి పేర్లన్నీ అలాగే ఉంటున్నాయిలే. పేర్లని బట్టి మగా, ఆడా, నిర్ణయించలేం. గోపీ, పశువుపేరు కాదు కదా? ఇంతకీ ఈగోపీ ఎవరో?

ఆవేళ రాత్రి అసలు నిద్ర పట్టలేదు. నేను వాళ్ళింట్లో కాలు పెట్టిన దగ్గర్నుంచి ఈగోపీ పేరు ఎన్నిసార్లు విన్నానో లెక్కలేదు. ఆ ముఖ మెరుగని గోపీపై నాకు ప్రేమ కలగటంలో నాకెంతో ఆశ్చర్యంగా ఉంది. ఆగోపీని చూడాలని పట్టుదలగా ఉంది. ఇంతకీ ఈగోపీ ఎవరు? మనిషవునో కాదో తెలియని గోపీ, స్త్రీయో పురుషుడో తెలియని గోపీ, కొడుకో తమ్ముడో తెలియని గోపీపై నాప్రేమ కట్టలు తెంచుకున్న నదీ ప్రవాహంలా గుంది. ఎడతెగని ఆలోచనలతో బుర్ర పాడయి పోతోందే కాని గోపీ ఎవరు?-అన్న సమస్య తెగలేదు.

ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు కళ్లు తెరిచేసరికి తెల్లగా వెలుగొచ్చింది. "గోపీ, అరేయ్, ఇటు" అన్న మాటలు వినిపించాయి! గమ్మని మంచంపై లేచి కూర్చుని చూశా. ఏం చెప్పను? ఆ అమ్మాయి ఓ ఆవుదూడని ముద్దాడుతోంది. అదే గోపీ, నా ఆశ్చర్యానికి అంతులేదు. ఈరెండు రోజుల్నుంచి ఏగోపీ కోసం తపిస్తున్నానో ఆగోపీ ఓ ఆవుదూడ. గోపీ ఆవుదూడ అనే విషయం తెలియగానే ఒక్కసారి నవ్వొచ్చింది. ఫక్కున నవ్వా. ఆ అమ్మాయి ఏమనుకుందో తిరిగి చూడకుండా యింట్లో కెళ్ళిపోయింది. ★

★ ముచ్చటగా ముగ్గురు ★

(34-పేజీ తరువాయి)

వలసిన అంకె ఎంతో అప్పటికి మరిచిపోతాడు. మళ్లీ గందరగోళం!

ఇక యిల్లా లాభంలేదని, మామయ్య మళ్లీ కొలతలు ప్రారంభిస్తాడు. ఈసారి యిందాకటిలా స్కేలుతో కాకుండా దారంతో కొలవబోతాడు. ఆకొలవటంలో కుర్చీమీద నిల్చున్న మనిషి అంత కంతకు అటువైపుకి వొంగిపోయి, అక్కడితో ఆగకుండా యింకా అవతలగా ఎక్కడో దూరంగావున్న బోటుని అందుకోబోయి, చేతులోవున్న దారాన్ని వదిలేస్తాడు. ఆదారాన్ని పట్టుకోబోయి, తానే దభేలున పడిపోతాడు. ఆపడిపోవటం కూడా కిందఎక్కడో కాకుండా అక్కడవున్న పియానో మెట్లమీద పడతాడు. ఈయనగారి పాటు మూలంగా పియానో మెట్లు అన్నీ ఏకకాలంలో నొక్కుకుపోయి, అతి విచిత్రమైన ధ్వనులేవో అందులో నుంచి పుట్టుకు వస్తాయి.

మాఅత్తయ్య ఎంతకైనా కొంత జాగ్రత్తగల మనిషి. అల్లాంటి సందర్భాలలో మా మామయ్య మహారాజు నోటివెంట ఎటువంటి బూతుల పంచాంగం బయటపడుతుందో ఆవిడకి తెలుసు. అందుకని అటువంటి పాడుమాటలన్నీ విని, తనపిల్లలు ఎక్కడ పాడైపోతారోనని, ముందగానే జాగర్తపడి, వాళ్లందరినీ అక్కడనుంచీ అవతలకి పంపిం చేస్తుంటుంది.

ఆతరువాత ఎప్పటికో మా మామయ్య నానా యాతనలు పడి, గోడమీద మేకు కొట్టవలసిన చోటు ఏదో సరిక్రొత్తగా లెక్కలన్నీ కట్టి, పెన్సిల్‌తో ఒక చోట గుర్తుపెట్టాడు. ఆగుర్తుపెట్టినచోట ఎడమచేతిలో వున్న మేకుమొన ఆనించి, కుడిచెత్తో సుత్తి పైకిఎత్తి బలంగా దానిమీద కొట్టబోయి, తనచేతి బొటనవేలు చితక కొట్టుకొంటాడు. దెబ్బ తగిలేసరికి చేతిలోవున్న సుత్తి అమాంతం వదిలేస్తాడు: అదివచ్చి ప్రక్కన నిలబడివున్న ఎవరి కాళ్లమీదనో పడుతుంది. బొటనవేలు చితక్కొంటు కొని యీాయనా, కాలివేళ్లు పప్పుపప్పు అయిన యింకొకడూ యిద్దరూ, ఎవరి కంఠ స్వరం ఏదో తెలుసుకోటానికి వీలులేనంతగా కేకలు, ఏడుపులు మొదలు పెట్టేస్తారు.

ఈగందరగోళంలో ఎలాగో సందు చూసుకొని, మాఅత్తయ్య "మీరు యీసారి మళ్లీ గోడ మీద మేకు కొట్టబోయేటప్పుడు నాతో కొంచెం ముందుగా చెప్పండి. ఆ నాలుగురోజులూ మా పుట్టింటికైనా పోతాను. ఈపీడ నేను పడలేను బాబూ" అంటూ సణుగుతుంటుంది:

అప్పటికి మా మామయ్య, కొంచెం తేరుకొని యీ విడగారి సణుగుడువిని, "ఆడజాతి అంతా యింతే! ప్రతి చిన్నవిషయానికీ పెద్దరాద్ధాంతం చేసేస్తారు. ఇంతకీ నేను యీ కొంపలో ఏదో కాస్త పనిచేసిపెట్టుదా మనుకోవటమే తప్పు కాబోలు!" అంటూ అదొక రకమైన విరక్తి భావంతో అటువైపు తిరిగి మేకుమీద సుత్తితో గట్టిగా ఒకదెబ్బ వేస్తాడు. ఆదెబ్బకి మేకుమేకు అంతా గోడలోకి దూసుకుపోవటమే కాకుండా, సుత్తిలో సగానికిపైగా గోడలోకి దిగబడిపోతంది. ఆ ప్రమాదం అంతటితో ఆగినా బాగుండును. దెబ్బవేసిన విసురుకి ఆయనముఖం పోయి గోడకి రకీమని కొట్టుకొంటుంది. ముక్కు చదును చేసినట్లు సాఫీగా తయారౌతుంది. దాంతో మళ్లీ కొలుపు ప్రారంభం.

తరువాత కొంతసేపు గడిచాక మా మామయ్య సుత్తి, మేకు, దారం, స్కేలు అన్నీ తీసుకొని మళ్ళీ మొదటినుంచీ కొలతలన్నీ కొలచి, గోడలో మేకు దిగగొట్టుతాడు. మొత్తానికి అర్ధరాత్రి అయ్యేసరికి పటం గోడమీదికి ఎక్కుతుంది. కాని ఆగోడకేసి చూస్తే మాత్రం, యిక్కడ ఎవరో పిస్తోళ్లతో పోట్లాడుకొన్నారు కాబోలు ననిపిస్తుంది. మామయ్య మొఖంతప్ప, మగిలిన అందరిమొఖాలు అలసట మూలంగా పీక్కుపోయి వుంటాయి.

రణరంగం నుంచి విజయగర్వంతో తిరిగివచ్చే యోధుడిలా మా మామయ్య కుర్చీమీది నుంచీ దిగివస్తూ, "ఏమిటో! ప్రతివాడూ యింత చిన్నపని కూడా కూలి వాళ్లకే అప్పగిస్తాడు!" అంటాడు; అక్కడికి

పురుషజాతి కంతటికీ తానొక్కడే ప్రయోజకుడైనట్లు.

మా హారిస్సుదికూడా సరిగ్గా యిదే తత్వం. ఆమాటే వాడితో చెప్పాను—'అలాటితత్వం కల వాడివి కనుక, నువ్వు అంతటి కార్యభారాన్ని పైన వేసుకోవటం మంచిది కాద'ని: వాడినేపోయి ఆకాగితమూ, పెన్సలూ కేటలాగు తీసుకురమ్మన్నాను. జార్జి జాబితా వ్రాస్తాడు: మిగిలినపని అంతా నేను చేస్తానన్నాను.

ముగ్గురమూ చేరి ముందు ఒకజాబితా తయారు చేశాం. కానీ ఆజాబితా ప్రకారం అన్నివస్తువులూ మేముగనుక మాతోపాటు పడవలో వేసుకుపోవటం అంటూ సంభవిస్తే మాత్రం, అంత పెద్ద పడవ పట్టటం కోసం ముందుగా నదిగట్టు కోయించి వెడల్పు చేయటం చాలా అవసరమవుతుంది. అది మా అందుబాటులో వుండే పనికాదు కాబట్టి, మాచేతిలోవున్న జాబితా చించి పోగులుపెట్టి ఒకళ్ల మొఖం ఒకళ్లం చూసుకొంటూ కాస్సేపు కూర్చున్నాం.

ఉన్నట్లుండి జార్జి బుర్రలో ఏదో ఆలోచన తళుక్కున మెరిసింది. "జాబితా వ్రాయటానికి యిది కాదురా, పద్ధతి. ఈప్రయాణంలో మనతో కూడా ఏవేవి పట్టుకుపోతే బాగుంటుందోఅని ఆలోచించకండి. ఏవేవి లేకపోతే మనకి అక్కడ గడవదో వాటిని గురించి మాత్రమే యోచించండి" అన్నాడు.

ఒకొక్కప్పుడు జార్జికి అద్భుతమైన తెలివి తేటలు పుట్టుకొస్తుంటాయి. అల్లాంటి సమయాల్లో వాణ్ణిచూస్తే నాకు చాలా ఆశ్చర్యం వేస్తుంది. ఇప్పుడు వాడు అన్న ఆమాట చూడండి;—అందులో ఎంత అర్ధంవుందో! వాడుఅన్న ఆవాక్యాలు మా ప్రస్తుతపు పడవ ప్రయాణానికి మాత్రమే కాక, మన అందరి జీవితాలకి కూడా చక్కని హెచ్చరిక సుమండీ! జీవించటానికి ఏది ముఖ్యమో, ఏదికాదో తెలుసుకోలేక ఎంతమంది తమ జీవిత నౌకలని అర్ధం పర్ధంలేని అనేక రకాలైన అనుభవాలతోను, ఆదర్శాలతోనూ, పరిచయాలతోనూ పట్టుదలతోనూ నింపి, చివరికి ఆనౌకల్ని నట్టేటిపాలు చేస్తూ వుంటారో!

వాడు అంత మంచి ఆలోచనచెప్పి, తనది ఎంతకైనా గట్టిబుర్ర అని ఋజువు చేసుకొన్నాడు. కాబట్టి, జాబితా వ్రాసే పని ఆజార్జికే అప్పగించాం.

"ఒరేయ్; మనం డేరా పట్టుకుపోవటం మానేసి, పైన కప్పుతగిలించటానికి వీలుగావుండే బోటునే అద్దెకు తీసుకొందాం. సగం బరువూ తగ్గుతుంది; ప్రాణం హాయిగానూ వుంటుంది" అన్నాడు జార్జి.

ఇదీ మంచియోచనే! హారిస్సూ, నేనూ వెంటనే ఒప్పేసుకొన్నాం. మేము అద్దెకు తీసుకోబోయే బోటు ఎల్లా వుంటుందో మీకు తెలుసో, తెలియదో! మామూలుగా పడవ వుంటుందా?—దానికే అన్నివైపులా యినప కొక్కేలు తగిలించేసి, ఆకొక్కేలకి కాన్వాస్ బిగించేస్తే, పడవ యీ చివరి నుంచి ఆచివరదాకా కప్పడిపోయి, అదంతా కలిసి చక్కగా ఓ చిన్నయిల్లులా తయారౌతుంది. అందులో పడుకోవటానికి ఎంతో హాయిగా వుంటుంది. కాకపోతే వూపిరి ఆడటం మాత్రం కష్టమే ననుకోండి. ఆమాట కొస్తే—ఆమాత్రం లోపం ప్రతిదాంట్లోనూ వుంటుంది. జీవితంలో ఏలోపమూలేని అనుభం అంటూ ఏదీ వుండనే వుండదు!


జార్జి జాబితా రాసేస్తున్నాడు. ఉమ్మడిగా వాడుకొనే ఒప్పందంమీద, ఒక లాంతరు, ఒక, సబ్బు, ఒక దువ్వెన, ఒకబ్రష్ సరిపోతాయన్నాడు. ఎవరికి వాళ్లుగా వాడుకోవటానికి తలొక రగ్గు, టూత్ బ్రష్, బేసిన్, పళ్లపొడి, క్షౌరపు సామాన్లు, రెండేసి పెద్ద పెద్ద తువ్వాళ్లు తెచ్చుకోమన్నాడు. తువాళ్లమాట వచ్చేసరికి నాకొకటి అనిపిస్తుంది:—ఏదైనా వాగుదగ్గిరకు పోతున్నా మనగానే యీ మనుష్యులంతా, అదేమిటో, ఏటి స్నానాలను గురించి అతి ఆర్భాటంగా ఆలోచిస్తారు. తీరా అక్కడికి వెళ్లాక పట్టుమని మూడు నిమిషాలైనా నీళ్లల్లో వుండకుండా ఒడ్డుకు వచ్చేస్తుంటారు.

సముద్రస్నానం అయితే యిక చెప్పనే అక్కరలేదు. నాకు బస్తీలోవున్నంతసేపూ ప్రతిరోజూ పుదయాన్నేపోయి చక్కగా సముద్ర స్నానం చేసి వద్దామనిపిస్తుంది. అందుకోసం ఒకటి రెండు పొట్టి లాగులు కూడా కొని అట్టే పెట్టుకొంటాను. కానీ తీరా ఆసమయం వచ్చేసరికి ఎందుకనో నాకు అసలు స్నానం చెయ్యటంలోనే నమ్మకం పోతుంది. ఏరోజుకారోజు ఈస్నానాల గొడవ అంతటితో వదిలేసి

★ ముచ్చటగా ముగ్గురు ★

నక్కమీదనే మరికొంతసేపు పడి దొర్లదాముని
వస్తుంది.

అక్కడికీ ఒకటి రెండుసార్లు వుదయాన్నే ఆరు గంటలకల్లా లేచి సముద్రస్నానానికి వెళ్లటం జరిగింది. తీరా సముద్రపు టొడ్డుకు చేరేసరికి, అదేమిటో— రామీద కక్షిగట్టిన కొందరు కూడబలుక్కొని ప్రత్యేకంగా పనిగట్టుకొని అక్కడి చలిగాలి మరింత జోరుగా వీచేటట్లు చేశారేమోననే అనుమానం కగులుతుంది. అంతే కాదు—వీళ్లు, దారిపొడుగునా మొనలు తేలిన రాళ్లనుతెచ్చి పేర్చి, అవి నాకంట పడకుండా పైన యింత యిసక కప్పి పెట్టారు కాబోలు ననిపిస్తుంది. వాళ్లందరూ చేరి, నేను సముద్రపు టొడ్డుకి చేరేలోగా, ఆసముద్రాన్నే మామూలుగా వున్నచోట వుండనీయకుండా, మరొక రెండుమైళ్లు దూరంగా పట్టుకుపోయి అక్కడ పెట్టారేమో అనుకొంటాను. ఈయాతనలన్నీ పడి కూడా చివరికెల్లాగో గుండె చిక్కపట్టుకొని సముద్రంలోకి దిగుతాను. దిగీ దిగక ముందే పెద్ద తాడిచెట్టంత ఎత్తు కెరటం ఒకటి మహా విసురుగా వచ్చి, చలికిలబడి పోయిన నా నెత్తిమీద విరుచుకుపడుతుంది. అక్కడ ఏ దరిద్రుడో నాతల బద్దలుకావటం కోసమే పెద్ద బండరాతి నొకదాన్ని తెచ్చిపెట్టి వుంటాడు. ఆరాతికి కొట్టుకొని తల బద్దలైపోకుండా ఎలాగో తప్పించుకొని కాస్త వూపిరి పీల్చుకోబోతుండగా, యింకో పెద్ద కెరటంవచ్చి నన్ను అమాంతం నట్టనడి సముద్రంలోకి యీడ్చుకుపోతుంది. మళ్లీ ఎప్పటికైనా నా చిరకాల మిత్రులనీ, బంధువులనీ యీకళ్లతో చూడగలనా అని మనస్సులో ఒక్కసారిగా దిగులు పుట్టుకొస్తుంది. బలవంతపు చావు రాబోతున్నదని నామనస్సుకు తోచగానే, చిన్ననాటి నుంచీ నేటివరకు నేను ఎవరెవరిపట్ల అసహ్యంగా ప్రవర్తించానో అవన్నీ ఒక్కసారిగా జ్ఞాపకం వస్తాయి: వాళ్లందరినీ క్షమించమని గట్టిగా మనస్సులోనే వేడుకొంటాను. నాచిట్టి చెల్లెలిని చిన్నప్పుడు తెగ కొట్టేవాణ్ణి. ఆవిషయం జ్ఞాపకంవచ్చి చాలా బాధపడుతాను. పాపం—దాన్ని అంతకంటే కొంచెం బాగా చూసివుంటే బాగుండును కదా అని నాలో నేను కుమిలిపోతాను. ఒడ్డుకి ఎల్లాగైనా సరే చేరుకోవాలనే



వెర్రి ఆవేశంతో కాళ్లు చేతులూ కొట్టుకొని యీదబోతాను. ఆప్రయత్నంలోకూడా సొంతం అలసిపోయి, యిక ఆశ వొదిలేసుకొందామనుకొంటూ వుండగా, కెరటం తగ్గిపోయి, యింతసేపూ నేను మోకాలిలోతు నీళ్లలోనే కొట్టుకొంటూ వున్నట్లు తేలిపోతుంది. బ్రతుకు జీవుడా అని ఒక్కగంతులో యివతలికి పడి, వెనక్కి అయినా తిరిగి చూడకుండా కొంపకిచేరి పోతాను.

ప్రస్తుత సందర్భంలో మేము ముగ్గురమూ ప్రతి వుదయమూ ఒకగంటా గంటన్నరసేపూ నీళ్లలో యీదిగాని జలకాలాడి గానీ పోవటానికి నిర్ణయించు కొన్నాం. కాకులు కూసేవేళకి నిద్రలేచి లేవకముందే నీళ్లలోనూకి యీదులాడటంలో వుండే మజా మరెందులోనూ లేదని జార్జి అన్నాడు. ఉదయాన్నే ఎంత


ఎక్కువగా యీదితే అంతబాగా ఆకలి అవుతుందని హారిస్సు అన్నాడు. అది వాడికిదివరకు ఎన్నోసార్లు అనుభవం కూడా అయిందట. హారిస్సుకి యిప్పుడు మామూలుగా అవుతున్న దానికంటే ఎక్కువ ఆకలి, యీ యీతలవల్ల కలగటమే నిజమైతే, వాణ్ణి అస్తే యీదనివ్వనని జార్జి సవాలు చేశాడు. ఆవిషయంలో ముందుగానే జాగ్రత్త పడకపోతే, ఆతరువాత కేవలం వాడిఆకలి తీర్చటం కోసమే మేమంతా రెక్కలు ముక్కలు చేసుకొని వాడి తినుబండారాలు చేరవేయ వలసి వస్తుందని హెచ్చరించాడు. నదిలో యీతల మూలంగా హారిస్సుకి నిజంగానే ఆకలి ఎక్కువై వాడి ముఖంలో శాస్త సంతోషమైనా తొంగిచూసే అవ కాశం అంటూ వుంటే, ఒకటి రెండు టన్నుల ఆహా రం వాడొక్కడి కోసం జేరవేసి అయినా సరే, వాడి చేత యీతలు కొట్టించటమే మంచిదని నేను వాదిం చాను. వాదించటమే కాదు: మెడలు వొంచి జార్జిచేత అందుకు ఒప్పించాను. దాంతో హారిస్సుగాడి స్నానా లకి అభ్యంతరం లేకుండా పోయింది.

ఇక మేము పట్టుకుపోవలసిన బట్టలను గురించిన చర్చ వచ్చింది. తలకొక రెండు ఫ్లానల్ సూట్లు సరిపోతాయని జార్జి అన్నాడు. అంతగా అవి మాసి పోతే మనమే వుతుక్కోవచ్చు నన్నాడు. "నదీ ప్రవా హంలో ఫ్లానెల్ బట్టలు వుతకటంలో నీకు పూర్వాను భవం వున్నదా?" అని నేనూ, హారిస్సూ జార్జిని అడిగాము. తనకైతే ఆ అనుభవం లేదుటకానీ, అను భవం వున్నవాళ్లని తాను ఎరుగుదుననీ జార్జి సమా ధానం యిచ్చాడు. మేముకూడా ఆక్షణంలో ఎందు కనో వాడిమాటలు నమ్మి, మర్యాదస్తులైన ముగ్గురు యువకులు నదీ ప్రవాహంలో బట్టలు వుతుక్కో గల రనే అనుకొన్నాం.

కానీ యీ విషయంలో జార్జి ఎంత నమ్మరాని మనిషో మాకు, ఆతరువాత కొంత కాలానికి కానీ, అనుభవానికి రాలేదు.

బనీన్లు, డ్రాయర్లు, మేజోళ్లు మాత్రం మస్తుగా తెచ్చుకోవలసి వుంటుందని జార్జి మాయిద్దరికీ నచ్చ చెప్పాడు. చేతిగుడ్డలు చాలినన్ని తెస్తే, అంట్ల గిన్నెలూ అవీ తుడవటానికి కూడా తడువుకో నక్కర లేదన్నాడు. బూట్స్‌తోపాటు ఒకజత ఆకుజోళ్లు కూడా తెచ్చుకుంటే ఎందుకైనా పనికొస్తా యన్నాడు.

(ఇంకావుంది)



నమస్తే!

చి|| కొల్లూరి జయలక్ష్మి

(8 సం||లు—ఏలూరు)

క్లోజప్‌లో ఇంద్ర ధనుస్సు

సినిమా ఎల్లా తీస్తారు?—4

సినిమా షూటింగ్ స్టూడియోల్లో నేజరుగుతుందని అందరికీ తెలిసినదే. బహిరంగ ప్రదేశాలలో షూటింగ్ జరపటం ఒక పట్టాన సాధ్యమయ్యే పనికాదు. కేబిల్స్, స్పాట్‌లైట్స్, కెమేరా మొదలైనవాటినీ, డైరెక్టరు, కెమేరామాన్, తారలు, మొదలైన బలగాన్ని ఎక్కడికిపడితే అక్కడికి చేరవెయ్యాటం బోలెడంత వ్యయప్రయాసలతో కూడిన పని. ఒకవేళ వ్యయ ప్రయాసలు భరించటానికి సిద్ధపడినప్పటికీ, ప్రకృతి మనతో సహకరించక పోవచ్చును.

"ఓ ప్రకృతిమాతా! మేమివ్వాళ కొన్ని మంచిసీన్లు షూట్ చేద్దామనుకుంటున్నాం. నువ్వు కాస్సేపు గప్ చిప్‌గా ఉండుతల్లీ!" అని మనం ప్రార్థిస్తే ప్రార్థించవచ్చును. కాని అన్నీ రెడీ చేసుకుని డైరెక్టరు "క్లాప్" అనటం, ఇంతలోకొంప మునిగిపోయినట్టు ఒక వాన మబ్బువచ్చి సూర్యుణ్ణి మూసెయ్యాటం, దాంతో పరిస్థితి మొదటకి రావటం జరుగుతుంది. లేకపోతే దగ్గర్లోవున్న ఏ ఫ్యాక్టరీయో చెవులు గింగురుమనేట్టు భూంకారం చేస్తుంది. లేకపోతే ఏ కాకో అరుస్తుంది. అందుచేత బహిరంగ ప్రదేశంలో షూటింగ్ జరపటం ఇబ్బందులతో కూడిన పని. అంతకంటే స్టూడియోలోకే హిమాలయ పర్వతాల్ని, మానస సరోవరాన్ని, వింధ్యారణ్యాలను పిలిపించుకోవటం చవకా, తేలికా కూడాను. స్టూడియోలో మనకేం కావలిస్తే అది, ఒక రైల్వేస్టేషను, ఒక మహారాజు భవనం, జనంతో కిక్కిరిసిన ఒక వీధి, ఏది పడితే అది నిర్మించుకోవచ్చును. నిజమైన రైల్వేస్టేషనుకంటే, నిజమైన వీధికంటె స్టూడియోలో కట్టినవే నమ్మకంగానూ, గ్యారంటీడ్‌గానూ ఉంటాయి.

స్టూడియో ఫ్లోర్‌లో షూటింగ్ దృశ్యాన్ని మొదటిసారిగా చూసేవారికి, భూకంపంతో ధ్వంసమైన నగరం, క్షతగాత్రులతో నిండిన యుద్ధభూమి ఇత్యాది భయంకర దృశ్యాలు జ్ఞాపకం వస్తాయి. సెట్ నిర్మాణం మహావిచిత్రంగా వుంటుంది. సుత్తులతో కొట్టేవాళ్ళు, బాడితెలతో చెక్కేవాళ్ళు, తెరలమీద పెయింట్ చేసేవాళ్ళు, స్క్రూలు తిప్పేవాళ్ళు ఇలాగ రకరకాల మనుషులతో ఆ ప్రదేశం బిలబిలలాడుతూ వుంటుంది. గోడలు, తలుపులు, కిటికీలు, స్తంభాలు, మేడమెట్లు, చెట్లు, చేమలు, రాళ్ళు, రప్పలు, మన పాంచభౌతిక ప్రపంచం ఏయే పదార్థాలతో సృజింపబడివుందో ఆపదార్థాలన్నీ ఫ్లోర్‌లోకి ధారాసదృశంగా ప్రవహిస్తూ వుంటాయి. వీటన్నిటినీ దేనిస్థానంలో దాన్ని అమర్చేసరికి, అక్కడికొక అంతఃపురమో, ఉద్యానవనమో ఏదో తయారవుతుంది. సినిమాలో రాజకుమారుడు కోటగోడ ఎక్రాకి అతి సాహసంగా ప్రవేశించిన ఏడో అంతస్తు గది ఫ్లోర్‌లో నేలకు జానెడెత్తునే వుంటుంది. కథానాయిక మేడమీదనుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకొన్న ప్రదేశం నేలకు రెండడుగుల ఎత్తునవుంటుంది. ఊర్వశి, తిలోత్తమ, నారదుడు సంచరించే మేఘాలు కేవలం స్టూడియోలో గోడలమీద అతుక్కుపోయి ప్రళయంవచ్చి పడినా కదలలేని స్థితిలో వుంటాయి.

షూటింగ్ జరిగేటప్పుడు కెమేరాదగ్గిర కెమేరామాన్, ఆయన తాలూకు మనుషులు, డైరెక్టరు, ఆయనచుట్టూ నటీనటులు, స్క్రిప్టు చేతులోపట్టుకుని అసిస్టెంటు డైరెక్టరు, లైట్లు అరేంజి చేస్తూ



చిత్రకార్ వారి "మషూకా"లో నటించిన హిందీ ప్లేబాక్ గాయకుడు ముఖేష్.

జెకోస్లోవాకియన్ రచయిత కారల్
చాపెక్ రచనకు అనుసరణ :
(నండూరి రామమోహనరావు)



భరణీవారి "చండీరాణి" లో భానుమతి

ఎలక్ట్రిషియన్లు, వీరుగాక ఊరికే చూట్టానికి వచ్చిన అతిథులు, యావన్మందీ తాళ్ళు, వైర్లు, లైట్లు, ఫాన్లు, కుర్చీలు తప్పించుకుంటూ, గొప్ప సంరంభంతో సంచరిస్తూవుంటారు.

ఆల్ రైట్ ! స్టార్ట్ !

"ఆల్ రైట్! ఇక మొదలుపెడదామా?" అని ఒక కళ్లజోడు పెద్దమనిషి విరక్తి భావంతో అంటాడు. ఈయనే డైరెక్టరు.

"ఇదేమిటండీ ఇక్కడ?" అని రామ్ములక్కాయలాగ ఎర్రగా కోటుపట్టించుకున్న ఒక ఆసామీ అడుగుతాడు.

"ఇది మీ ఆఫీసు గది. మూడో సీను, పదహైదో సీను ఈ గదిలోనే జరుగుతాయి", అని డైరెక్టరు వివరిస్తాడు.

"ఏ సీను ముందు?"

"ఏదైనా ఒకటే. పోనీ మూడో సీనే ముందు షూట్ చేద్దాం. మీరు ఆ బల్లదగ్గర కూర్చుని ఏదో రాసుకుంటూ వుంటారు. ఇంతలో ఎవరో తలుపు కొడతారు. 'లోపలికి రమ్మ'ని మీరంటారు. అంతే. దాంతో అయిపోతుంది. ఏం? ముందు కొంచెం రిహార్సు చేద్దామా?"

కోటు వేసుకున్న ఆసామీ బల్ల దగ్గర కుర్చీలో కూర్చుంటాడు. "ఇప్పుడు నేనేం చెయ్యాలి?"

"కాగితం తీసుకుని ఏదో రాస్తూ ఉండండి."

"ఇక్కడ కాగితం ఏమీ లేదే!"

"లేదూ?" అని డైరెక్టరుగారు విసుక్కుంటాడు. "అరె. బల్లమీద కాగితం లేకుండా ఇక్కడ పనెల్లా జరుగుతుందని? ఏమోయ్ కాయన్నా! వెంకయ్యగారికోసం ఇక్కడ బల్ల కుర్చీ వెయ్యమంటె అవిమాత్రం వేసి కాగితాలు పెట్టడం మానేశావా? అసలు నువ్వెప్పుడన్నా ఆఫీసు గది చూశావా? చూశావు, సరే. బల్లలమీద రాసుకునే కాగితాలుంటాయని తెలుసా? తెలియదూ? మాట్లాడవేం? తెలుసు. సరే. మరి కాగితాలెందుకు పెట్ట లేదూ? పోనీ ఇప్పుడైనా పెట్టు. ఓకే. సైలెన్స్. రిహార్సల్ మొదలెట్టండి."

ఇంతలో ఒకమూలనుంచి సుత్తి చప్పుడు వినిపిస్తుంది. డైరెక్టరు కోపం పట్టలేకపోతాడు. "ఏయ్, ఎవరక్కడ? సైలెన్స్ అంటే చప్పుడు చేస్తారేమిటి? బుద్ధిలేదూ?"

"అమూల ఇంకా కొంచెం పని మిగిలివుందండి," అని ఒక గొంతుక సమాధానమిస్తుంది.

"పనిఉంటే చప్పుడు చెయ్యకుండా చేసుకోలేరూ?" అని డైరెక్టరు కేకలేస్తాడు. "ఇక్కడ రిహార్సల్ జరుగుతోంది. సైలెన్స్!" అని చప్పట్లు కొట్టి "రామారావుగారు వచ్చి తలుపు తట్టుతాడు. వెంకయ్యగారు తలెత్తి 'ఎవరది? లోపలికి రండి,' అంటాడు. రామారావుగారెక్కడ?" అని డైరెక్టరు అడుగుతాడు.

అప్పటిదాకా ఒక సోఫాలో కూర్చుని ఎవరో అమ్మాయితో గుసగుసలాడుతున్న ఒక యువకుడు "ఇక్కడున్నానండి," అంటూ ముందుకు వస్తాడు. "ఏం చెయ్యమంటారు నన్ను?"

"ఈ తలుపు తట్టండి. వెంకయ్యగారు రమ్మనగానే తలుపు తెరుచుకుని దగ్గరికి రండి. అంతే. ఊఁ, తట్టండి."

రామారావు తలుపు తట్టుతాడు. వెంకయ్య తలెత్తుతాడు——



నవయుగ వారి "జ్యోతి"లో జి. వరలక్ష్మి.



చిత్రపోర్ వారి "ముషూకా" హిందీ చిత్రంలో సురయ్యా. ఇందులో దుర్గాఖోటె, కులదీప కౌర్, ముఖేష్, ఆగా మున్నగువారు నటించారు.

★ సినిమా ఎల్లా తీస్తారు? ★

"స్టాప్" అని డైరెక్టరు కేక వేస్తాడు. "నెమ్మదిగా తట్టాలి. నెమ్మదిగా, జంకుతున్నట్టు తట్టండి. ఊ, మళ్ళీ."

మళ్ళీ తట్టిన చప్పుడు. వెంకయ్య తలెత్తి, "ఎవరది? లోపలికి రండి," అంటాడు.

"స్టాప్" అని మళ్ళీ డైరెక్టరు కేక. "నెమ్మదిగా అనండి మహానుభావా! అలా గొంతు చించుకుని అరుస్తారేం? నెమ్మదిగా, కొంచెం నిర్లక్ష్యంగా 'ఎవరది? లోపలికి రండి', అల్లా అనాలి."

"ఎవరది? లోపలికి రండి."

"మరీ అంత నీరసంగా అంటారేమిటండీ? కొస్త గట్టిగా అనండి. తలుపు అవతలనుంచున్న వాడికి వినిపించాలా, వద్దా?"

వెంకయ్యగారు కొంచెం గట్టిగా "ఎవరది? లోపలికి రండి." అంటాడు.

"అలా కాదు, మహానుభావా! 'ఎవరది?' అని కొంచెం ఆగి 'లోపలికిరండి,' అనాలి. ఇప్పుడనండి."

"ఎవరది?......లోపలికి రండి."

"ఆ. చాలు. బావుంది. రామారావుగారూ! మళ్ళీ తట్టండి."

తలుపుతట్టిన చప్పుడు.

"ఎవరది? లోపలికి రండి."

"స్ప్లెండిడ్! చాలా బావుంది. ఆ, ఆ, లైట్లు వెయ్యండి," అని డైరెక్టరు పైకి చూస్తూ కేకేస్తాడు. "ఆ లైటు ఇంకా దగ్గర వెయ్యండి. సరిగ్గా వెంకయ్యగారి మీద పడాలి. లిమిట్, ఇంకా బ్రైట్ చెయ్యవోయ్. బల్లమీదికి ఫోకస్ చేస్తావేం? వెంకయ్యగారిమీదికి; ఇంకా, ఇంకా, ఊ. ఆ కిటికీకూడా బాగా కనిపించాలి. ఆ..."

ఈవిధంగా ఒక అరగంట గడిచాక,

"ఏమండీ, డైరెక్టరుగారూ! ఇక మొదలు పెడదామా?" అని వెంకయ్య నిస్సత్తువగా అంటాడు.

"ఓ. ఇక ఆలస్యమేమీలేదు. ఏం లైటింగ్ సరిపోయిందా?" అని డైరెక్టరు తన వెనకవున్న ఒక నల్లటి వస్తువుకేసి చూస్తూ అంటాడు.

"ఆ. కాని ఆ గోడమీద లైటు ఎక్కువ పడుతోంది," అని నల్లటివస్తువు వెనకనుంచి సమాధానం వస్తుంది. (ఆ నల్లటి వస్తువే కెమేరా.)

"ఆ గోడమీద లైటు తగ్గించండి...ఏం రైటేనా?"

"ఓకే" అని కెమేరామాన్ సమాధానమిస్తాడు.

"ఆ, ఇప్పుడు సౌండు రిహార్సల్ చేద్దాం."

ఇద్దరు మనుషులు మైక్రోఫోను తోసుకుంటూ వస్తారు. మైక్రోఫోను వెంకయ్యగారి తలపైగా వేళ్లాడుతూ వుంటుంది.

"సైలెన్స్!" అని డైరెక్టరు కేకవేస్తాడు.

"సైలెన్స్. సైలెన్స్" అనే కేకలు స్టూడియో అంతటా మోగుతాయి. బుర్ అనేశబ్దం వినిపిస్తుంది. "తలుపు తట్టండి," అని డైరెక్టరు అంటాడు.

తలుపు చప్పుడు. వెంకయ్య తలెత్తి "ఎవరది? లోపలికిరండి," అంటాడు.

"ఎలావుంది మిస్టర్" అని డైరెక్టరు కేకేస్తాడు.

రికార్డింగ్ బాక్స్ దగ్గిర్నుంచి ఒకాయన ఇవతల కొస్తాడు. "కొంచెం వీక్‌గా వుందండి," అంటాడు.

"మైక్ కొంచెం కిందికి దింపండి. వెంకయ్యగారూ! కొంచెం గట్టిగా అనండి. మళ్లీ, తలుపు-" అని డైరెక్టరు ఆజ్ఞాపిస్తాడు.

వెంకయ్య "ఎవరది? లోపలికి రండి," అని పరమ చిరాకుగా అంటాడు.

"ఇప్పు డెలావుంది?" అని డైరెక్టరుకేక.

"ఫరవాలేదు" అని రికార్డిస్ట్ అంటాడు.

"ఆల్ రైట్. ఇక షూటింగ్ మొదలెడదాం. అంతా రెడీ. సైలెన్స్ ప్లీజ్!"

చీమ చిటుక్కుమన్నా వినిపించేటంత నిశ్శబ్దం.

ఒక కుర్రాడు క్లాప్‌బోర్డు తెచ్చి వెంకయ్య ముఖానికి అడ్డంగా పట్టుకుంటాడు. బోర్డుమీద ఫలానాసీను, ఫలానా టేక్ అని రాసివుంటుంది. డైరెక్టరు 'క్లాప్' అంటాడు. కుర్రాడు క్లాప్‌చేసి శరవేగంతో వెనక్కి వచ్చేస్తాడు. కెమేరా చప్పుడు తప్ప అంతా నిశ్శబ్దం.

రామారావు తలుపుతట్టుతాడు. వెంకయ్య తలెత్తి "ఎవర్గది?" అని తరవాత ఏమనాలో జ్ఞాపకంరాక కంగారుపడి ఆగుతాడు.

"స్టాప్" అని డైరెక్టరు ఉరుముతాడు. "ఏమిటయ్యా, ఉన్నవి రెండు ముక్కలూ. ఆ రెండూ మర్చిపోతే ఇంకెల్లా? మళ్ళీ మొదలుపెట్టండి. సైలెన్స్! క్లాప్."

క్లాప్‌బోయ్ ఇందాకటిలాగే వచ్చి క్లాప్ చేసి వెనక్కి వెడతాడు. రామారావు తలుపు కొడతాడు.

వెంకయ్య తలెత్తి "ఎవరది?...లోపలికి రండి," అంటాడు. రామారావు తలుపు తెరచుకొని లోపలికి వస్తాడు.

"స్టాప్" అని మళ్ళీ డైరెక్టరు గర్జిస్తాడు. వెనక్కి తిరిగిచూసి "డామిట్, ఎవరక్కడ చప్పుడు చేసింది? ఎవరతను? ఎందు కొచ్చాడిక్కడికి? ఎవరు రానిచ్చారు? ఇదేమిటి, షూటింగ్ అనుకున్నాడా, తోలుబొమ్మలాట అనుకున్నాడా? నేను సైలెన్స్ అంటే సైలెంటుగా ఉండాలా అక్కర్లేదా?..."

ఈవిధంగా ఫ్లోర్‌లో ఒక చిన్న తుపాను ప్రారంభమవుతుంది. (సశేషం)

స్కూళ్లకు పనికివచ్చే చిత్రాలు.

—శ్రీ జి. ఎన్. భూషణ్

సినిమా మన నిత్యజీవితంలో ఒక ప్రధాన స్థానాన్ని ఆక్రమించుకొంది. ఇంకా ఏ యితర సాధనాలద్వారా సాధించలేని ప్రయోజనాన్ని 'సినిమా' ద్వారా సాధించగలిగేందుకు వీలుండబట్టే యీనాడు దానికి అటువంటి ప్రాధాన్యత ఏర్పడింది. సినిమా యొక్క ప్రయోజనాలను గుర్తించి కార్య సాధనకొరకు దానిని ఆచరణలో పెట్టడంలో మనదేశంకన్న యితర దేశాలు చాలా ముందంజ వేశాయి. ఇతర దేశ ప్రభుత్వాలు తమ కార్యకలాపాలను ప్రజలకు వివరించేందుకు, తమ సిద్ధాంతాలను ప్రచారం చేసేందుకు, ప్రజలను విజ్ఞానవంతులుగా చేసేం



అమాయకుడైన పుల్లయ్యకి అంతా వింతగానే కనబడుతున్నది.

నేషనల్ ఆర్ట్ ప్రొడక్షన్సు వారి "పిచ్చిపుల్లయ్య" లో ఎన్. టి. రామారావు.



ఆర్. కె. ఫిలిమ్స్‌వారి "ప్రేమలేఖలు" చిత్రంలో ప్రాణ్.

★ స్కూళ్లకు పనికివచ్చే చిత్రాలు, ★

ముకు సినిమాను ఒక ప్రధాన సాధనంగా ఉపయోగిస్తున్నారు.

సోషలిస్టు దేశాలు సినిమాయెడల చూపే ప్రత్యేక శ్రద్ధను ఏ యితర దేశాలు కూడా అంతగా చూపటం లేదనే చెప్పాలి. దీనికి కారణం సినిమాకు ఒక ప్రబలమైన శక్తి ఉండడమే. సోషలిస్టు వ్యవస్థా స్థాపకుడు లెనిన్ ప్రజలను విజ్ఞానవంతులుగా చేయడానికి ఉపకరించే ప్రధాన సాధనంగా సినిమాను పేర్కొన్నాడు. అందు మూలంగానే సోవియట్ రష్యాలో మారుమూలల పల్లెలకు గూడా ప్రభుత్వపు సినిమా కారులు వెళ్ళి బహిరంగ ప్రదర్శన లిస్తుంటాయి.

మాస్కోలో తయారయిన ఒక చిత్రం, తయారయిన రెండు రోజులలోగా దేశం అన్ని ప్రాంతాల్లోనూ ప్రదర్శించబడుతోంది అంటే ఆ ప్రభుత్వాలు సినిమాకు ఎటువంటి ప్రాముఖ్యం యిచ్చింది విశదమవుతోంది.

మన ప్రభుత్వం కూడా అటువంటి విధానాన్ని అవలంబించి ఉంటే ఎంతో బాగుండి ఉండేది. అయితే రెండు సంవత్సరాలకు పూర్వం ప్రభుత్వ స్కూళ్లలో విజువల్ ఎడ్యుకేషనల్ స్కీము నొకదానిని ప్రవేశపెట్టి సినిమాల ద్వారా విద్యాబోధన గరపే విధానాన్ని ప్రవేశపెట్టింది. ఆ విధానాన్నైనా సక్రమంగా అమలు జరిపిఉంటే ఎంతో ఉపయోగపడేది. ఆస్కీము నిర్వహణను ప్రభుత్వం తానుగా నిర్వహించడానికి బదులు ప్రభుత్వంచే రికగ్నైజు చేయబడ్డ కొన్ని ప్రయివేటు సంస్థలకు అప్పజెప్పింది. దానితో ప్రతి జిల్లాలోను చాలామంది ప్రొజెక్టర్లను కొని స్కూళ్ళలో ప్రదర్శనాలివ్వడం మొదలుపెట్టారు. ప్రదర్శనల కోసం విద్యార్థులనుండి ప్రత్యేకంగా కొంత డబ్బు వసూలుచేసి ప్రదర్శన లిచ్చిన సంస్థలకు ప్రభుత్వపు నియమిత రేటు ప్రకారం యిస్తూండేవారు. ఈ విధానం కూడా విజయవంతంగా కొనసాగలేదు. ప్రయోజనశూన్యమైన చిత్రాలు చూపబడుతూండేవి. మన వాతావరణానికనుగుణంగా విజ్ఞానదాయకమైన చిత్రం ఒకటే గూడా ప్రదర్శింపబడలేదు. ఏ తరగతి పిల్లలకు ఏ విధమైన చిత్రాలు చూపించాలి అనే విచక్షణ లేకుండా విదేశాలలో తయారయిన కొన్ని సైన్సు చిత్రాలు, అమెరికన్ జీవితాన్ని ప్రతిబింబించే చిత్రాలు, అమెరికన్ నగర వైభవాలని చిత్రీకరించేవి విరివిగా ప్రదర్శింపబడేవి. ఈ చిత్రాలు విద్యార్థులకు ఏ విధంగానూ ఉపయోగించకపోగా కనీసం వినోదాన్నికూడా యిచ్చేవి కావు. ఈ చిత్రాల నన్నింటిని ప్రభుత్వం విజువల్ ఎడ్యుకేషనల్ స్కీములో ప్రదర్శనార్హతగల చిత్రాలక్రింద ముద్ర వేసింది. ఈ స్కీముక్రింద తీసుకొనే సైన్సు చిత్రాలను తీసుకొంటే అన్నీ విదేశాలలో ముఖ్యంగా అమెరికాలో తయారయినవే. వీటి కన్నిటికి యింగ్లీషు కామెంటరీలు ఉన్నవే. కాబట్టి చిత్రం నడుస్తుంటే ఏ ఉపాధ్యాయుడో ఆ చిత్రాలకు రన్నింగ్ కామెంటరీ చెప్పాలి. ఆ చిత్రాలు పాఠ్యపుస్తకాలకి సంబంధం లేకుండా ఉపాధ్యాయులకు కూడా అర్థంకాని సాంకేతిక విషయాల్లో త్వరత్వరగా వెళ్తుంటే పిల్లలకు, ఉపాధ్యాయులకు అర్థంకాక ఎదురుగుండా గోడమీద బొమ్మలు కదుల్తుంటే చూసి ఆనందించేవారంతే. అంతకుమించి ఈ చిత్రాలద్వారా వచ్చిన ప్రయోజనమేమీ కనబడలేదు. ఇటువంటి చిత్రాలు నాలుగో, అయిదో చూపించి డబ్బుతీసుకొని తమ దారిని తాను పోతూండేవారు ఎగ్జిబిటర్లు. ఈ స్కీము వ్యాపారదృష్ట్యా లాభసాటిదగుటచే చాలామంది ప్రదర్శన లివ్వడం మొదలుపెట్టేసరికి వ్యాపారంలో పోటీ బయలుదేరింది. ఒకళ్ళకంటే ఒకళ్ళు పోటీబడి స్కూళ్ళ అధినేతలను ఆశ్ర



ఈనెల 6 వ తేదినుంచి ఓడియన్ లో ప్రదర్శింప బడుతున్న పారమౌంట్ వారి "హరికేన్‌స్మిత్" లో జేమ్స్ క్రేగ్, యివన్ డికార్లో.

యించడంలో చాలా రభస బయలు దేరింది.

ఇంతలోనే ప్రభుత్వం ఒక వార్త విని పించింది. స్కీమును ప్రభుత్వమే నిర్వహిస్తుందని ప్రయివేటు సంస్థలను గుర్తించబదని ప్రకటన చేసింది. దాంతో ఈ వ్యాపారస్థులలో కలకలం బయలుదేరింది. ఒక్కొక్కళ్లు యీ స్కీముమీద 10 వేలకుపైగా పెట్టుబడి పెట్టారు! ఆ పరికరాలన్నీ మూలబడ్డాయి. వాటిని వేరొకవిధంగా వినియోగించలేదు. ప్రభుత్వంపై ఎగ్జిబిటర్లు నష్టపడ్డామని ఆందోళన చేయడంలో వారిదగ్గర ఉన్న ప్రొజెక్టర్లు అన్నింటిని ప్రభుత్వం ఒక రేటు నియమించి కొనడం కూడా యిటీవలనే జరిగింది. ఆ విధంగా ఆ స్కీము విఫలమయింది.

స్కూలుకొక ప్రొజెక్టరు కొనుక్కొని ప్రదర్శన లివ్వవచ్చు అని ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతమున్న స్కూళ్ళలో ప్రొజెక్టర్లు కొని తరచు ప్రదర్శన లిస్తున్నారు. స్వంత ప్రొజెక్టర్లుగల స్కూళ్లను వేళ్ళమీద లెక్కవేయవచ్చు! మిగిలిన చాలా స్కూళ్లలో యీ విధానం పూర్తిగా లేదు.

ప్రొజెక్టర్లు కొనుక్కొన్న కొద్ది స్కూళ్ళలోనూ ప్రదర్శింపబడే చిత్రాలు పైన చెప్పినట్లు ఏ విధంగానూ స్కూలు పిల్లలకు వినియోగపడని అమెరికన్ బ్రిటిష్ సైన్సు చిత్రాలు, విదేశ ఆచార వ్యవహారాలను వ్యక్తపరచే చిత్రాలే. ఇందులో ఏ ఒక్కటీ మన వాతావరణానికి అనుగుణంగా చిత్రించబడే విద్యాబోధక చిత్రాలు లేకపోవడం శోచనీయం.

విజువల్ ఎడ్యుకేషన్‌యొక్క ప్రాముఖ్యతను యిప్పటికైనా ప్రభుత్వం గుర్తించినందుకు మనమంతా సంతోషిస్తాం. అయితే ఆ విధానాన్ని ఉపయోగకరంగా ఉండాలనే మనం వాంఛిస్తాం. ప్రభుత్వం యీ విషయాన్ని గుర్తించి మన విద్యార్థులకు సులువుగా అర్థమయే విజ్ఞాన విషయిక చిత్రాలను ప్రత్యేకశ్రద్ధతో నిర్మాణం జరిపించాలి. ఇంతవరకు కేంద్రప్రభుత్వమైనా అటువంటి ఏర్పాటు చేస్తున్నట్టు లేదు. ప్రభుత్వం డాక్యుమెంటరీ చిత్రాలను తీసే విధంగానే ప్రజలకు విద్యార్థులకు ఉపకరించే ప్రత్యేక చిత్రాలను తీస్తే ఎంతైనా ప్రయోజనం ఉంటుంది. అంతే కాని విదేశచిత్రాలను ప్రదర్శించడం ద్వారా ప్రయోజనం ఉండదని ప్రభుత్వం గుర్తించాలి.

ఇప్పుడైనా ప్రభుత్వం విజువల్ ఎడ్యుకేషన్ స్కీమును విజయవంతంగా నడిపితే బాగుంటుంది. ప్రొజెక్టర్లను కొనలేని స్కూళ్ళకు ప్రభుత్వం సౌండ్ ప్రొజక్టర్లనుసప్లయి చేసి అన్ని స్కూళ్లలోను ప్రొజెక్టర్లు వుండేలాగ చూడాలి. సైలెంటు ప్రొజెక్టర్లకంటె సౌండ్ ప్రొజెక్టర్లనే సప్లయి చేయడం అన్నివిధాలా శ్రేయస్కరం. ఎక్కువ మంది విద్యార్థులకు ఒక చిత్రం చూపేటప్పుడు ఉపాధ్యాయుడు యీ సౌండ్ ప్రొజెక్టరులోని ఆంప్లిఫైయర్ ద్వారా మైక్‌లో మాట్లాడేందుకు అవకాశ ముంటుంది. తెలుగు కామెంటరీలు గలిగిన చిత్రాలను

★ స్కూళ్ళకు పనికివచ్చే చిత్రాలు. ★

శబ్దంతో సహా చూపేందుకు యీ సౌండ్ ప్రొజెక్టర్లు వినియోగపడతాయి.

అయితే స్కూళ్లలో ప్రదర్శనార్హతగల ప్రత్యేక చిత్రాలు మనకు చాలాకొద్దిగా ఉన్నాయి. పాఠ్య పుస్తకాల మాదిరిగానే ఈ విద్యావిషయిక చిత్రాలకు కూడా ఒక సిలబస్ ఏర్పరచి చిత్రాలను ప్రభుత్వం నిర్మించవలసిన అవసరం ఎంతో వుంది. విదేశపు విద్యావిషయిక చిత్రాలలో మనకు ఉపయోగపడేవి చాలా తక్కువ కాబట్టి ఎక్కువ చిత్రనిర్మాణం జరగాలి. ప్రభుత్వానికి అటువంటి నిర్మాణం జరిపేందుకు అవకాశం తక్కువ అయితే సమర్థతగల సంస్థలద్వారా సిలబస్ ప్రకారం చిత్ర నిర్మాణం జరిపించి ఆచిత్రాలను ప్రభుత్వం కొనే ఏర్పాటయినా చెయ్యాలి. విద్యా విషయిక చిత్ర నిర్మాణానికి ప్రభుత్వ సహకారం ఎంతైనా అవసరం ఉంటుంది. అటువంటి సహకారాన్ని యిచ్చిఅయినా త్వరితంగా చిత్ర నిర్మాణం జరిపించి వాటి కాపీలు ప్రతి స్కూలుకు అందుబాటులో ఉండేలాగ జిల్లాకు ఒక ఫిలిం లైబ్రరీని స్థాపించి ఫిలింలను సప్లయి చేసి స్కీము విజయవంతం చేయాలి.

★



నేషనల్ ఆర్ట్ ప్రొడక్షన్సు వారి "పిచ్చిపుల్లయ్య" లో కృష్ణకుమారి.

సినిమా వార్తలు

అశ్వరాజ్ ప్రొడక్షన్స్ అనే పేరుతో శ్రీ గోపాలరావుగారొక సంస్థ స్థాపించి ఒక చిత్రం తీయనున్నారు. కథ, మాటలు, పాటలు శ్రీమల్లాది వెంకటకృష్ణశర్మ. దర్శకుడు వేదాంతం రాఘవయ్యగారు. సంగీతం ఆదినారాయణరావు. నటీనటులు అంజలీదేవి, నాగేశ్వరరావు, రంగారావు మున్నగువారు.

* * *

నేషనల్ ఆర్టు ప్రొడక్షన్సువారు తీస్తున్న "పిచ్చిపుల్లయ్య" దాదాపు పూర్తయినట్లే. మాటలు, పాటలు శ్రీ అనిశెట్టి సుబ్బారావు. దర్శకుడు శ్రీతాతినేని ప్రకాశరావు. కెమేరా రహమాన్. నటీనటులు జానకి, ఎన్. టి. రామారావు, కృష్ణకుమారి, ఛాయాదేవి, రమణారెడ్డి, గుమ్మడి వెంకటేశ్వరరావు, మహంకాళి వెంకయ్య, అమరనాథ మున్నగువారున్నారు. ఈ చిత్రం పూర్తయినా బహుశా జూన్ నెలాఖరుకో, జూలైలోనో గాని విడుదల కాదట.

* * *

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్‌వారి "పెంపుడు కొడుకు" ఇంకా పది, పదిహేను రోజుల షూటింగ్‌తో పూర్తవుతుందని తెలుస్తోంది. రెండు పాటలింకా రికార్డు చెయ్యవలసి వున్నదట. సంగీతం శ్రీ రాజేశ్వర రావు. దర్శకుడు శ్రీ ప్రసాద్. ఆయన కూడా ఇందులో ఒక చిన్న పాత్ర ధరించారు. పుష్పవల్లి, సావిత్రి, కుమారి, శ్రీ రామమూర్తి, గణేశన్, రంగారావు తదితర నటీనటులు. చిత్రం పూర్తయినా ఏ జులై ఆఖరుకో గాని విడుదల చేయరట.

* * *

ప్రకాశ్ ప్రొడక్షన్సువారు తీసే మూడు బాలచిత్రాల్లో ఒకటైన "బూరెల మూకుడు" పూర్తయింది. ఇది మూడు రీళ్ళ పొడుగున్న కేవల వినోద చిత్రం. దీని తరవాత చిత్రమైన "కొంటె కిష్టయ్య" స్కూలు విద్యార్థుల జీవితానికి సంబంధించి వుండి నీతిబోధకంగా వుంటుందట. మూడోది ఆరు రీళ్ల జానపద చిత్రమట. దీని కింకా పేరు పెట్టలేదు. ఈ జానపద చిత్రంలో కూడా పిల్లలే నటిస్తారు. ఈ మూడు చిత్రాలలో ఒకదానికీ ఒకదానికీ మధ్య రెండు నృత్య నాటికలుంటాయట.

★



రత్నదీప్ పిక్చర్సువారి "నవలఖాహార్" చిత్రంలో అరవిందకుమార్, మీనాకుమారి. ఇందులో నిరుపరాయ్, దుర్గాఖోటే, ఈశ్వర్లాల్, సుందర్ మున్నగువారుకూడా నటించారు. డైరెక్టర్లు హార్ సుఖ్ భట్, బాలచందర్ శుక్ల. సంగీతం భోలా శ్రేష్టా. బొంబాయి ప్రకాష్ స్టూడియోలో నిర్మితమైనది. రాజపుత్రస్థానంలోని రెండు రాజవంశాల మధ్యగల వైరానికి సంబంధించిన జానపదకథ. నవలఖాహార్ అంటే అమూల్యహారం.

ప్రశ్నలు..సమాధానాలు

శ్రీ ఎస్. ఎ. షెరీఫ్—విజయవాడ.

3-D ఫిల్ములు ఎలాగ తీస్తారు ? వాటిని ప్రదర్శించుటకు సినిమాహాలులో ఏ ఏ వసతులుండాలండి ?

—ఈవిషయమై 4-8-53 వారపత్రిక సినిమా శీర్షికలో "సినెరమా" అనేవ్యాసం ప్రకటించబడింది. అది చదవండి.

* * *

శ్రీ పి. ధనంజయపాత్రో—బరంపురం.

ఆంధ్రంలో 'గులేబకావలి' అను స్టంటు చిత్రం తీసిన తరువాత స్టంటు చిత్రాలకు స్వస్తిచెప్పారు. అందుకు కారణము ఏమిటి? అటువంటి చిత్రాలు మరి తీయరా?

—స్టంటు చిత్రాలు బాగా తక్కువ రకానికి చెందిన చిత్రాలు. తెలుగు నిర్మాతలు ఈ చిత్రాలజోలికి పోకపోవటానికి కారణమేమైనా, ఒక విధంగా మంచిపనే చేశారని చెప్పాలి.

* * *

శ్రీ డి. వెంకురెడ్డి—కొవ్వూరు.

మీరు ప్రతి ఒక్క సినిమానూ విమర్శించుతూ వున్నారు. అన్ని లక్షణములూ బాగా వున్నవనిన సినిమాను మీపత్రిక ద్వారా నేను ఇప్పటికి వినలేదు. మీపత్రికల వారంతా సినిమాను కేవలం విమర్శనా దృష్టితోనే చూస్తారా ?

—అన్ని పత్రికలూ విమర్శనా దృష్టితో చూస్తారో లేదో మాకు తెలియదు. కాని విమర్శనాదృష్టితో చూసే పత్రికలలో మాపత్రిక ఒకటి. పాఠకులలో విమర్శనా దృష్టి పెంపొందించటమే పత్రికలఆశయం. విమర్శన అనేమాటకి అర్థం తిట్టడం కాదు, నిష్పాక్షికంగా, సమగ్రంగా పరిశీలించడం. కనుక విమర్శించటం తప్పేమీకాదు. అదల్లా వుంచి అన్ని లక్షణాలూ బాగావున్న సినిమా మీరెక్కడన్నా చూస్తే చెప్పండి. మేము కూడా చూసి ఆనందిస్తాం.

* * *

శ్రీ నల్లపాటి రామప్పనాయుడు—రంగాయిపురం.

13-5-'53 వ తేదీ వారపత్రికలోని "కాలక్షేపం" అను శీర్షిక క్రింద శ్రీ దాసు వామనరావుగారు "ప్రవరుడు హిమాలయ ప్రాంతాలకు చేరిన పిమ్మట ఎండ వేడికి, చెమట పోసి పాదలేపనం కరిగి, కాళ్లు కడిగికొన్నట్లయింది" అని చెప్పిన విషయం "మను చరిత్ర" లోనిదా? లేక ఆయన స్వాభిప్రాయమా? స్వాభిప్రాయమైతే హిమాచలప్రాంతంలో చెమట పుట్టించునంత వేడిని ప్రసాదించు ఎండ గాయుచున్నదా?

—ప్రవరుని పాదలేపనము కరగటానికి కారణం చెమటకాదు, మంచునీళ్లే. ఈ విషయం గుర్తుకు తెచ్చినందుకు వామనరావుగారు మీకు కృతజ్ఞత తెలుపుతున్నారు. అయితే హిమాలయ ప్రాంతంలో కూడా నడివేసవి కాలంలో బహు తీవ్రమైన ఎండ కాస్తుంది. ★

గ్రంథ స్వీకారము

సౌభాగ్య: బుద్ధ జయంతి ప్రత్యేక సంచిక. వెల 3 అణాలు. సోమశేఖరశర్మగారు, తిమ్మావజ్ఝల కోదండ రామయ్యగారు, చర్ల గణపతిశాస్త్రిగారు మొదలగు రచయితల ఉత్తమ వ్యాసాలతో జాషువాగారి పద్యాలతో ప్రత్యేక చిత్రాలతో ఈ ప్రత్యేక సంచిక ఆకర్షణీయంగా ప్రచురించబడింది. ఇది స్త్రీజనాభ్యుదయ శాఖవారి ప్రచురణ. చిరునామా : 7 ఆరాముదు గార్డెన్ స్ట్రీట్, ఎగ్మూరు, మద్రాసు—8.

★ దత్తత ★

(19–వ పేజీ తరువాయి)

శాంతమ్మ లక్ష్మి చేతిలో మజ్జిగపాత్ర చూసి ఆశ్చర్యపడింది.

రవికూడా మొదట్లో ఆశ్చర్యంగానే చూశాడు. తరువాత మెల్లగా నవ్వుకున్నాడు.

ఆ నవ్వునకు అర్థమేమిటో లక్ష్మి గ్రహించలేకపోయింది. రవికేసి చూసింది.

"నే నడిగింది ఏమిటి?" అన్నాడు రవి.

చేతిలో పాత్రచూచుకొని "ఏమడిగావూ?" అంది.

"చారు కదూ?" అంటూ నవ్వాడు.

"ఇదికూడా అవసరమేగా" అని క్రింద పెట్టింది. ఆ నవ్వులో ఆమె పాల్గోలేదు. ఇదే మరొకప్పుడైతే, ఆమె చేసిన పొరపాటునకు తప్పక ఆమెకూడా నవ్వేదే.

లక్ష్మి చారుకోసం లోపలకు వెళ్ళిన తర్వాత రవి తల్లికేసి చూస్తూ "లక్ష్మికి పెళ్లిమాట విన్నదగ్గర్నుంచీ—మనస్సు అంతా అత్తారింటిదగ్గరే ఉంటున్నట్లుంది" అన్నాడు.

శాంతమ్మకూడా ఏమీ సమాధాన మివ్వలేదు. మనస్సులో మాత్రం 'మనస్సు ఒకచోట, మనువు ఒకచోట... పగవాళ్ళకైనా ఈలాంటి శిక్ష యివ్వకు భగవాన్' అనుకొంది.

మరొకనాడు వీధిలోనుంచి వచ్చిన ధర్మయ్య తన గదిలో కాలుపెట్టి ఆశ్చర్యంగా చూస్తూ నిలబడిపోయాడు.

లక్ష్మి తలగడలో తలదూర్చి వెక్కి-వెక్కి-ఏడవడం కళ్ళారా చూశాడు. కంగారుగా మంచందగ్గరకు వెళ్ళి మంచంమీద కూర్చుని "లక్ష్మి" అని పిలిచేవరకూ లక్ష్మి తండ్రి వచ్చినట్లుగా గుర్తించలేదు. తృళ్ళిపడి లేచి కళ్ళు తుడుచుకొని గదిలోనుంచి వెళ్ళబోయింది. కాని ధర్మయ్య ఆపుచేశాడు.

"ఎందుకమ్మా ఏడుస్తున్నావ్!" అని అడిగాడు.

లక్ష్మి ఏం సమాధానం చెబుతుంది. "అబ్బే! ఏమీలేదు నాన్నా!" అని తల వంచుకొంది.

ధర్మయ్యకూడా లేచాడు. "నా దగ్గర దాస్తావెందుకమ్మా... ఏమిటి చెప్పవూ?" దగ్గరగా వచ్చి అడిగాడు.

"అందనిపండు" అన్న శాంతమ్మ మాట లక్ష్మికి గుర్తువచ్చింది. అనిస్తే మనస్సులో మలినం వెళ్ళడికావడం తప్ప ఫలితం లేదనుకుంది.

"ఏమిటన్నయ్యా!" అంటూ శాంతమ్మకూడా గదిలోకి వచ్చింది. శాంతమ్మను చూసిన లక్ష్మి సిగ్గుతో తలను మరీ క్రిందకు దించుకుంది.

బాధగా-బాధ్యతగా శాంతమ్మకేసి తిరిగి "నేను వచ్చేటప్పటికి లక్ష్మి వెక్కి-వెక్కి-ఏడుస్తోందమ్మా!" అన్నాడు.

శాంతమ్మ నవ్వింది. ఈ నవ్వు శ్రేయాభిలాషిత్వాన్ని కాంక్షించే నటనా పూర్వకమైందిగా ధర్మయ్య గ్రహించలేదు.

"తల్లి లోటులేకుండా పెంచిన తండ్రిని విడిచి అత్తింటికి వెళ్ళడమంటే; ఆడబిడ్డకు ఎంత బాధ" అంటూ లక్ష్మిదగ్గరగా వచ్చి తలపై చేయివేసి "తలుచుకున్నప్పుడల్లా కళ్ళనీళ్ళు వస్తాయి... ఊరుకోమ్మా" అంది.

ఈ మాట విన్న మర్మంలేని ధర్మయ్య హృదయం ఒక్కసారి తరుక్కుపోయింది.

★ దత్తత ★

పై కండువాతో కళ్లనీళ్ళు తుడుచుకుంటూ "తప్పమ్మా! పెళ్ళయ్యి వెళ్ళేటప్పుడు కదా బాధపడాలి...నిన్నుమాత్రం విడిచిపెట్టి నేనుండగలనా అమ్మా" అని ఓరడించాడు.

లక్ష్మి మెల్లగా అక్కడనించి వెళ్ళిపోయింది. ధర్మయ్య కండువా దండెంమీద వేసి మంచంమీద కూర్చున్నాడు. శాంతమ్మ కూడా ఆ గది విడడానికి ప్రయత్నించే ముందే ధర్మయ్య ఈలా అన్నాడు "రేపు మూడుగంటలకు వస్తారట"

"ఎవరూ" శాంతమ్మ అడిగింది.

"పెళ్ళికొడుకూ మరో యిద్దరు పెద్దలూనూ"

"ఇదేమిటే" శాంతమ్మ ఆశ్చర్యంగా అని "పెళ్ళికొడుకు రావడమేమిటే?" అంది.

"లక్ష్మిని చూడ్డానికి..."శాంతమ్మలో ఆశ్చర్యం ఆలాగే ఉండటం చూసి "ఇదేం కొత్తకాదమ్మా! ఇప్పుడు పెళ్ళిళ్ళన్నీ ఆలాగే జరుగుతున్నాయి" అన్నాడు ధర్మయ్య.

ధర్మయ్యకు సంతృప్తికరమైన ఈ వార్తకు శాంతమ్మ అంత ఆశ్చర్య పడవలసిన అవసరం లేదనుకుంది.

ధర్మయ్య ఏదో ఆలోచిస్తూ పైకిలేచి ముహూర్తంకూడా రేపే నిశ్చయిస్తారు" అని కూడా అన్నాడు.

"ఈ విషయం గంగాధరం గారికి తెలుసా?"

"ఇప్పుడే ఎందుకూ?" అమాయకంగా అడిగాడు ధర్మయ్య.

"నీకు తెలీదన్నయ్యా!" మెల్లగా అంది. ధర్మయ్య ఆశ్చర్యంగా చూశాడు.

"ఉదయాన్నే వెళ్ళి వారిని కూడా రమ్మని పిలువు"

ఈ మాటకు ధర్మయ్య నవ్వాడు. తనకు తెలీదని నిరూపించిన శాంతమ్మ తెలివి ఇంత ఘనంగా ఉందేమో అనుకున్నాడు.

"జమీందారు మనయింటికి రావడమా?" అన్నాడు.

"అబ్బే! నేను చెప్పేది నీ కర్థం కాలేదు" అని గుమ్మంవైపు ఒకసారి చూసి "ఈ గౌరవం ఆయన కివ్వడం చాలా మంచిది. ఆయన రాకపోయినా రాము రావడానికి అభ్యంతరం ఉండదుగా. పైగా రేపు డబ్బు యిచ్చే బాధ్యత ఆయనపైనున్నప్పుడు చెప్పకుండా ముహూర్తం పెట్టడం మంచిదంటావా" అని ప్రశ్నార్థకంగా మొగంపెట్టింది.

మగవాళ్లు ఎంత తెలివైనవాళ్ళని మురిసినా - పెళ్ళిళ్ళ విషయాల్లో ఆడవాళ్ళు సూచించే సౌలభ్య మార్గాలకు - ఆ మురుపు మరచి, తమ అనాలోచితానికి నివ్వెరపడ్డం కూడా సహజమేమో; శాంతమ్మ చెప్పిన పద్ధతికి ధర్మయ్య ఎక్కువ కాలాన్ని వినియోగించకుండా వెంటనే ఆమోదించాడు.

జమీందారు ఉదయంస్నానమైంతర్వాత గదిలో బట్టలు వేసుకుంటున్న సమయంలో మల్లయ్యరావడం ఎదురుగాఉన్న అద్దంలో చూశాడు.

"ఏమిరా?"

"ధర్మయ్యగారు వచ్చారు"

జమీందారు వెనక్కి తిరిగాడు "అబ్బాయి లేచాడా?" అని అడిగాడు.

"లేవనుకుంటానండి"

"ఛా!" అసమాధానికి వచ్చినకోపంతో ముందు ఆలా అని తర్వాత వెళ్తే మల్లయ్యను చూసి "మాట" అని పిలిచాడు. మల్లయ్య వెనక్కి తిరిగి చేతులు నలుపుకుంటూ అభినయిస్తున్నాడు.

"వారిని కూర్చోమని చెప్పి నువ్వు వెళ్ళి డాక్టర్ని పిలుచుకురా"అన్నాడు. మల్లయ్య వెళ్ళిపోయాడు. హాలులో కూర్చున్న ధర్మయ్య గంగాధరం రావడం చూసి లేచాడు.

"కూర్చోండి! ఏమిటి విశేషం?"అంటూ జమీందారు సోఫాలో కూర్చున్నాడు.

"ఈరోజు ముహూర్త నిశ్చయానికి పెళ్ళిపెద్దలు వస్తున్నారు" అన్నాడు ధర్మయ్య. ఈమాటకు జమీందారు మొగంలో ఆనందం వ్యక్తమయింది.

"భేష్! పట్టుదలంటే ఆలా వుండాలి" అని ఒక పొగడ్తను అయాచితంగా విసరి "శుభం! ఏర్పాటుచేయండి" అన్నాడు.

"మీరుగూడా..."

"ఎక్కడికి?"

గంగాధరంప్రశ్నకు ధర్మయ్య వెంటనే సమాధానమివ్వలేదు. లాంఛనప్రాయంగా - శాంతమ్మ అభిప్రాయానుగుణంగా అడగాలనే ఉద్దేశంతప్ప, అది ఎంతవరకూ సఫలీకృతమౌతుందో ధర్మయ్యకు తెలుసు. అందుకే ఆ మాట పూర్తి చేయనూలేదు. బలంగా ధ్వనించనూ లేదు. కాని జమీందారు ధర్మయ్య ఉద్దేశాన్ని సులభంగానే గ్రహించారు.

"నేనెందుకూ?" అన్నాడు.

"మీరు రాగల అవకాశం ఉండదని నాకు తెలిసినా - కావలసినవారు కావడం వల్ల అడగడం సాధర్మం" అన్నాడు.

ఈధర్మం అనే పదానికి జమీందారు మెదడులో గతం ఒక్కసారి స్ఫురించింది. తనలో ఒక్కసారినవ్వుకున్నాడు. ఎందుకు నవ్వాడో ధర్మయ్యకు కూడా తెలుసుకున్నాడు. జమీందారు ఎదురు ఆ పదం వాడ్డం మంచిది కాదనుకున్నాడు.

"కావచ్చు - పెళ్లికేలాగూ రావడం తప్పదుగా" అన్నాడు జమీందారు.

"రాము రావడం మీకు అభ్యంతరం లేకపోతే..." అనే ధర్మయ్యమాట పూర్తికాని క్రితమే జమీందారు ఈలా అన్నాడు. "వాడికి వంట్లో అంతగా బావుంటల్లేదు"

"ఏం?"

ధర్మయ్యప్రశ్నకు జమీందారు ఏంసమాధానం చెబుతాడు. కారణం కొంతగా తెలుసున్నా - పూర్తి కారణం కూడా అది కాదేమోఅనేనమ్మకంకూడా జమీందారుకు లేకుండా పోలేదు.

"పరీక్షలుకదూ రేయింబవళ్లు మేలుకుంటే; కాస్త ఆరోగ్యం పాడైంది"

"కాలేజీకి వెళ్లడల్లేదా?"

"లేదు" అంటూ జమీందారు లేచాడు. "నాకు పనుంది.....చాలా సంతోషం. ముహూర్తం పెట్టినతర్వాత కనుపించండి" అని చెప్పి, ధర్మయ్య ఏం చెప్పినా వినగల పరిస్థితిలో లేనట్లుగా వెళ్లిపోయాడు.

ధర్మయ్యకు రామునిచూడాలని, పలకరించాలని ఉంది. కాని ఆ విశాలభవంతిలో ఏగదిలో రాము ఉంటాడో, ఎవర్ని అర్థించి రాముని చూడాలో అర్థం కాలేదు. కాస్సేపుఆలాగేచూసి తిరుగుమొగంపట్టాడు ధర్మయ్య.

ధర్మయ్య తిరిగివచ్చినతర్వాతఈవిషయం శాంతమ్మతో చెప్పడం గదిలోఉన్న లక్ష్మి వింది. కాని ఆమె ఏమీ ఆందోళన పడలేదు.

శాంతమ్మ మనస్సుమాత్రం ఈవార్త విన్నతర్వాత ఆందోళన పడింది "ఎలా వుందో" అని ధర్మయ్య నడిగింది.

ఈవేళ పనిలోకి వెళ్లకుండా ముహూర్త నిశ్చయ శుభవార్తకోసం కూర్చున్న రవి "పేపరు చూస్తూ ఆ - జమీందార్ల రోగాలు చాలా విచిత్రంగా ఉంటాయి లేమ్మా" అన్నాడు.

"నువ్వూరుకో" అంది శాంతమ్మ.

నాకెందుకూ అన్న భావంతో రవిచూసి, మళ్లీ వార్తా పత్రిక చదవడంలో మునిగిపోయాడు.

"ఏదో కాస్త నలతగాఉండి ఉంటుంది. సాయంత్రం మళ్ళీ వెళతాగా" అన్నాడు ధర్మయ్య.

★ ఆజ్ఞ ★

(25-వ పేజీ తరువాయి)

రుటండీ, ఏమండీ కొంప మునిగిపోయినా రుటండీ. (ఏడుపు)

మహా : తమ్ముడూ.

విద్యా : మామయ్యా, మామయ్యా !

లక్ష్మి : బాబూ, బాబూ !

ప్రసూ : నా కన్యాయం చేసి ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు.

దుర్గాం : మన ప్రాణాలమీదకూడా తెచ్చిపోయినారే ! కొంప మునిగిందే తల్లీ!

* * *

ప్రసూ : ఏమిటమ్మా ఆ మాటలూ.

దుర్గాం : నువ్వు విద్యాసాగర్ని చేసుకోకపోతే అడుక్కుతింటూ పోవాల్సిందేనే తల్లీ

ప్రసూ : ఏం?

దుర్గాం : నువ్వు వాణ్ణి చేసుకోకపోతే ఆస్తి అంతా యూనివర్సిటీకి పోతుందే.

ప్రసూ : ఇష్టం కొనిదాన్ని విద్యాసాగర్ మాత్రం చేసుకుంటాడా ?

దుర్గాంబ : డబ్బుకు మొహం వాచిన వాడు ఏ పనయినా చేస్తాడే.

ప్రసూన : అంత డబ్బుకు కక్కుర్తి పడితే నేనూ వాడికి శాస్తి చేస్తాను. పెళ్ళి చేసుకొంటే ఆస్తి దక్కుతుందిగా, చేసుకొంటే కాపరం చేయ్యాలని లేదే !

దుర్గాంబ : నిజమేనే ?

* * *

మహా : నాయనా ; మనం యీ డబ్బు లేకుండా యిన్నాళ్ళు బ్రతకలేదా. ఈ డబ్బు మనకొద్దు, ఆ రాక్షసితోనూ దాని కూతురుతోనూ మనం వేగలేం బాబూ వెళ్ళిపోదాం పద.

లక్ష్మి : అట్లా కాదు. మహాలక్ష్మమ్మగారూ, అయ్యగారు ఏ కష్టమొచ్చినా, ఏ నష్టమొచ్చినా, అయ్యగారి ఆజ్ఞ చెల్లిస్తానని వాగ్దానం చేశారే.

విద్యాసాగర్, అవునమ్మా, నేను ఆస్తికి కక్కుర్తిపడి యీ పని చెయ్యడం లేదు. ఒకవేళ ప్రసూన అంగీకరించకపోతే చిక్కు తీరిపోతుంది. అప్పుడు నా ఆత్మ మాట తప్పినందుకు వ్యథపడదు.

ప్రసూ : నేను అంగీకరిస్తున్నాను. వివాహానికి అన్నీ సిద్ధం చేయించుకోండి.

మహా : ఇది ఒక ఆజ్ఞలాగే వుందే.

ప్రసూన : అవును, ఆజ్ఞే.

విద్యా ! నన్ను ప్రేమిస్తున్నావా ప్రసూనా ?

ప్రసూన : మనకు ప్రేమతో నిమిత్తం లేదు. పెద్దవాళ్ల ఆజ్ఞలు పాలించడమే పరమావధి.

* * *

(నాదస్వరము)

విద్యా : అదేమిటి ప్రసూనా అల్లా దూరంగా నుంచున్నావేం ? నన్ను అంగీకరించేగా వివాహం చేసుకున్నావు.

ప్రసూన : అంగీకరించి చేసుకోలేదు. ఆస్తికోసం చేసుకున్నాను. నీ జీవితం భగ్నం చేయడానికి చేసుకొన్నాను.

విద్యా : నేను నీకేం ద్రోహం చేశాను ?

ప్రసూన : నా తండ్రికి మేనల్లుడవు కావడం, ఆయన ప్రేమకు పాత్రుడవు కావడం.

విద్యా : ప్రసూనా ; అంత రాక్షసం కూడదు. నేను నిన్ను ప్రేమించాలనీ, సంరక్షించాలనీ మామయ్య విల్లులో ఆజ్ఞాపించాడు. నేనూ నిన్ను నిజంగా ప్రేమించాను.

ప్రసూన : ప్రేమించావా ; పాపం నీ మూలాన నా ప్రేమ నాశనమైంది. నేనూ నీ ప్రేమ నాశనం చేస్తాను. నువ్వు పరిపాలించదలుచుకున్న మేనమామగారి ఆజ్ఞను ధ్వంసం చేస్తాను. పెళ్ళి అయితే నా ఆస్తి నాకు వస్తుందిగా సంచు. నన్ను ముట్టుకోకు.

విద్యా : ప్రసూనా, నేను నీ భర్తను.

ప్రసూ: భర్త నయినంతమాత్రాన ఇష్టం లేని స్త్రీని బలాత్కరించేటంత నీచుడవా?

విద్యా : కాను ప్రసూనా! అసలు నీ ప్రేమను కోరిచేంత నీచుణ్ణి కాను. నేను మామయ్య ఆజ్ఞ పాలించాను.

ప్రసూ : నేను నా తండ్రి ఆజ్ఞను పాలించేను కాని, నేను చేసిన పనిలోనుంచి బయటపడే శక్తి నాకుంది. నీవంటి అడర్నాలముద్ద ఏం చెయ్యాలో తోచక కుళ్ళి కుళ్ళి చస్తాడు. పేరుకు మాత్రమే నేను నీకు భార్యను. ప్రేమించేది మరొకర్ని. చెయ్యి ఏం చేస్తావో చెయ్యి! ఆ స్వర్గంలోనో నరకంలోనో వున్న ఆయన ఏం చేస్తాడో చెయ్యనీ.

విద్యా : మామయ్యా, నీ ఆజ్ఞతో రెండు తరుణ జీవితాలను నాశనం చేశావయ్యా! ★

గదిలో ఒంటరిగా కూర్చున్న లక్ష్మిదగ్గరకు శాంతమ్మ వచ్చింది.

“నువ్విలా ఉండటం మంచిదికాదమ్మా” అని లక్ష్మిని మందలించింది.

ఇదేమి టన్నట్లు లక్ష్మి ఆశ్చర్యంగా చూసింది.

“ఒకళ్లగురించి మరొకళ్లు క్షోభ పడితే ఊరికేపోదులక్ష్మీ!” అని దగ్గరగా కూర్చొని మెల్లగా “విన్నావా ? రాముకి నీరసంగా ఉందట. నువ్వు సంతోషంగాఉంటే...” అంది. లక్ష్మి అంతవరకూ ఏమీ మాట్లాడలేదు. మధ్యను శాంతమ్మకు ఈబాధ దేనికో లక్ష్మికి అంతుపట్టలేదు. లక్ష్మి తీక్షణంగా చూసి “నువ్వనేది ఏమిటత్తా” అని కొంత విసుగ్గా అడిగింది.

శాంతమ్మ ఆస్వరం విని కొంత జంకింది. సమాధానంమాత్రం ఏమీయివ్వలేదు. లక్ష్మి బరువుగా నిట్టూర్చి, తడి నిండిన కళ్ళతో “నేను నాశనమైనా రాము సుఖంగా ఉండాలనిభగవంతుణ్ణిఎప్పుడూకోరుతున్నా...ఆయనకు అపకారం కలగాలనే కోరిక నాకెప్పుడూ లేదత్తా!” అంటూ తలవంచుకొని ఉద్వేగంతోవచ్చే దుఃఖాన్ని ఆపుకొనే ప్రయత్నమంతా వేళ్లతో మెలివేసే పమిటచెంగుమీద చూపుతూంది.

“ఛీ! ఊరికేఅన్నాను”అంటూ శాంతమ్మ లక్ష్మి కళ్లనీళ్లు గోటితో మెల్లగా మీటుతూ ఊరడించింది. (ఇంకావుంది)



జూన్ నెల 2 వ తేదీ బ్రిటిష్ సింహాసనానికి పట్టాభిషిక్తురాలైన ఎలిజబెత్తు రాణి

తేనెతో, పంచదారతో, ఆవకాయతో మినపరొట్టె ఎంతెంత బావుంటుందో ధారాళంగా వర్ణించాడు. హఠాత్తుగా ఆగి వెనక్కి చూశాడు, ఎవరో చిరునవ్వు నవ్విన అలికిడయి. మళ్లా యిటు తిరిగాడు, యిటెవరో నవ్వారని. ఒక్కుమ్మడిగా చుట్టూ వున్న తోటి వుద్యోగులంతా పగలబడి నవ్వారు."

సుబ్రహ్మణ్యం గారు ఆగి, వూపిరి పీల్చుకుని నెమ్మదిగా అన్నారు "కిరాతార్జునీయం చదివారూ? ఈశ్వరుడూ, అర్జునుడూ కూడా ఒక్కమాటే గురి చూసి వేసిన బాణాలు వరాహాన్ని కెడా పెడా తగల్డంతోటే, ఆయొక్క వరాహం నొప్పికన్నా ఎక్కువయిన ఆశ్చర్యం తట్టుకోలేకా, నొప్పి సంగతి దేమురుగా, అసలు బాణం ఎటునించొచ్చిందో కనుక్కోవాలని అటూ యిటూ, యిటూ అటూ, మళ్లా అటూ యిటూ మహా వేగంతో తలతిప్పి చూసిందట. ఆ పుస్తకం రాసిన క) అంటాడూ, ఆ సమయంలో గనకా ఎవరో గనక్ద్రయినా చెట్టెక్కి చూసినట్టయితే, ఆ పందికి రెండు తలలున్నాయని ఆశ్చర్యపోనూ, అని......అదుగో నయ్యా-అదే! సరిగ్గా అంతే, ఆవేళ అడివిలో ఆ వరాహం, యివాళ మళ్ళా ఆఫీసులో అవతారం, తల సమాన వేగంతో ఆడించాడు. అందరూ నవ్వుతున్నారని నిర్ధారణగాగానే అవతారం తల ఆగింది. బిత్తరపోయి చూశాడు. పెద్ద గుమాస్తా అన్నాడు చివరికి. "చాల్లేవయ్యా అవతారం! మరీ పోకడలు పోతున్నావ్ మినపరొట్టె కవిత్వంలో. నీకసలు మినుపు లెక్కడ దొరికాయంట? ఆ వేళ డబ్బాలో పోసి నీకిచ్చినవి మినువులు కావని యింటికెళ్ళగానే తెలీలా? మేమే దాంట్లో గంట్రెడుక పోసిచ్చాం తమాషాకి. మామీదే కవిత్వం వెలిగిస్తున్నావ్" అంటూ నిల్దీసి అడిగాడు.

అవతారం ఏడవబోయి నవ్వేశాడు గబుక్కున. ★

★ కాలక్షేపం ★

(5-వ పేజీ తరువాయి)

యీ పట్టణం తలమానికం కావాలంటే, అందుకు తలనూనె ఖర్చు చాలా అవుతుంది. హేరాయిలు ఖర్చుకు (*Hair oil* ఖర్చుకు). రాయలసీమ వెనుకంజ వేయదు కాబోలు. హే! రాయలుసీమా! హేరాయిలు ఖర్చు సీమా! అని స్మరించవలసి వస్తోంది. ఈ కరువుసీమ మనకు లేకుండా తొలగిపోయింది అని గత బడ్జెటు సమావేశంలో శ్రీమాన్ రాజగోపాలాచార్యుల వారు అన్నారు రాయలసీమ అంటే రవ్వంత అయినా గౌరవం లేకుండా.

ఢిల్లీ ప్రభుత్వం ఆరుకోట్లకు పైగా అప్పుయివ్వాలి. కర్నూలు నగరానికి కనకాభిషేకం జరగాలి.

"అప్పిచ్చువాడు మనకిక
చొప్పడకున్నట్టియూరు
చొరకుము సుమతీ!

ఇదే మంచిబుద్ధిగలవారికి నీతి-ఇదే మంచిబుద్ధిగలవారికి రాజనీతి—— ★


★ ప్రాప్తి ★

(9-వ పేజీ తరువాయి)

చేయబడుతున్న, చేయబడబోయే, చేయడానికి వీలుగా వున్నవి వివిధరకాల పిండి వంటల వివరాలు వర్ణించాడు. పట్టు

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras

కాశీ ఘాట్



ఫోటో—శ్రీ ఆర్. భద్రిరాజు (వెల్ల, తూ. గో. జిల్లా).